
పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల రోగులకు పసమూలికలతో వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు
జాతీయ తెలుగు దిన పత్రిక
website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :25 | సంచిక :79 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | బుధవారం 29 జూలై 2026 | పేజీలు :12 | వేల రూ5 /-


## లీగల్ నోటీసులతో సరి...

హైదరాబాద్, జూలై 28:తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య సాగుతున్న ప్రత్యక్ష పోరు సరికొత్త మలుపులు తిరుగుతోంది. ఇంటర్మీడియట్ మార్కుల వివాదంతో ముడిపడిన గ్లోబ్ఎరీనా సంస్థ కేటీఆర్‌దేనని, అది ఆయన బినామీ కంపెనీ అని సీఎం రేవంత్ రెడ్డి చేసిన సంచలన ఆరోపణలపై కేటీఆర్ మరోసారి లీగల్ నోటీసు అస్త్రాన్ని ప్రయోగించారు. 48 గంటల్లో బేషరతుగా క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అయితే, రేవంత్ రెడ్డి విసురుతున్న తీవ్రమైన రాజకీయ ఆరోపణలను కేటీఆర్ మైదానంలో రాజకీయంగా తిప్పికొట్టకుండా, పదే పదే న్యాయస్థానాలు ,లీగల్ నోటీసుల వెనుక దాక్కుంటున్నారనే చర్చ తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్రంగా సాగుతోంది.గతాన్ని పరిశీలిస్తే కేటీఆర్ ఈ తరహా లీగల్ రూట్‌ను ఎంచుకోవడం ఇదే మొదటిసారి కాదు. గతంలో పీసీసీ చీఫ్‌గా



ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి వైట్ ఛాలెంజ్ విసిరినప్పుడు , డ్రగ్స్ వ్యవహారంలో కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకున్నప్పుడు కూడా ఆయన రాజకీయ సభల్లో రేవంత్‌ను గట్టిగా దెబ్బతీయడం కంటే కోర్టుల్లో కేసులు వేయడానికే ప్రాధాన్యత ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ వివాదం, బావమరిది ఫామ్‌హౌస్ రచ్చ, ఫార్ములా–ఈ రేస్ లీగల్ ప్రాసెస్, ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల - మిగతా3లో

## కోర్టు తీర్పును
# చూసి స్పందిస్తాం

### అధికారి నియామకం ప్రభుత్వ విచక్షణాధికారమన్న రేవంత్

: సీఎం రేవంత్

న్యూఢిల్లీ, జులై 28: హైడ్రా పనులు కొనసాగించి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కబ్జా కోర్లు హైడ్రా వద్దంటున్నారని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో పర్యటిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోమని స్పష్టం చేశారు. గండిపేట బతుకమ్మ కుంటలను ఆక్రమించింది పేదలా? పెద్దలా? అని విపక్షాలను ఆయన ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? పెద్దలదా? అని వారిని నిలదీశారు.హైడ్రా తాము తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణగా సీఎం అభివర్ణించారు. హైడ్రాకు ఉన్నతాధికారిగా ఎవరిని నియమించాలనే విచక్షణ తమ ప్రభుత్వానికి ఉందని కుండబద్దలు కొట్టారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్‌పైన 400 పైగా కోర్టు



ధిక్కరణ కేసులున్నాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దురుద్దేశంతోనే కేసులు వేసి కోర్టును తప్పుదోవ పట్టించారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. కోర్టు తీర్పుని పరిశీలించి.. ఆ తర్వాత తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. హైడ్రా కార్యాచరణ పైన తమకు పూర్తి స్పష్టత ఉందని అన్నారు. కబ్జాకోరులకు సహకరించొద్దంటూ మీడియాకు సూచించారు. డబ్బులు పెట్టి సోషల్ మీడియాలో హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రాష్ట్రానికి 11.56 లక్షల ఇళ్లు కేటాయించండి: కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ విజ్ఞప్తి**

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లు కేటాయించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. గతంలో గ్రామీణ ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారని - మిగతా3లో

## తెలంగాణలో ఏర్పడేది
# డబుల్ ఇంజిన్ సర్కారే

రాంచందర్ రావు

తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం అవుతోందన్న రాంచందర్ రావు

చదువుకున్న యువత పార్టీలో చేరుతున్నారని వెల్లడి

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వ్యాఖ్య



తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ నేతృత్వంలో 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం' ఏర్పాటు కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం కావడం శుభపరిణామమని, చదువుకున్న యువత పెద్ద సంఖ్యలో పార్టీలోకి చేరుతుండటం మార్పుకు సంకేతమని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న ఆయన... అనేక దేశాలు క్రిస్టియన్, ముస్లిం దేశాలుగా మారినా సనాతన ధర్మాన్ని ఏ శక్తీ నిర్మూలించలేకపోయిందని అన్నారు. ప్రస్తుతం యువజన ఉద్యమాల ముసుగులో విదేశీ నిధులు సేకరిస్తూ దేశాన్ని విభజించేందుకు కొన్ని కుట్రలు సాగుతున్నాయని, దేశ సమగ్రతను కాపాడుకోవడానికి ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. ఇది ప్రతి పదేళ్లకు ఒకసారి సాధారణంగా జరిగే ప్రక్రియ మాత్రమేనని, దీనిని అడ్డుపెట్టుకుని అనవసర భయాందోళనలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని హెచ్చరించారు. దేశ భద్రత విషయంలో ఎలాంటి ఒడిదుడుకులను సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

## ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కోవడంలో
# 'రైతునేస్తం' కీలక పాత్ర

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, జులై 28: రైతు చెంతకు నూతన సాంకేతికతే 'రైతునేస్తం' లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈరోజు(మంగళవారం) రైతునేస్తం 100వ ఎపిసోడ్‌ను ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. రైతు – శాస్త్రవేత్త – అధికారుల అనుసంధానానికి దేశంలోనే తొలి డిజిటల్ వేదిక రైతునేస్తమని అన్నారు. 2024 మార్చి 6న ప్రారంభమైన రైతునేస్తం.. నేడు 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. ఇప్పటివరకు 27.30 లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరినట్లు వెల్లడించారు. ప్రతి మంగళవారం రైతుల ప్రశ్నలకు ప్రత్యక్షంగా శాస్త్రవేత్తలు సమాధానాలు ఇస్తున్నారని మంత్రి తెలిపారు. ఎల్–నినో సవాళ్లను ఎదుర్కోవడంలో రైతునేస్తం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయిల్ పామ్, ఉద్యాన, తక్కువ నీటితో సాగయ్యే పంటలపై దృష్టి సారించాలన్నారు. జులైలో 27 శాతం వర్షపాతం లోటు నమోదైందని వెల్లడించారు. ఆగస్టు 10 ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. భూగర్భ జలాల సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు అందించాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వివిధ జిల్లాలకు చెందిన ఆదర్శ రైతులను మంత్రి సన్మానించారు.

## హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయి



: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జులై 28 హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయని, హైడ్రాపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, రాజకీయ ప్రయోజనాల కోసమే వ్యతిరేక ప్రచారం జరుగుతోందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న సంస్థ హైడ్రా అని, అందుకే సాధారణ ప్రజలు దీనిని స్వాగతిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. హైడ్రాకు మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా ర్యాలీలు నిర్వహించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలకు ప్రజల నుంచి వస్తున్న మద్దతును చూసి కొందరు రాజకీయ పార్టీలు అసహనం వ్యక్తం చేస్తున్నాయని విమర్శించారు. హైడ్రాను అడ్డుకునేందుకు రాజకీయ ప్రయోజనాల కోసమే కొందరు కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి హైడ్రాపై కుట్రలు చేస్తున్నాయన్నారు. కోర్టు వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి గౌరవం ఉందని మంత్రి శ్రీధర్ బాబు - మిగతా3లో

## ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్
# సంస్థాగత వ్యవహారాలపై కీలక సమీక్ష

హైదరాబాద్:ఢిల్లీ ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్లో తెలంగాణ కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాలపై కీలక సమీక్ష సమావేశం ముగిసింది.ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్గనైజేషన్ కేసీ వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు మరియు ఎస్ఎస్ఏ జాతీయ ఇన్చార్జ్ చల్లా వంశీచంద్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తో పాటు ఇతర పార్టీ నేతలు పాల్గొన్నారు.దాదాపు రెండు గంటల పాటు జరిగిన



సమావేశంలో తెలంగాణలో



## ఖాజీపేటలో రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయాలని కోరాం

: కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులతోపాటు పలు ఐటీ సంస్థల అంశాలను కేంద్రమంత్రితో చర్చించారు. అనంతరం ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్ రావుతో కలిసి ఢిల్లీలో ఏర్పాటు చేసిన - మిగతా3లో

# జెన్ జీ మంత్రంలో రేవంత్

### నచ్చకపోతే పట్టించుకోవద్దు - ఫ్యాన్స్‌కు అల్లు అర్జున్ ఇచ్చిన సలహా వెనుక అసలు కారణం ఇదే !

హైదరాబాద్, జూలై 28:సమస్య వచ్చినప్పుడు స్పందించడం వేరు, ఆ సమస్యనే అవకాశంగా మార్చుకుని రాజకీయ ప్రత్యర్థులను ఇరుకున పెట్టడం వేరు" ఈ సూత్రాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కాగా అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా నీట్ కుంభకోణంపై యువత, విద్యార్థి లోకం అట్టుడుకుతున్న వేళ, ఆయన వేసిన '21 ఏళ్లకే పోటీ' అనే ఎత్తుగడ, సాధారణ రాజకీయ ప్రకటనల కంటే చాలా లోతైనది, వ్యూహాత్మకమైనదిగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.దేశంలో దాదాపు 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిన నీట్ వ్యవహారం.. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతను పెంచింది. ఈ ఆగ్రహాన్ని కేవలం నిరసనలకే పరిమితం చేయకుండా, దానికి ఒక రాజకీయ రూపాన్ని ఇవ్వడంలో రేవంత్ ముందడుగు వేశారు. "మీరు కేవలం బాధితులు కాదు, రేపటి శాసనకర్తలు కావాలి. మీ



సమస్యలను మీరే చట్టసభల్లోకి వచ్చి పరిష్కరించుకోవాలి" అని పరోక్షంగా పిలుపునివ్వడమే ఈ ప్రతిపాదనలోని అసలు మర్మం. ఇది యువతలోని నిస్సహాయతను పారదోలి, వారిలో ఆశను, అధికారంపై ఆకాంక్షను - మిగతా3లో

## తెలంగాణ టీవీ అవార్డులకు పీవీ పేరు..

మంత్రి కోమటిరెడ్డి కీలక ప్రకటన

తెలంగాణ టీవీ అవార్డులపై ప్రభుత్వం కసరత్తు

అవార్డులకు పీవీ పేరు పరిశీలన

సీఎం రేవంత్‌తో చర్చించి తుది నిర్ణయం

లోగో, కేటగిరీలపై సమీక్ష

పారదర్శక ఎంపికకు మంత్రి ఆదేశాలు

బుల్లితెర వర్గాల్లో హర్షం



తెలంగాణలో టెలివిజన్ రంగానికి ప్రత్యేక గుర్తింపు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బుల్లితెర కళాకారులు, సాంకేతిక నిపుణులను ప్రోత్సహించేలా టెలివిజన్ అవార్డులను ప్రవేశపెట్టే ప్రక్రియ వేగవంతమైంది. ఈ అవార్డులకు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు పెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు.టెలివిజన్ అవార్డు కమిటీ ప్రతినిధులతో మంత్రి సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అవార్డుల లోగో, కేటగిరీలు, పేరుపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ సంస్కృతి, ఆత్మను ప్రతిబింబించేలా లోగో, పేరు ఉండాలని మంత్రి సూచించారు.తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరును అవార్డులకు పెట్టే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.అవార్డుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. అందుకు అవసరమైన సమగ్ర మార్గదర్శకాలను త్వరగా సిద్ధం చేయాలని టెలివిజన్ అవార్డు కమిటీ సభ్యులకు ఆదేశించారు. ప్రభుత్వ నిర్ణయంపై బుల్లితెర రంగానికి చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సంపాదకీయం

## రాజకీయంగా ప్రభావం చూపే స్థాయికి సీజేపీ..

భారత రాజకీయ చరిత్రలో ఎన్నో చిత్ర విచిత్రమైన ఉద్యమాలు వచ్చాయి గానీ, కాక్రోచ్ జనతా పార్టీ సృష్టించిన రాజకీయ సంచలనం బహుశా మునుపెన్నడూ లేదనడంలో సందేహం లేదు. ధర్మేంద్రప్రధాన్‌ను రాజీనామా చేయించడంలో కీలక పాత్ర పోషించారు. చివరికి కేంద్ర ప్రభుత్వాన్ని మోకాళ్లపైకి తెచ్చింది. మోదీ ప్రభుత్వం ఏకంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించక తప్పని పరిస్థితి ఏర్పడింది. సోషల్ మీడియా మీమ్‌గా పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి తలొగ్గి కేంద్రం ఒక కేబినెట్ మంత్రిని పదవి నుంచి తప్పించడం అంటే, సీజేపీ డిమాండ్లకు మాత్రమే కాదు.. దాని రాజకీయ ఉనికికి కూడా కేంద్రం స్వయంగా చట్టబద్ధత కల్పించినట్లయింది.కేవలం విద్యార్థి పోరాటాలు, మీమ్‌లు, సోషల్ మీడియా క్యాంపెయిన్లకే పరిమితమైన సీజేపీ, ఇప్పుడు అధికారికంగా రాజకీయ పార్టీ గా అవతరిస్తే భారత రాజకీయాలు ఏ విధంగా మారతాయనేది ప్రస్తుతం ఢిల్లీ పొలిటికల్ వర్గాల్లో ఆసక్తికరమైన టాపిక్. గతంలో అన్నా హజారే ఇండియా అగైన్స్ట్ కరప్షన్ ఉద్యమం నుంచి ఉద్భవించిన ఆమ్ ఆద్మీ పార్టీ ఎలాగైతే ఒక రాత్రిలో సాంప్రదాయ రాజకీయాలను కుదిపేసిందో, ఇప్పుడు సీజేపీ కూడా సరిగ్గా అదే తరహా యాంటీ-ఎస్టాబ్లిష్‌మెంట్ ఎనర్జీతో ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యే అవకాశాలు ఉన్నాయి. రాజకీయ ఆశలు లేవని చెబుతున్నారు కానీ.. రేపు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చెప్పడం కష్టం. యువత, ముఖ్యంగా జెన్-జీ , మిలీనియల్స్ అండగా ఉన్న ఈ పార్టీ పొలిటికల్ ఎంట్రీ.. ఇప్పటికే తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ప్రతిపక్షాలకు సింహస్వప్నంగా మారనుంది.వాస్తవానికి, సీజేపీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తే భయపడాల్సింది అధికార బీజేపీ కంటే కూడా కాంగ్రెస్ , ఆమ్ ఆద్మీ పార్టీలే. ఎందుకంటే, కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, యువత సమస్యలైన నిరుద్యోగం, పేపర్ లీకేజీలు, విద్యావ్యవస్థలోని లోపాలపై పోరాడే విపక్ష స్పేస్ ని ఇన్నాళ్లూ కాంగ్రెస్, ఆప్‌లు ఆక్రమించే ప్రయత్నం చేశాయి. అయితే, రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ కానీ, వరుస వివాదాల్లో చిక్కుకున్న ఆప్ కానీ సాధించలేని భారీ రాజకీయ విజయాన్ని సీజేపీ సాధించి చూపించింది. దీనివల్ల ప్రతిపక్షాల వైపు ఉండాల్సిన యువతరం డిజిటల్ అటెన్షన్, అర్బన్ ఓటు బ్యాంకు మొత్తం సీజేపీ వైపే మొగ్గు చూపే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.కాంగ్రెస్ విషయానికొస్తే, నగరాల్లోని విద్యాధికులు, యువత ఓట్లను రాబట్టడానికి ఆ పార్టీ ఎంతో కాలంగా పడుతున్న కష్టాలు సీజేపీ ఎంట్రీతో బూడిదలో పోసిన పన్నీరు కానున్నాయి. విద్యార్థుల కోసం తాము క్షేత్రస్థాయిలో ఏమీ చేయలేకపోయామనే భావన ఓటర్లలో బలపడటం కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ. మరోవైపు, తమను తాము విద్యార్థుల, మధ్యతరగతి ప్రతినిధులుగా ప్రొజెక్ట్ చేసుకునే ఆమ్ ఆద్మీ పార్టీ ఉనికికే సీజేపీ పెను సవాలుగా పరిణమించనుంది. ఆప్ పాతబడిపోయిన ఫార్ములా స్థానంలో, సరికొత్త డిజిటల్ టెక్నాలజీ, సోషల్ మీడియా స్ట్రాటజీలతో దూసుకొస్తున్న సీజేపీ, ఢిల్లీ , ఇతర మెట్రో నగరాల్లో ఆప్ ఓట్ బ్యాంక్‌ను ఎసరు పెట్టడం ఖాయం.ఈ సరికొత్త పరిణామం ప్రధాని నరేంద్ర మోదీ మాస్టర్ స్ట్రోక్‌లో భాగమనే విశ్లేషణలు కూడా లేకపోలేదు. .అభిజిత్ దీప్కే ప్రారంభించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూన్ 6న తన తొలి నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది.నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ, పరీక్షల్లో అవకతవకలు, విద్యార్థుల భవిష్యత్తుపై నిరసనకారులు ఆందోళన లేవనెత్తారు. ఆ ఆందోళన ఒక పెద్ద ఉద్యమానికి ఆరంభం మాత్రమేనని అభిజీత్ దీప్కే వ్యాఖ్యానించారు.తమ డిమాండ్లపై ప్రభుత్వం నుంచి సంతృప్తికరమైన సమాధానం రాకపోవడంతో, జూన్ 20న కాక్రోచ్ జనతా పార్టీ సభ్యులు దిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరవధిక నిరసనను ప్రారంభించారు.పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పరీక్షా విధానంలో సంస్కరణలు తీసుకురావడం తదితర డిమాండ్లను కేంద్రం ముందుంచారు.అయితే, 'పార్లమెంట్ మార్చ్'కు సీజేపీ ఎలాంటి అనుమతి కోరలేదని, పోలీసులు అనుమతి ఇవ్వలేదని జులై 19న దిల్లీ పోలీసులు ప్రకటించారు.జులై 20న, వేలాది మంది నిరసనకారులు జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లడానికి ప్రయత్నించారు.ఆ సమయంలో గుంపును చెదరగొట్టడానికి పోలీసులు బారికేడ్లు, లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.ఆ ఘటనలో కొందరు యువకులు, పోలీసులు గాయపడ్డారు. దీంతో, పోలీసుల తీరుపై పలు ప్రశ్నలు తలెత్తాయికొన్ని అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు కూడా దీనిపై ఆందోళన వ్యక్తం చేశాయి.ఆ తర్వాత జులై 21 నుంచి 23 మధ్య, జంతర్ మంతర్ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశారు, పలు మెట్రో స్టేషన్లను మూసివేశారు.పోలీసుల చర్యలపై దిల్లీ హైకోర్టు వివరణ కోరింది. ఆ తర్వాత కేంద్ర మంత్రులు నిరసన స్థలానికి సమీపంలోని ఒక తటస్థ ప్రదేశంలో సీజేపీ ప్రతినిధులతో చర్చలు ప్రారంభించారు.జులై 24న, సోనమ్ వాంగ్‌చుక్ ప్రభుత్వ హామీల నేపథ్యంలో జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో తన నిరాహార దీక్షను విరమించారు.అయితే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని సీజేపీ ప్రకటించింది.డిమాండ్లపై సమాధానం ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ఒకరోజు వరకు సమయం కోరిందని జులై 24న జరిగిన చర్చల ముగింపులో సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ తెలిపారు.జవాబుదారీతనం, పరీక్షా విధానంలో సంస్కరణల డిమాండ్లను స్పష్టంగా చెబుతూనే, ఈ పరిణామాన్ని సీజేపీ ఒక భారీ విజయంగా అభివర్ణించింది"ఇది ప్రజాస్వామ్య విజయం, ఇది శాంతి, ఓర్పు, పట్టుదలకు లభించిన విజయం" అని సోనమ్ వాంగ్‌చుక్ వ్యాఖ్యానించారు."ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు, కానీ నీట్ పరీక్ష అక్రమాల కారణంగా ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం అందించాలి, నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి అనే రెండు డిమాండ్లు ఇంకా మిగిలే ఉన్నాయి" అని అభిజిత్ దీప్కే తెలిపారు.విద్యాశాఖ మంత్రి రాజీనామాను ఆమోదించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం మేము ప్రజాస్వామ్యబద్ధంగా స్పందించాం అనే ఇమేజ్‌ను తెచ్చుకోవడమే కాకుండా, విపక్ష ఓట్లను చీల్చే మరొక కొత్త శక్తిని పరోక్షంగా ప్రోత్సహించినట్లయింది. ప్రతిపక్షాల ఐక్యత నీరుగారిపోతున్న తరుణంలో, ఒక స్వతంత్ర యువజన పార్టీ రూపంలో మూడో శక్తి రావడం వల్ల విపక్ష ఓటు బ్యాంకు ఘోరంగా చీలిపోయి, చివరికి అది అధికార పార్టీకే రాజకీయంగా లబ్ధి చేకూరుస్తుందనే భావన ఉంది. కాక్రోచ్ జనతా పార్టీ రాజకీయ పార్టీగా మారుతుందో లేదే ఎవరికీ తెలియదు. కానీ సాంప్రదాయ రాజకీయ సమీకరణాలు, పాతకాలపు ప్రచార శైలి చెల్లవని, ప్రజల్లోంచి వచ్చిన ఆవేశం సరికొత్త రాజకీయ శక్తులకు జన్మనిస్తుందని ఇది నిరూపించింది. రాబోయే ఎన్నికల్లో సీజేపీ నిజంగానే పార్టీ గుర్తుతో బరిలోకి దిగితే, అది కేవలం విద్యావ్యవస్థలోనే కాదు, దేశ రాజకీయాల్లో కూడా ఒక పెద్ద పక్షాళనకు కారణమవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు

# ముఖ్యమంత్రుల ఆస్తులు, కేసులు.. ఏపీ, తెలంగాణ సీఎంలది ప్రత్యేక స్థానం!

### దేశంలో అత్యంత సంపన్న ముఖ్యమంత్రులుగా దక్షిణాది నేతలు
### ఆస్తుల్లో కర్ణాటక సీఎం డీకే శివకుమార్ మొదటి స్థానం
### ఏపీ సీఎం చంద్రబాబుకు రెండో స్థానం
### క్రిమినల్ కేసుల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి అగ్రస్థానం
### రేవంత్ రెడ్డిపై దేశంలోనే అత్యధికంగా 80 కేసులు నమోదు



దేశంలోని ముఖ్యమంత్రుల ఆస్తులు, వారిపై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలతో అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) ఓ నివేదికను విడుదల చేసింది. దేశంలోని 28 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 31 మంది సీఎంల ఎన్నికల అఫిడవిట్లను విశ్లేషించి ఈ రిపోర్ట్ రూపొందించింది. ఈ నివేదిక ప్రకారం, దేశంలో అత్యంత సంపన్న ముఖ్యమంత్రులుగా దక్షిణాది నేతలే తొలి మూడు స్థానాల్లో నిలిచారు. రూ.1413 కోట్ల ఆస్తులతో కర్ణాటక సీఎం డీకే శివకుమార్ మొదటి స్థానంలో ఉండగా, రూ.931 కోట్ల ఆస్తులతో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రెండో స్థానంలో నిలిచారు. తమిళనాడు సీఎం విజయ్ రూ.648 కోట్లతో మూడో స్థానం దక్కించుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.30 కోట్లకు పైగా ఆస్తులతో ఈ జాబితాలో 8వ స్థానంలో ఉన్నారు. క్రిమినల్ కేసుల విషయానికొస్తే, దేశంలోని ముఖ్యమంత్రులందరిలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అగ్రస్థానంలో నిలిచారు. ఆయనపై ఏకంగా 80 కేసులు ఉన్నట్టు ఏడీఆర్ పేర్కొంది. రేవంత్ తర్వాత పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారిపై 29 కేసులు, కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌పై 19 కేసులు ఉన్నాయి. 19 కేసులతో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఈ జాబితాలో నాలుగో స్థానంలో ఉన్నారు. దేశంలోని 31 మంది సీఎంలలో 14 మందిపై క్రిమినల్ కేసులు ఉండటం గమనార్హం.ఈ జాబితాలో అత్యల్ప ఆస్తులు కలిగిన సీఎంగా జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా (రూ.55 లక్షలు) నిలిచారు. మొత్తం 31 మంది సీఎంల మొత్తం ఆస్తుల విలువ రూ.8,660 కోట్లుగా ఏడీఆర్ తన నివేదికలో వెల్లడించింది.

# తెరపైకి మరో రెండు ఉద్యమాలు..

**న్యూఢిల్లీ, జూలై 28:**సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేసిన కాక్రోచ్ వ్యాఖ్యల నుంచి పుట్టుకొచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. మొన్నటి వరకు సోషల్ మీడియా వేదికగా ఉద్యమించిన సీజీపీ నీటి ప్రశ్నపత్రం లీకేజీ, విద్యా వ్యవస్థలో లోపల పై ప్రత్యక్ష ఆందోళన చేపట్టింది. ఏకంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా లక్ష్యంగా ఢిల్లీలో జంతర్మంతర్ వద్ద నిరసనకు దిగింది. 20 రోజుల పైగా సాగిన ఉద్యమంతో విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇదే స్ఫూర్తితో ఇప్పుడు మరో ఉద్యమం మొదలయ్యే అవకాశం కనిపిస్తుంది. ఇన్ స్టాగ్రామ్ లో అకస్మాత్తుగా పెరిగిన =వంవతీజుఫ్అశీఅ ఎఞ్ఘుశీ ాౌఅసశీశ్రీఖఅ (=నాూ) యువత దృష్టిని ఆకర్షిస్తోంది. కుల ఆధారిత రిజర్వేషన్‌లో మార్పులు, మెరిట్, ఆర్థిక అవసరాల ఆధారంగా అవకాశాలు కావాలని కోరుతూ ఇది వేగంగా వ్యాపిస్తోంది. ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని స్పష్టం చేస్తూ, పౌరుల నేతృత్వంలోని ఉద్యమంగా తమను తాము రూపు దిద్దుకుంటోంది.ఇటీవలి విద్యార్థి నిరసనల (పరీక్షల లీక్‌లు వంటి సమస్యలపై) తర్వాత ఈ ఇన్ స్టాగ్రామ్ పేజీ ఫాలోయింగ్ అకస్మాత్తుగా పెరిగింది. కొన్ని గంటలు/రోజుల్లోనే లక్షల మంది ఫాలోవర్లను చేరుకోవడం వైరల్ అయింది. యూజర్ ప్రకారం 34 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఇది ప్రధానంగా జెన్ జెడ్, సాధారణ కేటగిరీ విద్యార్థుల మధ్య చర్చను రేకెత్తించింది. "సమానత్వం, మెరిట్, న్యాయం" వంటి నినాదాలతో ఇది ఆన్‌లైన్‌లో వేగంగా వ్యాపిస్తోంది.ప్రస్తుత కుల ఆధారిత




కోటాలను (విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో) సమీక్షించాలని లేదా తొలగించాలని కోరుతూ, మెరిట్, నైపుణ్యం, ఆర్థిక అవసరాల ఆధారంగా అవకాశాలు కావాలని వాదిస్తోంది. కులం బదులు నిజమైన పేదరికం ఆధారంగా సహాయం, అధికారిక ఫారమ్‌లలో కుల ప్రకటనలు తగ్గించడం వంటి అంశాలు ముందుకు వస్తున్నాయి. ఒక తరం/కుటుంబానికి పరిమితం చేయడం లేదా క్రీమీ లేయర్‌ను మరింత కఠినంగా అమలు చేయడం వంటి సంస్కరణలు కూడా చర్చలో ఉన్నాయి.విద్యా అవకాశాల్లో అసమాన కట్-ఆఫ్‌లు, క్రీమీ లేయర్ సమస్యలు, కులం ఇంకా అధికారికంగా కొనసాగడం వంటి అంశాలపై యువతలో నిరాశ కనిపిస్తోంది. సోషల్ మీడియా ద్వారా త్వరగా వ్యాపించే సామర్థ్యం, రాజకీయ పార్టీల నుంచి దూరంగా ఉండాలనే ప్రకటన దీనికి ప్రాచుర్యం తెచ్చాయి. అయితే ఇలాంటి ఆన్‌లైన్ ఉద్యమాలు తరచూ భావోద్వేగంతో పెరుగుతాయి. నిజమైన సామాజిక మార్పుకు ఆఫ్‌లైన్ చర్చలు, విస్తృత సంప్రదింపులు అవసరం.రిజర్వేషన్ కుల స్పృహను కొనసాగిస్తుందని, మెరిట్‌ను బలహీనపరుస్తుందని, ఆర్థికంగా బాగా ఉన్నవారికి కూడా ప్రయోజనం చేకూరుస్తుందని అంటారు. ఆర్థిక ఆధారిత వ్యవస్థ మరింత సమానమని వాదిస్తున్నారు 1950ల నాటి వ్యవస్థను సమీక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే సమయంలో చారిత్రక అన్యాయాలు, నేటికీ కొనసాగుతున్న వివక్ష, ప్రాతినిధ్య అవసరం వంటి కారణాలతో రిజర్వేషన్ అవసరమన్న వాదన ఉంది. రిజరేషన్లు అకస్మాత్తుగా తొలగిస్తే అసమానతలు పెరగవచ్చని పేర్కొన్నారు. కులం ఆధారిత సమస్యలు పూర్తిగా అంతం కాలేదనే వాదన ఉంది. ఇంకోవైపు రెండు వైపులా చెల్లుబాటు అయ్యే అంశాలు ఉన్నాయి. రిజర్వేషన్ లక్ష్యం సామాజిక న్యాయం, కానీ అమలులో సమస్యలు, కాలక్రమేణా మార్పుల అవసరం.ఇలాంటి ఉద్యమాలు రాజకీయాల్లోకి లాగబడే ప్రమాదం ఉంది. రాజ్యాంగ సవరణలు, న్యాయస్థానాల పరిశీలన, విస్తృత సామాజిక సమ్మతి లేకుండా పెద్ద మార్పులు కష్టం. ఆర్థిక ప్రమాణాలను బలోపేతం చేయడం, విద్యా నాణ్యతను పెంచడం, క్రీమీ లేయర్‌ను సమర్థవంతంగా అమలు చేయడం వంటి మధ్యమార్గాలు ఎక్కువ చర్చనీయాంశాలు కావచ్చు.ఆర్ హెచ్ ఏ సోషల్ మీడియా ద్వారా యువతలోని నిరాశను ప్రతిబింబిస్తోంది. ఇది రిజర్వేషన్ విధానం గురించి తాజా చర్చను రేకెత్తించింది. అయితే నిజమైన పరిష్కారం ఒక పక్షం వాదనలపై కాకుండా, డేటా, సామాజిక వాస్తవాలు, రాజ్యాంగ సూత్రాల ఆధారంగా సమతుల్యమైన సంస్కరణల్లో ఉంటుంది.

# కేంద్ర మంత్రిగా దగ్గుబాటి పేరు...

**న్యూఢిల్లీ, జూలై 28:**కేంద్ర విద్యా శాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. విద్యావ్యవస్థలో వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేశారు. ఇందులో యాదృచ్ఛికం ఏంటంటే.. స్వతహాగా విద్యార్థి నాయకుడిగా ఉండేవారు ధర్మేంద్ర ప్రధాన్. ఇప్పుడు అదే విద్యార్థి లోకం ఆందోళనల ఫలితంగా పదవికి దూరమయ్యారు. ఈ విషయాన్ని పక్కన పెడితే ఇప్పుడు తదుపరి కేంద్ర విద్యా శాఖ మంత్రి ఎవరు అనే చర్చ బలంగా నడుస్తోంది. అయితే ఈసారి సమర్థులకు అవకాశం ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోడీ భావిస్తున్నారు. క్యాబినెట్లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వాలని చూస్తున్నారు. అందులో భాగంగా ఏపీ నుంచి ఈసారి అవకాశం ఉంటుంది అనేది ప్రధానంగా జరుగుతున్న చర్చ. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గతంలో ఆమె క్యాబినెట్లో పనిచేసిన అనుభవం ఉండడంతో ఆమె వైపు మోది మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో కేంద్ర ప్రభుత్వం ఇరకాటంలో పడింది. డ్యామేజ్ కంట్రోల్లో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ సైతం స్పందించారు. పేపర్ లీకేజీ ఘటనపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేయడంతో పాటు పారదర్శకంగా ఇకనుంచి వ్యవహరిస్తామని కూడా చెప్పుకొచ్చారు. మరోవైపు జనతా కాక్రోచ్ ఉద్యమంతో దేశ అంతర్గత భద్రతకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. ఉద్యమం పక్కదారి పట్టి ఛాన్స్ అధికంగా ఉంది. ఈ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించింది కేంద్ర ప్రభుత్వం. అందుకే విద్యా శాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించింది. అయితే తదుపరిగా ఈ బాధ్యతలు ఎవరు తీసుకుంటారు అనే ప్రశ్న వినిపించింది. అయితే ఆ అవకాశం ఏపీకి చెందిన మహిళ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి దక్కుతుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.మూడోసారి ఎంపీ అయ్యారు దగ్గుబాటి పురందేశ్వరి. తెలుగుదేశం పార్టీ నాయకత్వంతో విభేదించి.. భర్త వెంకటేశ్వరరావు తో కలిసి పురందేశ్వరి 2004 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2009లో రెండోసారి పోటీ చేసి గెలిచారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో కేంద్రమంత్రి పదవి చేపట్టారు. సమర్థవంతమైన నేతగా జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. 2014 ఎన్నికల కు ముందు అనూహ్యంగా భారతీయ జనతా పార్టీలో చేరారు. పొత్తులో భాగంగా ఆమె రాజంపేట నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో రాజమండ్రి ఎంపీ స్థానానికి పోటీ చేసి విజయం సాధించారు. మంత్రివర్గంలో చోటు దక్కించుకోవాలని భావించారు. కానీ వివిధ సమీకరణలో దక్కలేదు. ఇప్పుడు పునర్వ్యవస్థీకరణలో ఆమెకు చాన్స్ దక్కుతుందని ప్రచారం జరిగింది. ఇంతవరకు మంత్రివర్గాన్ని విస్తరించలేదు మోడీ. ఇప్పుడు అనూహ్యంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పురందేశ్వరికి ఆ శాఖ ఇస్తారని తెలుస్తోంది. అయితే పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఇస్తారా? లేకుంటే ఇప్పుడే ఇస్తారా? అన్నది తెలియాల్సి ఉంది.

# అనర్హులకు డబుల్ బెడ్ రూములు ఇస్తున్నారు

### కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**హైదరాబాద్:**డబుల్ బెడ్ రూంలు నిరుపేదలకు ఇవ్వకుండా మంత్రుల కలెక్టర్ల అనుచరులను ఇవ్వడంపై కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మండిపడ్డారు. దేశంలో ప్రజలను నిత్యం మోసం చేసే పార్టీనే కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టరాజ్యానికి పాల్పడుతోంది. ఖైతలాపూర్ లో కేసీఆర్ ప్రభుత్వంలో 145 డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించారు.నాలా పక్కన జీవిస్తున్న అమృత్ నగర్ తండా వాసులకు ఇవ్వాలని డిమాండ్ చేశాం. నిరుపేదలై విలేకరులకు ఇండ్లు ఇవ్వాలని కలెక్టర్ కి వినతిపత్రం అందించాం. హౌసింగ్ బోర్డు వీసీ తరుపున ఒకరికి డబుల్ బెడ్ ఇచ్చారు. హైదరాబాద్ రంగారెడ్డి కలెక్టర్ తరుపున మరొకరికి డబుల్ బెడ్ రూం. ఖమ్మం లో నివసిస్తున్న మహిళకు కూకట్ పల్లి లో డబుల్ బెడ్ రూం ఇచ్చారని అన్నారు.ఎండోన్మెంట్ కమిషనర్ తరుపున మరొకరికి డబుల్ బెడ్ ఇచ్చారు. కుత్బుల్లాపూర్ రెవిన్యూ డిపార్ట్మెంట్ లో పనిచేస్తున్న ప్రత్యూషకి డబుల్ బెడ్ రూం. పొన్నం ప్రభాకర్ పైరవీతో నరేష్ కుమార్ అనే వ్యక్తికి డబుల్ బెడ్ రూం



ఇచ్చారు. మాజీ పిసిసి అధ్యక్షుడు డి శ్రీనివాస్ అల్లుడు శైలజ పేరుమీద మరొకరికి డబుల్ బెడ్ రూం, మంత్రులు కలెక్టర్లు లెటర్లు రాయడం డబుల్ బెడ్ రూములు కేటాయించడం ఇదేనా ప్రజా పాలన. కూకట్ పల్లి నిరుపేద ప్రజలకు డబుల్ బెడ్ రూం ఇవ్వాలని కేసీఆర్ ప్రభుత్వం ఇండ్లు కట్టింది.కనీస నిబంధనలు పాటించడం లేదు. ఎవరికి పడితే వారికి ఇష్టం వచ్చినట్లు అలాట్మెంట్ ఇస్తున్నారు..డబుల్ బెడ్ రూం ఇండ్లకోసం ఎలాంటి అప్లికేషన్ పెట్టుకొని వ్యక్తులకు కాంగ్రెస్ మంత్రులు ఇండ్లు ఇస్తున్నారు. అక్రమంగా లోపాయికారి తనంతో డబ్బులు గుంజుతూ పైరవీ లేఖలతో అమ్ముకుంటున్నారు.హైదరాబాద్ నగర ప్రజలకు లక్ష డబుల్ బెడ్ రూం ఇస్తామని ప్రజలను మోసం చేస్తున్నారు.అప్లికేషన్ పేరుమీద 10 వేల రూపాయలు కట్టించుకొని ప్రజలను మోసం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం. అరులక్షల రూపాయలు కట్టితే ఇండ్లు కేటాయేస్తం అంటున్నారు. నిరుపేదలు అరులక్షల రూపాయలు కట్టుకొనే స్థోమత ఉంటుందా అని ప్రశ్నించారు.కెసిఆర్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూంలు కట్టించి ఒక్క రూపాయ తీసుకోకుంటా నిరుపేదలను ఇండ్లు అందించాం. మేడ్చల్ కలెక్టర్ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిపక్షపాతంగా పనిచేస్తున్నారు. కాంగ్రెస్ ,బీజేపీ పార్టీలు ఒక్కరు కూడా డబుల్ బెడ్ రూం ఇండ్ల అవినీతిపై మాట్లాడారు. కాంగ్రెస్ మంత్రులు ఇష్టం వచ్చిన వాళ్లకు ఇండ్లను ఇస్తే హైకోర్టుని ఆశ్రయిస్తామని అయన అన్నారు.

# ఆ విషయంలో రేవంత్ రెడ్డి, కేటీఆర్‌కు అవార్డులు ఇవ్వాలి: ఎంపీ అర్వింద్ సెటైర్



**న్యూఢిల్లీ, జులై 28:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీ పర్యటనపై ఎంపీ ధర్మపురి అరవింద్ స్పందించారు. ఈరోజు(మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణను దోచుకున్న ఇద్దరూ ఈరోజు ఢిల్లీలో ఉన్నారంటూ వ్యాఖ్యానించారు. కేటీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయడంలో విజయవంతమయ్యారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడంలో విఫలమవడం వల్ల, తెలంగాణలో ప్రతి సంవత్సరం దాదాపు 20 లక్షల మంది విద్యార్థులు తమ విద్యా భవిష్యత్తుపై అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెరుగుతున్న ఆర్థిక భారం కారణంగా వందలాది కళాశాలలు కూడా మూసివేతకి సిద్ధంగా ఉన్నాయని ఎంపీ అన్నారు. కాంగ్రెస్‌కు ముందు, బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. అవినీతిలో కూరుకుపోయిన కాళేశ్వరం, మిషన్ భగీరథ వంటి రుణభార ప్రాజెక్టులలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని కుమ్మరించిందని వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా కే-కుటుంబం అపారమైన సంపదను కూడబెట్టిందని ఆరోపించారు. ఇప్పుడు జెన్ జెడ్‌కు మద్దతుగా రేవంత్ రెడ్డి, కేటీఆర్ ఇద్దరూ మొసలి కన్నీళ్లు కార్చుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో అత్యధిక నిరుద్యోగ రేటు ఉన్న రెండు రాష్ట్రాలలో తెలంగాణ ఒకటని ఎంపీ అన్నారు. దాదాపు 13 ఏళ్లుగా ఉద్యోగాల క్యాలెండర్‌ను నిలిపివేసినందుకు రేవంత్ రెడ్డి, కేటీఆర్‌కు అవార్డులు ఇవ్వాలంటూ సెటైర్ విసిరారు. తెలంగాణకు ఇప్పుడు ఆర్థిక క్రమశిక్షణ, స్వచ్ఛమైన పాలన ఉన్న ప్రభుత్వం కావాలన్నారు. అందుకే తెలంగాణ.. బీజేపీకి సిద్ధంగా ఉందని గట్టిగా నమ్ముతున్నట్లు ఎంపీ ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు.

# విదేశీయులే లక్ష్యంగా కోట్ల రూపాయల సైబర్ మోసం..

**ప్రధాన నిందితుడి అరెస్ట్**

**హైదరాబాద్, జులై 28:** హైదరాబాద్ కేంద్రంగా నడిచిన అంతర్జాతీయ ఫేక్ కాల్ సెంటర్ స్కామ్‌లో కీలక నిందితుడిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు అరెస్ట్ చేశారు. ప్రధాన సూత్రధారి వికాస్ కుమార్ నిమార్ అలియాస్ మిస్టీ.. అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని కోట్ల రూపాయల సైబర్ మోసానికి పాల్పడ్డాడు. దీంతో వికాస్‌ను ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఫేక్ కాల్ సెంటర్‌కు సంబంధించి మాదాపూర్ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇంటర్‌పోల్ ద్వారా అమెరికా ఎంబసీ అందించిన సమాచారంతో సీబీఐ గతంలోనే కేసు నమోదు చేసింది. 2023లో ఈసీఐఆర్ నమోదు చేసి మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. హైదరాబాద్, విశాఖపట్నం, లఖ్‌నవూతో పాటు పలు నగరాల్లో నకిలీ కాల్ సెంటర్లను వికాస్ నిర్వహించాడు. ఈ ముఠా.. టెక్నికల్ సపోర్ట్ పేరుతో విదేశీయులను నమ్మించి భారీ మొత్తంలో డబ్బు కాజేసింది. ప్రభుత్వ సంస్థలు, ప్రముఖ ప్రైవేట్ కంపెనీల అధికారులమంటూ బాధితులకు ఫోన్ కాల్స్ చేసి నిందితుడు బెదిరింపులకు పాల్పడినట్లు విచారణలో బయటపడింది. వికాస్.. కంప్యూటర్ వైరస్‌లు, బ్యాంక్ ఖాతా సమస్యలు, సెక్యూరిటీ అలర్ట్‌ల పేరుతో అమెరికన్లను భయపెట్టి డబ్బు వసూలు చేశాడని.. గిఫ్ట్ కార్డులు, డిజిటల్ పేమెంట్ల రూపంలోనూ బాధితుల నుంచి నగదు సేకరించినట్లు దర్యాప్తులో తేలింది. సేకరించిన డబ్బును క్రిప్టోకరెన్సీగా మార్చి ఆధారాలు లేకుండా ప్రయత్నించినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. క్రిప్టో ఆస్తులను ఎక్స్ఛేంజ్‌లు, హవాలా తరహా నగదు సెటిల్‌మెంట్ నెట్‌వర్క్‌లు, బ్యాంకింగ్ మార్గాల ద్వారా భారత కరెన్సీగా మార్చినట్లు విచారణలో బయటపడింది. వీసీ సొల్యూషన్స్ పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి మోసపూరిత డబ్బును చట్టబద్ధ ఆదాయంగా చూపించే ప్రయత్నం చేసినట్లు అధికారులు తెలిపారు. వీసీ సొల్యూషన్స్ బ్యాంక్ ఖాతాల్లో భారీ నగదు డిపాజిట్లు, అనుమానాస్పద క్రెడిట్ లావాదేవీలను గుర్తించారు. కాల్ సెంటర్ ద్వారానే



ఆదాయం వచ్చినట్లు విచారణలో నిమార్ అంగీకరించినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. అయితే ఈ డబ్బును ఆదాయపు పన్ను రిటర్న్‌లో కిరాణా వ్యాపారం, ఇతర వ్యాపారాల ఆదాయంగా వికాస్ చూపించాడని తెలిపారు. 2023లో ఈసీఐఆర్ నమోదు చేసి మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో మరికొందరి పాత్ర, నిధుల ప్రవాహం, క్రిప్టో లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోంది.

# తెరపైకి జెన్జీ క్యాబినెట్ అవకాశం తనకే అంటున్న అనిరుధ్ రెడ్డి

**మహబూబ్ నగర్, జూలై 28:**తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణ, ప్రక్షాళన ఊహాగానాలతో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి కూడా రేసులోకి వచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రెండున్నరేళ్లు పూర్తవుతున్న తరుణంలో, నూతనంగా విస్తరించే క్యాబినెట్‌లో తనలాంటి యువ ఎమ్మెల్యేలకు సముచిత స్థానం కల్పించాలని ఆయన అభిప్రాయపడ్డారు. పాలనలో కొత్త ఉత్సాహాన్ని నింపేందుకు యువ రక్తానికి మంత్రివర్గంలో చోటు కల్పించాల్సిన అవసరం ఉందనే చర్చ క్షేత్రస్థాయిలో నడుస్తోందని గుర్తుచేశారు. బహుశా జెన్ జీ ఉద్యమాలు జరుగుతున్నాయి కాబట్టి.. తనను జెన్ జీ ఖాతాలో వేసుకోవాలని ఆయన చెబుతున్నట్లుగా ఉంది.ప్రజాకాంక్షలకు అనుగుణంగా నూతన మంత్రివర్గ ఏర్పాటు జరగాలని ప్రజలు ఆశిస్తున్నారని అనిరుధ్ రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో నిరంతరం ప్రజలతో మమేకమవుతూ, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడే యువ నాయకులను మంత్రులుగా చూడాలని తమ నియోజకవర్గాల ప్రజలతో పాటు రాష్ట్ర యువత కోరుకుంటోందని స్పష్టం చేశారు. పాలనలో మరింత వేగం పెంచేందుకు, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు యువ నాయకత్వం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.మంత్రివర్గ పదవుల కేటాయింపు మరియు విస్తరణ అనేది పూర్తిగా కాంగ్రెస్ అధిష్టానం, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిధిలోని అంశమని ఆయన స్పష్టం చేశారు. పార్టీ విజయం కోసం, ప్రభుత్వం బలోపేతం కోసం సీఎం రేవంత్ రెడ్డి మరియు ఏఐసీసీ నాయకత్వం ఏ నిర్ణయం తీసుకున్నా క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, శాసనసభ్యుడిగా తాను దానికి సంపూర్ణంగా కట్టుబడి ఉంటానని తెలిపారు. అధిష్టానం ఇచ్చే ఏ బాధ్యతనైనా స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఇప్పటికే రెడ్డిసామాజికవర్గం నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో మల్ రెడ్డి రంగారెడ్డి, బోధన్ సుదర్శన్ రెడ్డితో పాటు చాలా మంది రేసులో ఉన్నారు. కొత్తగా అనిరుధ్ రెడ్డి కూడా రేసులోకి వచ్చారు.పంచాయతీ ఎన్నికల్లో సొంత ఊరులోనూ పార్టీని గెలిపించలేకపోయిన అనిరుధ్ రెడ్డి.. పవన్ కల్యాణ్ పై విమర్శలు చేయడానికి.. ఆంధ్రా సెంటిమెంట్ రెచ్చగొట్టడానికి వివాదాస్పద కామెంట్లు చేయడంలో మాత్రం ఎప్పుడూ ముందుంటారు. 21 ఏళ్లకే పోటీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో సంచలనాత్మక ప్రతిపాదనతో జాతీయ స్థాయిలో సరికొత్త రాజకీయ చర్చకు తెరలేపారు. ప్రస్తుతం



లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉన్న కనీస వయస్సు పరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ నుంచి ఒక జాతీయ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఆగస్టు మొదటి వారంలో తెలంగాణ శాసనసభ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా రాజ్యాంగ సవరణ చేయాలని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం ఆమోదిస్తామని ప్రకటించారు. 21 ఏళ్లకే చట్టసభల్లోకి అడుగుపెట్టడం ద్వారా జెన్-జీ' యువత ఐటీ, విద్యాశాఖల మంత్రులుగా, సీఎంలుగా, చివరకు ప్రధానిగా దేశాన్ని సమర్థవంతంగా నడపగలరని రేవంత్ రెడ్డి అభిప్రాయం.21 ఏళ్లకే పోటీ చేసే అవకాశం ఇవ్వడం వల్ల కలిగే అతిపెద్ద ప్రయోజనం.. చట్టసభల్లో యువతరానికి ప్రాతినిధ్యం పెరగడం. భారతదేశంలో జనాభాలో అత్యధిక శాతం ఉన్న యువత ఆకాంక్షలకు, వారి సమస్యలకు తగ్గట్లు విధాన నిర్ణయాలు రూపుదిద్దుకోవడానికి ఇది దోహదపడుతుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , స్టార్టప్‌లు, గ్రీన్ ఎనర్జీ, గిగ్ ఎకానమీ వంటి ఆధునిక అంశాలపై 21-25 ఏళ్ల యువతకు ఉన్నంత స్పష్టమైన అవగాహన, డిజిటల్ విజన్ వయోవృద్ధులైన సాంప్రదాయ రాజకీయ నాయకులకు ఉండకపోవచ్చు. అంతేకాకుండా, 18 ఏళ్లకే ఓటు హక్కు, ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత, పెళ్లిళ్లకు చట్టబద్ధత ఉన్నప్పుడు.. తమ నియోజకవర్గాన్ని ఏలే నాయకుడిని ఎన్నుకునే అర్హత ఉన్న యువతకు నేరుగా చట్టసభల్లోకి వెళ్లే హక్కు ఎందుకు ఉండకూడదనే వాదన అత్యంత సమంజసంగా అనిపిస్తుంది. నాణేనికి మరోవైపు చూస్తే ఇందులో కొన్ని తీవ్రమైన ప్రతికూలతలు కూడా ఉన్నాయి. 21 ఏళ్ల వయస్సు అనేది శారీరకంగా, మానసికంగా ఎదుగుతున్న కాలం. చట్టసభల్లో కోట్లాది రూపాయల బడ్జెట్ నిర్ణయాలు, సంక్లిష్టమైన చట్టాల రూపకల్పన, అడ్మినిస్ట్రేటివ్ ఒత్తిడిని తట్టుకోవడానికి రాజకీయ పరిణతి , అనుభవం అత్యంత అవసరం. ఈ వయస్సులో భావోద్వేగ నిర్ణయాలు ఎక్కువయ్యే ప్రమాదం ఉంది. మరో ముఖ్యాంశమేమిటంటే.. సాధారణ కుటుంబాల నుంచి వచ్చే 21 ఏళ్ల యువతకు ఎన్నికల ఖర్చులు, ప్రచారం తట్టుకోవడం అసాధ్యం. ఫలితంగా ఈ సడలింపు వల్ల నిజమైన సామాన్య యువత కంటే వంశపారంపర్య రాజకీయాలు మచేసే బడా నాయకుల పిల్లలు, వారసులు మరింత చిన్న వయస్సులోనే సులువుగా పదవులు ఆక్రమించేందుకు ఇది ఒక రెడ్ కార్పెట్ గా మారే ప్రమాదం ఉంది.ప్రపంచ వ్యాప్తంగా చూస్తే.. బ్రిటన్ , జర్మనీ, ఆస్ట్రేలియా వంటి అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో 18 లేదా 21 ఏళ్లకే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉంది. మన దేశంలో కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇప్పటికే 21 ఏళ్ల వయోపరిమితి అమల్లో ఉంది. స్థానిక సంస్థల స్థాయిలో విజయవంతమైన ఈ మోడల్‌ను చట్టసభలకు విస్తరించడం ఒక రకంగా ప్రజాస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అడుగు. అయితే, కేవలం వయస్సు తగ్గించడమే కాకుండా.. నేరమయ రాజకీయాలకు దూరంగా ఉండేలా, యువతలో సరైన నాయకత్వ లక్షణాలు, సమాజంపై అవగాహన పెంచేలా శిక్షణ ఇచ్చే వ్యవస్థలు కూడా ఏర్పడాల్సి ఉంది. సీఎం రేవంత్ రెడ్డి విసిరిన ఈ పొలిటికల్ డిమాండ్ జాతీయ స్థాయిలో యువతను ఆకట్టుకోవడమే కాకుండా, కాంగ్రెస్ పార్టీని జెన్-జీ ప్రతినిధి గా నిలబెట్టడానికి వేసిన పక్కా స్కెచ్‌గా కనిపిస్తోంది.

# ఖాజీపేటలో రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయాలని కోరాం

- మొదటి పేజీ తరువాయి

ప్రెస్‌మీట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. రైల్వే రంగానికి సంబంధించిన కొన్ని సమస్యలు, ఐటీ రంగానికి సంబంధించినకొన్ని సూచనలు చేశామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఈ రోజు దక్షిణ మధ్యరైల్వేను పునర్విభజన చేసే కార్యక్రమం ఉందన్నారు. ఖాజీపేటలో రైల్వే డివిజన్ కావాలని వరంగల్, ఖాజీ పేట ప్రజలకు కోరిక . దయచేసి ఖాజీపేటలో ఒక రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది. మా ప్రతిపాదన కాదు.. రైల్వే ఉద్యోగులు, నిపుణులు చేస్తున్నప్రతిపాదన.మేము చేసిన ప్రతిపాదనలో ఖాజీపేట, బల్లార్ష , పెద్దపల్లి-నిజామాబాద్, ఖాజీపేట-ఎర్రుపాలెం, ఢోర్నకల్-మణుగూరు, మోతమర్రి-విష్ణుపురం, ఖాజీపేట-వంగపల్లి సెక్షన్లుండాలని సూచించామని.. రైల్వే ఉద్యోగులు కూడా ఈ విషయంలో సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నారని కేటీఆర్ తెలిపారు. 900 కిలోమీటర్లు మాత్రమే ఉండే గుంటూరును ఒక డివిజన్‌గా చేస్తామన్నారు. మాకు ఆ విషయంలో ఎలాంటి అభ్యంతరం లేదు. అట్లాగే 2200 కిలోమీటర్ల పొడవుతో విజయవాడ-గుంతకల్ పనులు జరుగుతున్నయి. ఖాజీపేటలో దాదాపు 2 వేల కిలోమీటర్ల ట్రాక్ ఉంది. దీన్ని కూడా డివిజన్‌గా ఏర్పాటు చేయాలని మేం కోరామన్నారు.ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కూడా కొత్తగూడెం డివిజన్ ఏర్పాటు చేసే సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని కేంద్రమంత్రికి వివరంగా రిప్రెజెంటేషన్ కూడా ఇవ్వడం జరిగిందని కేటీఆర్ తెలిపారు. ఖాజీపేట డివిజన్ అనేది డిమాండ్‌గా, కొత్తగూడెం డివిజన్ మరో డిమాండ్‌గా సాధ్యాసాధ్యాలు పరిశీలించి ఏ రకంగా చేస్తే బాగుంటుందో న్యాయం చేయాలని వారిని కోరడం జరిగిందన్నారు.

# హైడ్రా అధికారిగా ఎవరిని నియమించాలనే విచక్షణ ప్రభుత్వానికి ఉంది

- మొదటి పేజీ తరువాయి

తెలిపారు.అలాగే **VB G RAM G**లో అదనపు పనులు కేటాయించాలని కోరారు. ఇక ఈ **VB G RAM G**లో 10 కొత్త పనులను చేర్చాలని అడిగారు. కూరగాయల పందిళ్లు, పశు గ్రాస ప్లాట్లు, మల్బరీ తోటలు.. పట్టు పురుగుల పెంపకం షెడ్లకు కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిని సీఎం రేవంత్ అనుమతి కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పనులను **VB G RAM G** జాబితాలో చేర్చి.. లబ్ధిదారులకు 90 రోజుల పని కల్పించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు.

**హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు అసంతృప్తి**

లోతుకుంట భూముల కేసు విచారణ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు సోమవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఈ సందర్భంగా ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి సూచించింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని అభిప్రాయపడింది. ఆయన్ని తొలగించడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ పైవిధంగా స్పందించారు.

# లీగల్ నోటీసులతో సరి...

- మొదటి పేజీ తరువాయి

సమయంలోనూ పదుల సంఖ్యలో నాయకులకు లీగల్ నోటీసులు పంపారు. ఒక నాయకుడిగా తన ఇమేజ్‌ను కాపాడుకోవడానికి ఇది చట్టపరంగా సరైన మార్గమే అయినప్పటికీ, ప్రజాక్షేత్రంలో మాత్రం ఇది ఒక రకమైన రక్షణత్మక శైలి గా కనిపిస్తోంది.రాజకీయాల్లో ఆరోపణలు వచ్చినప్పుడు ప్రజా క్షేత్రంలోనే వాటిని ఖండించాలి. రేవంత్ రెడ్డి ప్రజాదరణ పొందిన మాస్ లీడర్ శైలిలో ఘాటైన భాషతో, మీడియా వేదికలపై బహిరంగ దాడి చేస్తుంటే, కేటీఆర్ కూడా తన పద్ధతిలో కౌంటర్ ఇస్తున్నపటికీ అదనంగా కార్పొరేట్ పద్ధతిలో లీగల్ నోటీసుల కాగితాలను ముందుకు తెస్తున్నారు. రేవంత్ చేసే ప్రతి ఆరోపణకు మైక్ ముందుకు వచ్చి గంటల తరబడి ఆధారాలతో కౌంటర్ ఇవ్వకుండా, కేవలం లీగల్ టీమ్‌తో నోటీసులు పంపడం వల్ల.. కేటీఆర్ దగ్గర రాజకీయంగా రేవంత్‌ను ఢీకొట్టే కంటెంట్ లేదా పవర్ లేదా అనే సందేహం సామాన్య ప్రజల్లోకి వెళ్తోంది. ప్రజాస్వామ్యంలో కోర్టు నోటీసుల కంటే ప్రజా కోర్టులోనే నిజానిజాలు తేలాలనేది మెజారిటీ ఓటర్ల భావన. ఈ లీగల్ నోటీసుల స్ట్రాటజీ వల్ల రేవంత్ రెడ్డికి రాజకీయంగా మరింత మేలు జరుగుతోందనేది రాజకీయ విశ్లేషకుల అంచనా. కేటీఆర్ నోటీస్ ఇవ్వగానే.. నేను దేనికైనా సిద్ధం, విచారణ జరిపిస్తాం అని రేవంత్ రెడ్డి ఆ ఆరోపణలను మరింత గట్టిగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఫలితంగా, గ్లోబ్‌ఎరీనా లేదా ఇతర ఆరోపణలు మీడియాలో రోజుల తరబడి నానుతూ, కేటీఆర్‌కు ప్రతికూల ప్రచారంగా మారుతున్నాయి. ఒక రకంగా కేటీఆర్ పంపే నోటీసులే రేవంత్ రెడ్డి ఆరోపణలకు మరింత పబ్లిసిటీ తెచ్చిపెడుతున్నాయనే సత్యాన్ని బీఆర్ఎస్ వ్యూహకర్తలు గుర్తించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి.మాజీ మంత్రిగా, ఒక సమర్థవంతమైన పాలకుడిగా ఐటీ రంగాన్ని నడిపిన కేటీఆర్.. చట్టపరమైన ప్రక్రియల ద్వారా తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలనుకోవడం సాంకేతికంగా సరికావచ్చు. కానీ, తెలంగాణ వంటి హై-ఓల్టేజ్ రాజకీయాలు నడిచే రాష్ట్రంలో కార్పొరేట్ తరహా లీగల్ బెదిరింపులు పాలిటిక్స్‌లో పనిచేయవు. శత్రువు విసిరిన బాణాన్ని చట్టంతో కాకుండా, అంతకంటే పవర్ ఫుల్ పొలిటికల్ అస్త్రంతో తిప్పికొట్టినప్పుడే కేడర్‌లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. రేవంత్ రెడ్డి లేవనెత్తుతున్న ప్రతి అంశంపై సభలు, సమావేశాలు పెట్టి ఆధారాలతో ప్రజాక్షేత్రంలోనే ఎండగట్టకపోతే.. ఆయనకు రాజకీయంగా రేవంత్‌ను ఎదుర్కొనే సత్తా తగ్గుతోందనే ప్రచారం నిజమేనని ప్రజలు నమ్మే ప్రమాదం ఉందని ఎక్కువ మంది భావిస్తున్నారు.

# ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాలపై కీలక సమీక్ష

- మొదటి పేజీ తరువాయి

బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు చేపట్టిన సంస్థాగత కార్యక్రమాలు, ఎస్ఎస్ఏ సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమాల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు.తెలంగాణలో నిర్వహించిన సంస్థాగత కార్యక్రమాలపై కేసీ వేణుగోపాల్ సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు, సంఘటన్ సృజన్ అభియాన్ అమలును అభినందించారు.అదే సమయంలో, ఎస్ఎస్ఏ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అమలు చేయాలని పార్టీ నాయకత్వానికి సూచించారు.

# జెన్ జీ మంత్రంలో రేవంత్

- మొదటి పేజీ తరువాయి

రేకెత్తించే ప్రయత్నం.లాల్ బహదూర్ శాస్త్రి ఇచ్చిన 'జై జవాన్ - జై కిసాన్' నినాదం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. దానికి 'జై యువ'ను జోడించడం ద్వారా రేవంత్ మూడు కీలక సంకేతాలు పంపారు.గుర్తింపు: సైనికులు, రైతులంత ప్రాధాన్యం యువతకు ఇస్తున్నామని చెప్పడం.ఆధునికీకరణ: కాంగ్రెస్ పార్టీ పాత చింతకాయ పచ్చడి కాదని, ఆధునిక తరమైన 'జెన్-జీ' ఆకాంక్షలను అర్థం చేసుకోగలదని చాటడం.ప్రత్యామ్నాయం: బీజేపీ తరచూ వాడే 'యువశక్తి' అనే నినాదానికి పోటీగా, మరింత ఆచరణాత్మకమైన, అధికార భాగస్వామ్యాన్ని వాగ్దానం చేసే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం.ఈ డిమాండ్ కేవలం తెలంగాణకు పరిమితమైనది కాదు. దీనికోసం రాజ్యాంగ సవరణ చేయాలి, ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశం. ఆగస్టులో అసెంబ్లీలో తీర్మానం చేసి ప్రధానికి పంపుతామనడం ద్వారా రేవంత్ తన పోరాటాన్ని ఢిల్లీకి మారుస్తున్నారు. తద్వారా, రాహుల్ గాంధీ తర్వాత, బీజేపీకి వ్యతిరేకంగా యువత తరపున బలంగా గళం విప్పుతున్న జాతీయ స్థాయి కాంగ్రెస్ నేతగా తనను తాను ప్రొజెక్ట్ చేసుకుంటున్నారు. ఇది ఆయన వ్యక్తిగత ఇమేజ్‌ను, రాజకీయ బరువును పెంచే ఒక మాస్టర్ స్ట్రోక్. 21 ఏళ్లకే ఓటు హక్కు ఉన్నప్పుడు, అదే వయసుకు పోటీ చేసే అర్హత ఎందుకు ఉండకూడదనేది తార్కికంగా బలమైన వాదన. ఈ డిమాండ్ నెరవేరినా, నెరవేరకపోయినా కాంగ్రెస్‌కు రాజకీయంగా లాభమే. కేంద్రం ఒప్పుకుంటే, అది కాంగ్రెస్ సాధించిన నైతిక విజయంగా, యువతకు తామిచ్చిన కానుకగా చెప్పుకోవచ్చు. ఒప్పుకోకపోతే, బీజేపీని 'యువత వ్యతిరేకి'గా చిత్రించి, రాబోయే ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా వాడుకోవచ్చు. అంతిమంగా, ఈ చర్చ ద్వారా దేశంలోని కోట్లాది మంది యువ ఓటర్లతో ఒక బలమైన బంధాన్ని ఏర్పరచుకోవడం, వారిని కాంగ్రెస్ వైపు ఆకర్షించడం ఈ వ్యూహంలో కీలక భాగం.మొత్తం మీద, రేవంత్ రెడ్డి ప్రకటనను కేవలం నీట్ బాధితులపై జాలిగా చూడలేం. ఇది ఒకే దెబ్బకు అనేక పిట్టలను కొట్టే రాజకీయ చతురత. యువత ఆగ్రహాన్ని చల్లార్చడం, వారిని ఆకర్షించడం, బీజేపీని ఇరుకున పెట్టడం, తన జాతీయ స్థాయి ఇమేజ్‌ను పెంచుకోవడం వంటి బహుళ ప్రయోజనాలతో కూడిన ఒక పక్కా రాజకీయ ఎత్తుగడ ఇది. ఈ 'జెన్-జీ' అస్త్రం ఎంతవరకు పనిచేస్తుందో, కేంద్రం దీనిపై ఎలా స్పందిస్తుందో కాలమే నిర్ణయించాలి.

# హైడ్రాపై బిజేపీ, బిఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయి

- మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేశారు. హైడ్రాకు సంబంధించిన పూర్తి తీర్పు ఇంకా వెలువడలేదని, తుది తీర్పు వచ్చిన తర్వాత ప్రభుత్వం చట్టపరంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రభుత్వం తరఫున చెప్పాల్సిన అన్ని అంశాలనూ కోర్టు ముందే వివరిస్తామని, న్యాయ ప్రక్రియను పూర్తిగా గౌరవిస్తామని చెప్పారు. అయితే కోర్టు తీర్పు పూర్తిగా రాకముందే కొన్ని రాజకీయ పార్టీలు, ముఖ్యంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వాస్తవాలు బయటకు వచ్చే వరకూ ప్రజలు పుకార్లను నమ్మవద్దని, అధికారిక సమాచారం ఆధారంగానే స్పందించాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

వార్తాతరంగాలు

బుధవారం 29 జూలై 2026

# నేను పారిపోలేదు.. ఊళ్లోనే ఉన్నా..

ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి

తనపై వచ్చిన లైంగిక ఆరోపణలను ఖండించిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి

తాను ఎక్కడికీ పారిపోలేదని, సొంత ఊరిలోనే ఉన్నానని వెల్లడి

చట్టంపై నమ్మకం ఉందని, పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తానని స్పష్టీకరణ

త్వరలోనే నిర్దోషిగా బయటకు వస్తానని ధీమా వ్యక్తం చేసిన ఉదయ్ కృష్ణారెడ్డి



హైదరాబాద్ జాతీయ పోలీస్ అకాడమీలో సంచలనం సృష్టించిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి స్పందించారు. తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, తాను ఎక్కడికీ పారిపోలేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం తన సొంత ఊరు ఊళ్లపాలెంలోనే ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. చట్టంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, పోలీసుల విచారణకు సంపూర్ణంగా సహకరిస్తానని చెప్పారు. తన నాన్నమ్మకు ఆరోగ్యం బాగోలేకపోవడంతోనే సొంతూరుకు వచ్చినట్లు వివరించారు. పోలీసులు వెతికినవి తన తాత్కాలిక చిరునామాలు అని పేర్కొన్నారు. ఈ వ్యవహారం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్నందున దీనిపై ఎక్కువగా మాట్లాడలేనని అన్నారు. త్వరలోనే విచారణ అధికారులను కలిసి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటానని ధీమా వ్యక్తం చేశారు. జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న తనను ఉదయ్ కృష్ణారెడ్డి లైంగికంగా వేధించారంటూ ఓ మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఫిర్యాదుతో కేసు నమోదు కావడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

# జూరాలకు పోటెత్తుతున్న కృష్ణమ్మ..

శ్రీశైలం డ్యామ్ కు పెరుగుతున్న వరద ప్రవాహం

కృష్ణానది ఎగువన కురుస్తున్న కుండపోత వర్షాలు

జూరాల ప్రాజెక్టుకు 32 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

క్రస్ట్ గేట్లు ఎత్తేసిన అధికారులు.. శ్రీశైలం జలాశయానికి వరద



రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎల్ నినో ప్రభావం కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అయినప్పటికీ కృష్ణానది మాత్రం జలకళను సంతరించుకుంటోంది. కృష్ణా నది ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న కుండపోత వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ఉద్ధృతి గణనీయంగా పెరిగింది. వారం రోజులుగా ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వానలు పడుతుండటంతో జూరాలకు ఇన్‌ఫ్లో భారీగా వచ్చి చేరుతోంది. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు 32,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా... అధికారులు క్రస్ట్ గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దాదాపు 30,700 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి ప్రవాహం నిలకడగా కొనసాగుతుండటంతో దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి కృష్ణమ్మ వేగంగా చేరుతోంది. మహారాష్ట్ర, కర్ణాటకలోని పశ్చిమ కనుమలతో పాటు భీమా నది పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. భీమా నది ప్రవాహాలు కూడా తోడైతే జూరాలకు ఇన్‌ఫ్లోలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఎగువ నుంచి వచ్చే ప్రవాహం భారీగా పెరిగే సూచనలు కనిపించడంతో, రాబోయే రోజుల్లో శ్రీశైలానికి మరింత జలకళ రానుందని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

# డివిజనల్ బెంచ్ కు సర్కార్..



**హైదరాబాద్, జూలై 28:** హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్‌ను తొలగించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రంగనాథ్ స్పందించారు. తాము రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగానే పనిచేస్తున్నామని, చెరువులు, ప్రభుత్వ ఆస్తులను కాపాడటమే హైడ్రా ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. హైడ్రా ఇప్పటివరకు సుమారు రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించి, వేల ఎకరాల భూములను వెనక్కి తీసుకుని ప్రభుత్వానికి అప్పగించిందని, ఇటీవల లోతుకుంటలో భూకబ్జా యత్నాన్ని కూడా అడ్డుకుందని తెలిపారు. ఆక్రమణల తొలగింపుతో పాటు ఇప్పటికే 6 చెరువులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని, మరో 20 చెరువుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ల్యాండ్ మాఫియా కోర్టులను తప్పుదోవ పట్టిస్తోందని, తనపై ఉన్న కోర్టు ధిక్కార కేసులన్నీ భూకబ్జాదారులు వేసినవేనని ఆరోపిస్తూ, న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందని.. ఆ కేసులన్నింటినీ చట్టపరంగానే ఎదుర్కొంటానని ఆయన అన్నారు. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్‌ను తొలగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇప్పుడు ప్రభుత్వం ఏం చేయబోతోందనే అంశంపైనే అందరి దృష్టి నెలకొంది. హైడ్రా కమిషనర్‌గా దాదాపు రెండేళ్ల నుంచి కొనసాగుతూ వచ్చిన రంగనాథ్ విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందనే విషయంలో సస్పెన్స్‌గా మారింది. అయితే హైకోర్టు ఆదేశాలపై ఆచితూచి స్పందించాలని ప్రభుత్వం నభావిస్తోంది. రంగనాథ్ విషయంలో వేచి చూసే ధోరణిలో ముందుకు సాగాలని యోచిస్తోంది. తీర్పునకు సంబంధించిన ఆర్డర్ కాపీ ఆధారంగా న్యాయసలహా తీసుకోవాలని డిసైడయ్యింది. ఇక ఈ విషయాన్ని ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు ఇంటలిజెన్స్ చీఫ్. దీనిపై న్యాయసలహా తీసుకోవాలని సీఎస్‌కు సీఎం రేవంత్ ఆదేశించినట్టు తెలుస్తోంది. ఇక హైడ్రాపై నమోదైన కోర్టు ధిక్కరణ కేసులపై సీఎస్ ఆరా తీస్తున్నట్టు సమాచారం. మరోవైపు ఈ కేసులో సింగిల్ బెంచ్ తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీల్‌కు వెళ్లడంపై ప్రభుత్వం సమాలోచనలు జరుపుతున్నట్టు తెలుస్తోంది.

# పట్నం సోదరులకు పరామర్శించిన హరీష్ రావు



**హైదరాబాద్:** కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాతృమూర్తి పట్నం రుక్కమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించిన నేపథ్యంలో ఈరోజు షాబాద్లోని వారి నివాసానికి మాజీ మంత్రి హరీష్ రావు బీఆర్ఎస్ నాయకులతో వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాతృవియోగంతో తీవ్ర విషాదంలో ఉన్న పట్నం నరేందర్ రెడ్డి, వారి సోదరుడు మహేందర్ రెడ్డి ని ఓదార్చారు. రుక్కమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

# తీవ్ర వర్షభావ పరిస్థితులతో నీటి కష్టాలు

**హైదరాబాద్, జూలై 28:** తెలంగాణ రాష్ట్రంలో భీమా నది పరిసర ప్రాంతాల్లో పరిస్థితులు దారుణంగా మారాయి. కర్ణాటక రాష్ట్రం నిర్మించిన రోడ్-కమ్-బ్యారేజీల వల్ల తెలుగు రాష్ట్రాలు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నాయి. ఒక్కో బ్యారేజీ 1.5 టీఎంసీ నీటిని నిల్వ చేస్తుందని చెబుతున్నప్పటికీ, వాస్తవానికి 3 టీఎంసీలకు పైగా నీటిని నిల్వ చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కృష్ణా నది కూడా ఈ పరిస్థితిని అనుభవిస్తోంది, దీంతో పాలమూరు జిల్లాలో పంటలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. ప్రస్తుత కరవు పరిస్థితుల్లో, సాగు మరియు తాగు నీటికి కూడా కష్టాలు తప్పవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు లేకపోవడం, పంటల సాగు ప్రశ్నార్థకంగా మారడం రైతులకు కష్టాలను తెచ్చిపెడుతోంది. తొలకరి చినుకులు పడుతున్నా, రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి తీవ్రంగా కష్టపడుతున్నారు. నారాయణపేట జిల్లా తంగిడిగి వద్ద కృష్ణా మరియు భీమా నదుల సంగమం ద్వారా రాష్ట్రంలోకి నీటిని ప్రవేశపెట్టడం జరుగుతోంది. కర్ణాటక ప్రభుత్వం 7 రోడ్-కమ్-బ్యారేజీలను నిర్మించడంతో, ఈ ప్రాంతంలో నీటి నిల్వ సమస్యలు పెరిగాయి. గూడూరు, చిగనూరు, కందల్లి, యాద్గిర్, సన్నత్తి, నీలోగి, గానుగాపూర్ వంటి ప్రాంతాల్లో ఈ బ్యారేజీలు నిర్మించబడ్డాయి. ఈ బ్యారేజీల నిర్మాణం వల్ల కృష్ణా నదిపై గిరిజాపూర్, గూగల్, తింతిని బ్యారేజీల ద్వారా పెద్ద ఎత్తున



నీటిని నిల్వ చేయడం జరుగుతోంది. ఈ బ్యారేజీల సామర్థ్యం 1.5 టీఎంసీగా చెబుతున్నా, వాస్తవానికి 3 టీఎంసీలకు పైగా నీటిని నిల్వ చేస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. గతంలో ఇనుప షీట్లు ఉపయోగించి నీటిని నిల్వ చేసేవారు, ఇప్పుడు హైడ్రాలిక్ గేట్లు మరియు రబ్బర్లు ఉపయోగించి నీటిని అడ్డుకుంటున్నారు. కర్ణాటక ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘిస్తూ రోడ్-కమ్-బ్యారేజీలు నిర్మించడం, తెలుగు రాష్ట్రాలకు నష్టాన్ని కలిగిస్తోంది. ఈ పరిస్థితులు కొనసాగితే, సాగు మరియు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని పాలమూరు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీవినీ ఎరుగని కరవు ప్రపంచంపై ప్రకృతి తీవ్రంగా దాడి చేస్తోందని తెలంగాణ వ్యవసాయం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. గత 150 సంవత్సరాలలో ఎన్నడూ చూడని తీవ్ర కరవు పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపారు. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరగడం వల్ల దేశానికి రావాల్సిన నైరుతి రుతుపవనాల జాడ లేకుండా పోయిందని, దాంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. దీని ప్రభావం వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల వరకు ఉండే అవకాశం ఉందని, రాబోయే రోజుల్లో సరైన వర్షాలు కురవవని ఐఎండీ మరియు అంతర్జాతీయ వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే నెలలో కురిసే స్వల్ప వర్షాలు కేవలం మెట్ట పంటలకు మాత్రమే ఉపయోగపడతాయని, ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగు చేయడం చాలా కష్టతరమని స్పష్టం చేశారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు తక్కువ సమయంలో, తక్కువ నీటితో పండే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా, రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా తీర్చిదిద్ది రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ కమిటీల పనితీరును పరిశీలించేందుకు 6 ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామని, ఇవి వారం రోజుల పాటు తనిఖీలు నిర్వహిస్తాయని తెలిపారు.

# దేశంలోనే స్కూళ్ల ఫీజుల్లో హై-డర్- బాద్

**హైద్రాబాద్, జూలై 28:** హైదరాబాద్‌లో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల మోత మోగుతోంది. ఎలాంటి నిబంధనలు లేకుండా పాఠశాలలు 40 శాతం నుంచి 100 శాతం వరకు ఫీజులను పెంచుతుండటంతో తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారు. ఫీజుల పెంపుపై దేశవ్యాప్తంగా అత్యధిక ఫిర్యాదులు హైదరాబాద్ నుంచే వస్తున్నట్లు తెలిపింది. గృహ రుణ ఈఎంఐలతో సమానంగా మారుతున్న స్కూల్ ఫీజుల వల్ల విద్య మధ్యతరగతికి భారంగా మారుతోందని, ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలు పెంచితేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని విద్యా నిపుణులు సూచిస్తున్నారు. ఒకప్పుడు విద్య అంటే జ్ఞాన దానం.. నేడు విద్య అంటే లాభసాటి వ్యాపారం. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు చదువును ఒక సేవగా కాకుండా.. లాభాలు తెచ్చిపెట్టే వ్యాపారంగా మార్చేశాయి. ఫీజుల మోత, డొనేషన్ల బాదుడు, పుస్తకాలు-యూనిఫాంల పేరుతో తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పెడుతూ అడ్డగోలుగా దోచుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల ఫీజులు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో.. ఫీజులకి సంబంధించిన ఫిర్యాదులలో హైదరాబాద్ దేశంలోని అగ్రశ్రేణి నగరాలలో ఒకటిగా నిలిచింది. ఇతర మెట్రో నగరాలలో ఫీజుల పెరుగుదల సాధారణంగా 10 నుంచి 30 శాతం వరకు ఉండగా.. హైదరాబాద్‌లో మాత్రం ఎలాంటి నిబంధనలు లేకపోవడం వల్ల కొన్ని ప్రైవేటు స్కూళ్లు ఏకంగా 40 నుంచి 50 శాతం మేర, కొన్ని సందర్భాల్లో 100 శాతం వరకు ఫీజులను పెంచుతున్నాయని ఇండియన్ వెబ్ ఆఫ్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు అనుభా సహాయ్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని మెజారిటీ తల్లిదండ్రుల నుంచే తమకు అత్యధిక ఫిర్యాదులు అందుతున్నాయని, బెంగళూరు రెండో స్థానంలో ఉందని ఆమె తెలిపారు. చాలా కుటుంబాలకు పాఠశాల విద్య ఖర్చులు హోమ్ లోన్ ఈఎంఐలను తలపించేలా భారంగా మారుతున్నాయన్నారు. ఇటీవల కెనడా నుంచి నగరానికి తిరిగి వచ్చిన ఓ మహిళ మాట్లాడుతూ.. తన ఏడేళ్ల కూతురి స్కూల్ ఫీజు గురించి ఆశ్చర్యకర విషయాలు వెల్లడించారు. ట్రాన్స్‌పోర్టుతో కలుపుకొని ఏడాదికి రూ. 3 లక్షలకు పైగా చెల్లిస్తున్నట్లు తెలిపారు. తమ ఇంటి లోన్ ఈఎంఐ రూ. 40 వేలు ఉంటే, కూతురి స్కూల్ నెలకు ఫీజు రూ. 22 వేల వరకు ఉందని, 10 ఏళ్ల క్రితంతో పోలిస్తే ఫీజులు ఇంతరా పెరిగిపోవటం తనను ఆశ్చర్యపరిచిందని ఆమె వెల్లడించారు. ఫీజులు విపరీతంగా ఉండటం వల్లే తాము కేంబ్రిడ్జ్ సిలబస్ బదులుగా సీబీఎస్ఈని ఎంచుకోవాల్సి వచ్చిందని చెప్పారు. తమ పిల్లల ఫీజులను ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం ఒక్కసారిగా భారీగా పెంచేసిందని పేట్‌బషీరాబాద్‌కు చెందిన మరో మహిళ వాపోయారు. గతేడాది ప్రైమరీ చదువుతున్న ఇద్దరు పిల్లలకు వరుసగా రూ. 23 వేలు, రూ. 22 వేలు చెల్లిస్తే.. ఈ ఏడాది ఆ ఫీజులు రూ. 40 వేలు, రూ. 58 వేలకు పెంచినట్లు తెలిపారు. రసీదుల ఆధారంగా ఒకరి ఫీజు సుమారు 74 శాతం పెరిగితే.. మరో అబ్బాయికి ఏకంగా 164 శాతం పెరిగిందని దీనివల్ల తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ రకమైన ధోరణి కారణంగా విద్య అప్పర్ మిడిల్ క్లాస్ మినహా ఇతరులకు అందని ద్రాక్షలా మారుతోందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, విద్యావేత్త ఆకునూరి మురళి ఆందోళన వ్యక్తం చేశారు. కొద్ది కుటుంబాలు తమ నెలవారీ ఆదాయంలో 50 శాతాన్ని స్కూల్ ఫీజులకే ఖర్చు చేస్తున్నాయని, మంచి ప్రైవేట్ పాఠశాలల్లో చదివించాలనే ఉద్దేశంతో గిగ్ కార్మికులు కూడా రెట్టింపు కష్టపడి




సంపాదిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వాలు విద్యకు తక్కువ బడ్జెట్‌ను కేటాయిస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తే ప్రజలు ప్రైవేట్ స్కూళ్ల వైపు వెళ్లాల్సిన అవసరం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ విద్యా కమిషన్ సూచనలు అమలవకపోవటం దురదృష్టకరమని అన్నారు. పాఠశాలలను ప్రశ్నిస్తే తమ పిల్లలను టార్గెట్ చేస్తారనే భయంతో చాలా మంది తల్లిదండ్రులు మౌనంగా ఉంటున్నారని అనుభా సహాయ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు పరిమితంగా ఉండటం, అందరికీ కేంద్రీయ విద్యాలయాల్లో సీట్లు రాకపోవడం వల్ల ప్రత్యామ్నాయాలు కరువయ్యాయని పేర్కొన్నారు. అలాగే.. హైదరాబాద్‌లోని అనేక అంతర్జాతీయ పాఠశాలలు ఫీజుల వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచకుండా పారదర్శకతను విస్మరిస్తున్నాయని హైదరాబాద్ ప్రైవేట్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధి బీవీకే కిషోర్ంంంఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఇలాగే కొనసాగితే సామాన్యుల పిల్లలు చదువుకు దూరం కావాల్సిందేనని హెచ్చరించారు.

# క్రాస్ రూట్ కు దూరంగా కవిత...

**హైదరాబాద్, జూలై 28:** మొగుడు కొట్టినందుకు కాదు తోటికోడలు నవ్వినందుకే నే ఏడుస్తున్నా" అనే నానుడి తెలంగాణ రాజకీయాల్లో అచ్చం సరిపోతుంది. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన విమర్శలు విన్నప్పుడు ప్రతి ఒక్కరికీ ఇదే నిజమనిపిస్తుంది. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్తు గురించి, లాభనష్టాల గురించి లోతుగా లెక్కలు వేసుకున్న తర్వాతే కేటీఆర్ విద్యార్థులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. కానీ కవిత మాత్రం ఆ మాత్రం ధైర్యం కూడా చేయలేకపోయారు. దాదాపు నెలరోజులుగా ఢిల్లీలో విద్యార్థులు తీవ్రమైన ఆందోళనలు చేస్తున్నా, ఆ పోరాటాలు ఎంతో ఉద్రిక్తంగా మారినా ఆమె ఎప్పుడూ మొక్కుబడిగా స్పందించారే తప్ప విద్యార్థులకు నిజమైన అండగా నిలబడే ప్రయత్నం ఎన్నడూ చేయలేదు. ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలు పూర్తిగా ముగిసిన తర్వాత మీడియా ముందుకు వచ్చి తాపీగా మాట్లాడడం ఆమె వైఫల్యానికి నిదర్శనం. ఆ సమయంలో ఊరుకుంటే బాగుండేది కానీ ఆమె అనవసరమైన విమర్శలకు దిగారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు విద్యార్థులతో కలిసి శనివారం సాయంత్రం భారీ ర్యాలీలో పాల్గొనడాన్ని ఆమె తీవ్రంగా తప్పుపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల విజయాన్ని స్వయంగా తన ఖాతాలో వేసుకున్నారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వాన్ని కూడా విద్యార్థులు ఎక్కడ ప్రశ్నిస్తారో అనే భయంతోనే రేవంత్ రెడ్డి ఈ కొత్త నాటకాలు ఆడుతున్నారని ఆమె ఆరోపించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి పోరాటాలు చేయకుండా కేవలం మాటలతో కాలక్షేపం చేసే నాయకులకు ఇటువంటి విమర్శలు చేయడం పరిపాటిగా మారింది. కాంగ్రెస్ పార్టీకి మొదట్నుంచీ విద్యార్థుల విషయంలో స్పష్టమైన వైఖరి ఉంది. ఆ పార్టీ ఎలాంటి ఉద్దేశ్యాలు కలిగి ఉన్నప్పటికీ ఈ ఆందోళనలకు బహిరంగంగానే తన సంఘీభావం తెలిపింది. పార్లమెంటు లోపల, బయట విద్యార్థుల తరఫున గట్టిగా పోరాడింది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, మంత్రులు, ఆ పార్టీ సీనియర్ నేతలు అందరూ విద్యార్థులకు మద్దతుగా ఆందోళనలు నిర్వహించారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు కూడా ప్రత్యక్షంగా నిరసనల్లో పాల్గొన్నారు. కనుక విద్యార్థుల ఆందోళనలలో కాంగ్రెస్ పార్టీ కూడా ఒక భాగస్వామి అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కష్టకాలంలో విద్యార్థులకు అండగా ఉన్న పార్టీని ప్రశ్నించే నైతిక హక్కు



కేవలం ప్రజలకోసం పోరాడే వారికే ఉంటుంది. ఈ సుదీర్ఘ ఆందోళనలకు పూర్తిగా దూరంగా ఉండిపోయిన కల్వకుంట్ల కవిత, విద్యార్థులకు ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ అండగా నిలబడిన కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్ రెడ్డిని ఆక్షేపించడం చూస్తే అసలు విషయం అర్థమవుతుంది. ఈ రాజకీయ క్రెడిట్ అంతా తనకు దక్కలేదు, కేవలం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీకి మాత్రమే దక్కిందనే తీవ్రమైన బాధతోనే ఆమె ఈవిధంగా మాట్లాడినట్లు స్పష్టంగా అనిపిస్తుంది. ప్రజల సమస్యల కంటే రాజకీయ లబ్ధి, క్రెడిట్ కోసమే బీఆర్ఎస్ నాయకులు పాకులాడుతున్నారనే విమర్శలకు ఈ ఘటన మరో ఉదాహరణగా నిలిచింది. కష్టపడి పనిచేసే వారికే ఫలితం దక్కుతుందనే కనీస సత్యాన్ని గ్రహించలేక కవిత ఇలాంటి విమర్శలు చేయడం ద్వారా తన రాజకీయ అపరిపక్వతను మరోసారి బయటపెట్టుకున్నారు. సొంత పార్టీ నాయకులు సైతం క్షేత్రస్థాయిలో ప్రజల్లో ఉంటుంటే, అధ్యక్షురాలి హోదాలో ఉన్న కవిత మాత్రం కేవలం మాటల గారడీకి పరిమితం కావడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చడానికి ఇతరులపై బురదజల్లే సంస్కృతిని బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా మార్చుకోవాలి. విద్యార్థుల భవిష్యత్తును రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం మానేసి నిర్మాణాత్మకమైన సలహాలు ఇస్తే ప్రజలు హర్షిస్తారు. కానీ కేవలం ఈర్ష్య, అసూయలతో మాట్లాడే నాయకులకు భవిష్యత్తులో ప్రజలే సరైన గుణపాఠం చెబుతారు. కవిత చేసిన ఈ వ్యాఖ్యానాలు ఆమె రాజకీయ పరిపక్వత లోపాన్ని ఎత్తిచూపుతున్నాయి తప్ప కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏమాత్రం ఇబ్బంది పెట్టలేవని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

## ఆలయంలో దొంగలు

**రంగారెడ్డి:** నగర శివారు నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగలు రెచ్చిపోయారు. ఖానాపూర్ పోచమ్మ దేవాలయంలో అర్ధరాత్రి దొంగల బీభత్సం సృష్టించారు. ఆలయంలోని హుండీ,అమ్మవారి పై ఉన్న బంగారు,వెండి ఆభరణాలు, ఇతర పూజ ఎత్తుకెళ్లారు. తాము చేసిన దొంగతనం బయటపడుతుందని సీసీ కెమెరాల డి డి విఆర్ ను సైతం ఎత్తుకెళ్లారు. ఈ పని తెలిసిన వారి చేసుంటారని గ్రామ ఆలయ కమిటీ అనుమానాలు వ్యక్తం చేస్తుంది. నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సంగం లక్ష్మీబాయి కాలేజ్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు

**హైదరాబాద్:** ఐ.ఎస్. సదన్లోని సంగం లక్ష్మీబాయి కాలేజ్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సంగం లక్ష్మీబాయి జయంతి సందర్భంగా పుస్తకాల పంపిణీ అంశం వివాదానికి దారితీయడంతో ఆందోళన చెలరేగింది. ఐ.ఎస్. సదన్లోని సంగం లక్ష్మీబాయి కాలేజ్లో సంగం లక్ష్మీబాయి జయంతి సందర్భంగా పుస్తకాల పంపిణీ విషయంలో వివాదం నెలకొంది. ఈ క్రమంలో మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో కళాశాల ఎదుట ధర్నా చేపట్టారు. పుస్తకాల పంపిణీని అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ సమితి సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో కాలేజి పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని ఇరు వర్గాలతో చర్చలు జరుపుతూ పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేసారు. కాలేజి వద్ద ఎటువంటి అవాంఛనియా సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు.

## కుత్బుల్లాపూర్ లో చైన్ స్నాచింగ్

**మేడ్చల్:** కుత్బుల్లాపూర్ లో చైన్ స్నాచింగ్ జరిగింది. స్నాచర్ ఒక వృద్ధురాలి మెడలో నుంచి మూడు తులాల చైన్ లాక్కెళ్లాడు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిగిలోని హెచ్ఏఎల్ కాలనీ లో చైన్ స్నాచింగ్ జరిగింది. ఇంటిముందు కూర్చున్న వృద్ధురాలు వెంకమ్మ(80) మెడలో నుండి 3తులాల గొలుసునుదుండగుడు లాక్కెళ్లాడు. కాలనీ వాసులు చైన్ స్నాచర్ ను వెంబడించి పట్టుకుని దేహశుద్ధి చేసారు. చైన్ స్నాచింగ్ చేసిన బైక్ ను వదిలి కాలనీవాసుల నుండి నిందితుడు తప్పించుకు పారిపోయాడు. ..

### అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల పోషణతో పాటు

# నాణ్యమైన విద్యాతో తీర్చిదిద్దాలి

**చిన్నారుల బరువు, ఎదుగుదలపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జోగులాంబ గద్వాల,జూలై28(స్కై న్యూస్):**పిల్లల పోషణతో పాటు వారి విద్యా పునాదులు బలంగా ఉండేలా అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన బోధన అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.మంగళవారం గద్వాల మండలం చెనుగొనిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం,విద్యా బోధన, తదితర వివరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,పిల్లల భవిష్యత్తుకు పునాది అంగన్వాడీ కేంద్రాల ద్వారానే నిర్మితమవుతుందని అన్నారు. పిల్లలు క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు.అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్య, సామ్ - మామ్ స్టంటింగ్ సమస్యలు



ఉన్న చిన్నారులను ముందుగానే గుర్తించి,వారికి ప్రత్యేక పోషకాహారం అందించి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే తల్లిదండ్రులకు సమతుల్య పౌష్టికాహారం,శిశు సంరక్షణ, ఆరోగ్యకరమైన అలవాట్లపై నిరంతరం అవగాహన కల్పించాలని చెప్పారు.అంగన్వాడీ కేంద్రాల్లోనే పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను సమర్థవంతంగా బోధించి భవిష్యత్తు విద్యకు బలమైన పునాది వేయాలని ఆదేశించారు. తనిఖీలో భాగంగా పిల్లల బరువును పరిశీలించి, వయస్సుకు అనుగుణంగా ఎదుగుదల ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించి,వారి చదువు, ఆటపాటల గురించి అడిగి తెలుసుకున్నారు.పిల్లలు చురుకుగా ఉండడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, ఉపాధ్యాయులు ఇదే విధంగా బోధిస్తూ పిల్లలను మరింత చురుకూగా,క్రమశిక్షణతో తీర్చిదిద్దాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గద్వాల్ తహసీల్దార్ హరికృష్ణ, అంగన్వాడీ టీచర్,పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

### 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో

# కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోంది...

**రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి....**

**జోగులాంబ గద్వాల, జూలై28 (స్కై న్యూస్):**తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం రాష్ట్ర పిలుపు మేరకు గద్వాల పట్టణంలోని ఎస్వీఎం డిగ్రీ కళశాల లో ఫీజుల బకాయి– బీజేపీ లడాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్వీఎం డిగ్రీ కళాశాల లో సుమారు 300 మంది విద్యార్థులతో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత ఆరు, ఏడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండటంతో వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పేద విద్యార్థుల చదువులకు ఆటంకాలు ఫీజులు, స్కాలర్‌షిప్‌లు సకాలంలో విడుదల కాకపోవడంతో పేద,మధ్య తరగతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కొన్ని కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేయడం, పరీక్షలు రాయడంలో, తదుపరి విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందడంలో




విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను సకాలంలో విడుదల చేస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పెండింగ్ బకాయిలను పూర్తిస్థాయిలో విడుదల చేయకుండా పరిమిత మొత్తాన్ని విడుదల చేయడాన్ని బీజేవైఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు.బీజేవైఎం ప్రధాన డిమాండ్లు..పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే పూర్తిస్థాయిలో విడుదల చేయాలి.ఫీజు బకాయిల కారణంగా కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేయకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం అందించే భిక్ష కాదని, అది విద్యార్థుల హక్కు అని ప్రభుత్వం గుర్తించాలి.పేద, వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థుల విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలి.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ నరసింహులు,కౌన్సిలర్ శాలన్న, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సమత గౌడ్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు అనిల్,రిటైర్డ్ ఉపాధ్యాయులు పరమేశ్వర రెడ్డి,బిజెపి సీనియర్ నాయకులు సద్దల క్రిష్ణ, అక్బర్ పాషా,శంకర్, బిజెవైఎం నాయకులు సాయి,పాండు,సతీష్,మోహన్ రెడ్డి, పవన్, శివ,తదితరులు ఉన్నారు..

## రుద్ర సముద్రంలో గ్రామసభ

**మక్తల్ జులై 28 ( స్కై న్యూస్)** నారం పేట్ జిల్లా మక్తల్ పరిధిలోని రుద్రసముద్రం గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ లింగప్ప గారి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించుకోవడం జరిగింది సర్పంచ్ లింగప్ప గారు మాట్లాడుతూ గ్రామసభ ముఖ్య ఉద్దేశం ఎల్నినో ప్రభావం వలన వర్షాలు కురవడం



లేదు దీనికి కారణం భూగర్భ జలాలు తగ్గిపోవడం అని చెప్పారు గ్రామంలో తాగునీరుని వృధా చేయకుండా సరైన రీతిలో వాడుకోవాలని సూచించారు అదేవిధంగా గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంత మరియు టాయిలెట్లు నిర్మించుకోవాలని సూచించారు గ్రామాభివృద్ధిలో మీ అందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామలింగప్ప పంచాయతీ కార్యదర్శి శరత్ రెడ్డి వార్డు మెంబర్లు అంగన్వాడి టీచర్లు వైద్య సిబ్బంది రేషన్ డీలర్ నితీష్ మరియు గ్రామ పెద్దలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామసభను విజయవంతం చేశారు.

## తిరుమలదేవునిపల్లి కి బి ఎస్ ఎస్ ఎల్ టవర్ మంజూరు



**నారాయణపేట జూలై 28: (స్కైన్యూస్)** నారాయణపేట మండలం తిరుమలదేవునిపల్లి గ్రామానికి బి ఎస్ ఎన్ ఎల్ టవర్ ను భారత్ సంచార నిఘం మంజూరు చేస్తూ ఉత్తర్వు విడుదల చేసిం ది.అలాగే త్వరలోనే టవర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీ లించి ఒప్పందం కుదుర్చు కోవడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ టవర్ మంజూరు కావ డంతో ఈ ప్రాంత ప్రజలకు సెల్ ఫోన్ సిగ్నల్ అందుబాటులోకి వచ్చి ఇబ్బందులు తొలగు తాయని ఈ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.ఎంపీ డి కే అరుణమ్మ చొరవతో బిజెపి రాష్ట్ర నాయకుడు పగుడాకుల శ్రీనివాసులు కృషితో బిఎస్ఎన్ఎల్ టవర్ మంజూరైనందున వాటికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజాస్వామ్యానికి ఓటు వజ్రాయుధం






**కే.రతంగ్ పాండురెడ్డి**

**నారాయణపేటజూలై28(స్కైన్యూస్):**ప్రజాస్వామ్యానికి ఓటు వజ్రాయుధం అని ప్రతి ఒక్కరు ఎస్ ఐ ఆర్ లో పాల్గోని ఓటును సురక్షితం చేసుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.రతంగ్ పాండురెడ్డి అన్నారు.ఎస్ ఐ ఆర్ మండల ప్రవాస యోజన లో బాగంగా బీజేపీ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు కె రతంగ్ పాండ్ రెడి నారాయణపేట మండలంలోని కొల్లంపల్లి గ్రామంలో సోమవారం రాత్రి అక్కడే బసచేసి ఎస్ ఐ ఆర్ నుపరిశీలించారు.మంగళవారం ఉదయం జాజాపూ ర్, బైరాంకొండ గ్రామాల్లో పర్యటించి బూత్ ల వారిగా ఎస్ ఐ ఆర్ ను అడిగి తెలుసుకున్నారు. పలు బూత్ లలో వందశా తం పూర్తి కావడంతో బి ఎల్ ఓ లను అభినందించి సన్మానించారు.మిగిలిన వారితో త్వరగా గడువు లోపు పూర్తి చేయించాలని అందుకు బిజెపి బి ఎల్ ఓ లు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు జ్యోతి సాయిబన్న , సీనియర్ నాయకులు వెంకట్ రాము లు,చంద్రశేఖర్,మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షు డు రామకృష్ణ గౌడ్,మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, నాయ కులు విఠల్ రావు ,గోవిం దు, శ్రీనివాసులు,రాము, బద్రి, తదితరులు పాల్గొన్నారు.ఖ

### మరణించిన హోంగార్డు కుటుంబానికి

## రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా బాండ్ అందజేత

**అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి అండగా జిల్లా పోలీస్ శాఖ**

**జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి బాండ్ అందజేత**

**జోగులాంబ గద్వాల, జూలై28(స్కై న్యూస్):** జోగులాంబ గద్వాల్ జిల్లాలో అనారోగ్య కారణాలతో గత ఏడాది ఏప్రిల్ 18న మృతి చెందిన హోంగార్డు ఎం. ప్రవీణ్ కుమార్ కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ఎక్స్గ్రేషియా మొత్తానికి సంబంధించిన బాండ్‌ను జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు అందజేశారు. ఈ మేరకు జూలై 22న మృతుడి భార్య వి. కవిత



ఖాతాలో రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా మొత్తం జమ కాగా, అందుకు సంబంధించిన బాండ్‌ను హోంగార్డు ఇన్‌చార్జ్ ఆర్ఐ. టి. వెంకటేష్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఎం. ప్రవీణ్ కుమార్ 29 డిసెంబర్ 2003న హోంగార్డుగా విధుల్లో చేరారు. అనంతరం 2021లో నారాయణపేట జిల్లా నుంచి రొటేషన్ పద్ధతిలో జోగులాంబ గద్వాల జిల్లాకు వచ్చి విధులు నిర్వహించారు. విధి నిర్వహణలో భాగంగా పోలీస్ శాఖకు సేవలందించిన ప్రవీణ్ కుమార్ అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆయన కుటుంబానికి ప్రభుత్వం అందించిన ఎక్స్గ్రేషియా ఆర్థిక సహాయం కొంత మేరకు అండగా నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ తరఫున మృతుడి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ, వారి సంక్షేమానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని అధికారులు తెలిపారు.

### విద్యాభివృద్ధికి పవర్ ఫౌండేషన్ సహకారం అభినందనీయం...

**ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ**

నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలంలో విద్యాభివృద్ధికి స్నేహ ఫౌండేషన్ అందిస్తున్న సహకారం అభినందనీయమని మల్లెపల్లి సర్పంచ్ కతలప్ప అన్నారు. మంగళవారం నారంపేట జిల్లా ఉట్కూరు మండలంలోని మల్లేపల్లి ప్రభుత్వ పాఠశాలలో నోటు



పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు సామాజిక సంస్థలు ముందుకు రావడం సంతోషమని పేర్కొన్నారు. విద్యార్థులు అందించిన నోటు పుస్తకాలను సద్వినియోగం చేసుకొని బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. విద్యాతోనే అభివృద్ధి సాధ్యమని విద్య అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లెపల్లి సర్పంచ్ కత లప్ప. ఉపసర్పంచ్ రాజు. ప్రధానోపాధ్యాయుడు బాలు. ఉపాధ్యాయ బృందం. సింహ ప్రొడక్షన్ సబ్బులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ కళ్యాణ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు తొలి ఏకాదశి సందర్బంగా ....

**దేవాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించిన బండ్ల జ్యోతి**

**జోగులాంబ గద్వాల జిల్లా జూలై 28 (స్కై న్యూస్) :**గద్వాల జిల్లా కేంద్రంలో నది అగ్రహారం సమీపంలోని గద్వాల తిరుపతి శ్రీ కళ్యాణ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు తొలి ఏకాదశి సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి ప్రత్యేక పూజలు స్వామి వారిని దర్శించుకొని తీర్ద ప్రసాదాలు స్వీకరించి స్వామి వారి ఆశీస్సులు పొందడం జరిగింది. అనంతరం ఆలయ చైర్మన్ మరిడి శ్రీకాంత్ దంపతులు ఎమ్మెల్యే సతీమణి కి తులసి మొక్కను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ డైరెక్టర్లు రాధమ్మ రెడ్డి, మధుమతి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



### షాద్‌నగర్‌లో రెండో రోజు

# రోడ్డు విస్తరణ పనులు

**చట్టం ముందు అందరూ సమానమేనని స్థానికుల విజ్ఞప్తి**

**రంగారెడ్డి జిల్లా, జూలై 28 (స్కై న్యూస్):** షాద్‌నగర్ పట్టణంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు మంగళవారం మహబూబ్‌నగర్ రోడ్డు వైపు కొనసాగాయి. రహదారిని ఆక్రమించి నిర్మించిన డబ్బాలు, గోడలు తదితర నిర్మాణాలను అధికారులు



తొలగించారు. ఇప్పటికే పరిగి రోడ్డు వైపు పలువురు వ్యాపారులు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించి సహకరించిన నేపథ్యంలో, మహబూబ్‌నగర్ రోడ్డు వైపున కూడా నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు సహా ఎవరిపైనా పక్షపాతం చూపకుండా చట్టప్రకారం ఒకే విధంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. పారదర్శకంగా, వివక్ష లేకుండా రోడ్డు విస్తరణ పనులు కొనసాగితేనే అధికారులపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. పట్టణ అభివృద్ధికి దోహదపడే ఈ పనులను న్యాయబద్ధంగా పూర్తి చేయాలని కోరారు.

### జల సిరి కార్యక్రమంపై అవగాహన కల్పించిన సర్పంచ్ శ్రీనివాస్

**నారాయణపేట జూలై 28 (స్కైన్యూస్:)** నారాయణపేట్ జిల్లా దామర్‌గిద్ద మండలం బాపన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో గ్రామ సర్పంచ్ గవి నోళ్ల శ్రీనివాస్ పాల్గొనీ గ్రామస్థులకు జలసిరిపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జల సిరి కార్యక్రమంలో భాగంగా వి బి జి




రాంజీ పథకం కింద గ్రామంలో ఇంకుడు గుంతలు, ఊటకుంటలు, బోర్ రీఛార్జ్ గుంతల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి ఇంకించి నీటి నిల్వలను పెంచడం, భూగర్భ జలమట్టాన్ని మెరుగుపరచడం ఈ కార్య క్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ప్రతి గ్రామస్థ డు ఈ కార్యక్రమాన్ని సద్వి నియోగం చేసుకుని నీటి సంరక్షణలోభాగస్వాములు కావాలని సర్పంచ్ గవి నోళ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంజప్ప, వార్డు సభ్యులు ఉదయ్ కుమార్, అంజప్ప, శివకుమార్, పంచాయతీ కార్యదర్శి బిందు రాణి, నాయకులు ఆచరప్ప, ప్రవీణ్‌తో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఒక్కరు ఓటును సురక్షితం చేసుకోవాలి

**పగుడాకుల శ్రీనివా సులు**

**నారాయణపేట జూలై27(స్కైన్యూస్)**ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా సంపర్క్ అభియాన్ లో బిజెపి రాష్ట్ర నాయకులు పగుడాకుల శ్రీనివాసులు 24 గంటల పాటు కోయిల్ కొండ మండలంలో పర్యటించారు.ఈ సందర్భంగా వింజమూరు గ్రామంలో ఓ నిరుపేద బిజెపి



కార్యకర్త ఇంట్లో ఆత్మీయంగా భోజనం చేసి, అదే ఇంట్లో బస చేశారు. అనంతరం కార్యక ర్తలతో సమావేశమై సర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రాము ఖ్యత, ప్రతి అర్హుడైన ఓట రు పేరును జాబితాలో నమోదు చేయించడం, తప్పులను సరిదిద్దడం, ప్రతి బూత్‌లో పార్టీ కార్య కర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన విధానం గురించి దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల నాయకులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు

బుధవారం 29 జూలై 2026

## ముడుమాల్ నిలువురాళ్ల పార్కు అభివృద్ధి పనులకు మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన



**ముక్తల్ జూలై 28( స్మై న్యూస్)** నారాయణపేట జిల్లా జిల్లా మక్తల్ నియోజకవర్గం లోని ముడుమల్ గ్రామంలో చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని స్పష్టం చేశారు రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని ముడుమాల్ గ్రామంలో ఉన్న చారిత్రక నిలువురాళ్ల పార్కు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ...చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు పర్యాటక కేంద్రాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నిలువురాళ్ల పార్కును మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు.ఈ అభివృద్ధి పనులు పూర్తయితే ముడుమాల్ నిలువురాళ్ల పార్కుకు మరింత గుర్తింపు లభించడంతో పాటు పర్యాటకుల సంఖ్య పెరిగి స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని మంత్రి పేర్కొన్నారు ఈ సందర్భంగా దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్ మాట్లాడుతూ...ముడుమల్ నిలువు రాళ్లకు యునెస్కో గుర్తింపు కోసం ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటు దక్కడం తెలంగాణకు గర్వకారణం అని,యూనెస్కో శాశ్వత గుర్తింపు కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నిలువురాళ్ల ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది వరకు ఇక్కడ ఉన్న కలెక్టర్లు నిలువు రాళ్ళ పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. యునెస్కో శాశ్వత గుర్తింపు కొరకు కొన్ని సూచనలు ఇచ్చారని వాటిని పాటించి గుర్తింపు పొందేలా కృషి చేయాలన్నారు. ఇదివరకే మంత్రి వాకిటి శ్రీహరి గారి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, ఇందుకు తగిన పనులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని 400 పాఠశాలల హెడ్మాస్టర్లకు శిక్షణ ఇచ్చి దాదాపు 60 వేల మంది విద్యార్థులు ముడుమాల్ నిలువు రాళ్ళను సందర్శించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే 20 మంది టూరిస్ట్ గైడ్లను ఏర్పాటు చేసి చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఇందుకు తగిన మ్యాప్ తయారు చేయాలన్నారు. ప్రజలు భాగస్వాములై ఇక్కడి విశిష్టతను ప్రపంచానికి తెలియజేసేలా అవగాహన కల్పించుకోవాలన్నారు. శాస్త్ర విజ్ఞానం రాకముందే 3 వేల సంవత్సరాల క్రితం నిలువురాళ్ల రూపంలో నక్షత్ర మండలాన్ని ఆనాడే రూపొందించారని తెలిపారు. మనకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో విశిష్టతను చాటేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

## గడువులోగా ఓటును సురక్షితం చేసుకోవాలి

**బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కంచె శ్రీనివాస్**



**నారాయణపేట జూలై 28: (స్మైన్యూస్)** ఎన్నికల సంఘం ఇచ్చిన గడువులోగా ప్రతి ఒక్కరు ఎస్ ఐ ఆర్ లో పాల్గొని మీ ఓటును సురక్షితం చేసుకోవాలని నారాయణపేట జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు కే.శ్రీనివాసులు కోరారు.ఎస్ ఐ ఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రతి ఒక్కరికి ఓటు తొలగి పోకుండా అందరీ చైతన్య పరచాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు పట్టణ ప్రవాస్ యోజనలో భాగంగా రెండు రోజుల కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సోషల్ వినోద్ గారి నాయకత్వంలో జిల్లా ఉపాధ్యక్షులు కంచె శ్రీనివాసులు,శక్తి కేంద్రాల ఇన్చార్జిలతో, బి ఎల్ ఏ 2తో సమావేశాలు నిర్వహించి సర్ ప్రక్రియలో అందరూ భాగస్వాములై ప్రభుత్వానికి బి ఎల్ ఓ లకు సహకరించాలని కోరారు. తరువాత కొన్ని బూత్ లను పర్యవేక్షించారు.. అక్కడున్న వారిని ఏరకంగా జరుగుతుందని విషయాలను తెలుసుకొని సమాచారం తీసుకోవడం జరిగింది . ఇందులో మీకు మా పార్టీ నాయకులు మిగతా రాజకీయ పార్టీ నాయకులు అందుబాటు లో ఉంటారని ఇది అందరి బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులైన మున్సిపల్ వైస్ చైర్మన్ మంజుల జి ఆర్ రెడ్డి మిర్చి వెంకటయ్య రఘువీర్ యాదవ్ శ్రీనివాస్ రెడ్డి రమేష్ నందు నామాజీ తదితరులు పాల్గొన్నారు.

## 50 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు మంత్రి వాకిటి శ్రీహరి భూమి పూజ

**మంత్రి వాకిటి శ్రీహరి మంగళవారం మధ్యాహ్నం ఆలయ అర్చకుడు రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు**



**మక్తల్ జూలై 28( స్మైన్యూస్)** నారాయణపేట జిల్లా మక్తల్ మండల పరిధిలోని వల్లభాపురం శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయం భక్తుల మౌలిక వసతుల కోసం 50 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు మంత్రి వాకిటి శ్రీహరి మంగళవారం మధ్యాహ్నం ఆలయ అర్చకుడు రాఘవేందర్ రావు ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. గురువులకే గురువు అది పురాతనమైన దత్తాత్రేయ స్వామిని దర్శించుకునేందుకు వివిధ రాష్ట్రాల నుండి వచ్చే భక్తుల మౌలిక వసతులు లా కోసం ఇబ్బందులు పడకుండా వారికి టాయిలెట్లు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయడానికి గాను ఆలయ అభివృద్ధి ద్వారా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం. ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఆలయ ప్రయాణంలో భక్తులకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. దత్తాత్రేయ ఆలయం ఆధ్యాత్మిక విశిష్టతను మరింత పెంపొందించేలా చేపట్టనున్న అభివృద్ధి పనులు భక్తులకు ఎంతగానో ఉపయోగపడతాయని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. భక్తులకు కల్పించే మౌలిక వసతులు పనులను నాణ్యతతో గడువులోపు చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ తాసిల్దార్ సతీష్ కుమార్. ఆర్ ఐ రాజు. పసుపుల గ్రామ సర్పంచ్ మహేశ్వరి. ఆలయ కమిటీ సభ్యులు అధికారులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలను సాగు చేపట్టాలి

**రాష్ట్ర ప్రభుత్వం మరియు జిల్లా యంత్రాంగం రైతులకు నష్టం జరగకుండా ముందస్తు అవగాహనకార్యక్రమాలు నిర్వహిస్తున్నాం**

**వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన పంటలనే సాగు చేయాలి**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**జోగులాంబ గద్వాల, జూలై28 (స్మై న్యూస్):**వాతావరణ శాఖ అంచనాలు,నీటి లభ్యత,వ్యవసాయ శాఖ సూచనలను అనుసరించి పంటల సాగు చేపడితే రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో నిర్వహిస్తున్న 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గద్వాల మండలంలోని చెనుగొనిపల్లి రైతు వేదికలో పాల్గొని,వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అందించిన శాస్త్రీయ వ్యవసాయ సూచనలను వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు సంప్రదాయ పద్ధతులకు మాత్రమే పరిమితం కాకుండా శాస్త్రీయ విధానాలను అనుసరించాలని సూచించారు.రైతులకు నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే జిల్లాలో అన్ని మండలాల్లో సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.రైతులు వ్యవసాయ శాఖ అధికారులు,శాస్త్రవేత్తల సూచనల మేరకు స్వల్పకాలిక, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.ఆరుతడి పంటలతో పాటు ఉద్యాన పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జడీవల కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసినప్పటికీ మొత్తం వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమన్నారు.వర్షాలు కురుస్తున్నాయని భావించి నీటిని పూర్తిగా సాగుకు వినియోగించకుండా ... అవసరమైన నీటిని నిల్వ చేస్తే, తరువాతి దశలో వర్షాలు తగ్గిన పరిస్థితిలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని తెలిపారు.వాతావరణ శాఖ సమాచారం ప్రకారం ఈ ఏడాది సాధారణం కంటే వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని,ఇప్పటికే జిల్లాలో వర్షపాతం గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు.గత అనుభవాల కంటే భిన్నమైన పరిస్థితులు నెలకొన్నందున రైతులు ఆలోచించి పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని దశలవారీగా వినియోగిస్తున్నామని,సాగునీటి విడుదలపై కూడా పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు.ఇరిగేషన్ శాఖతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ రైతులకు సాధ్యమైనంత మేర సహకారం అందిస్తామని తెలిపారు. వాతావరణ శాఖ అంచనాలు, నీటి లభ్యత,వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను అనుసరించి పంటల సాగు చేపడితే రైతులు తక్కువ పెట్టుబడితో మెరుగైన దిగుబడులు, అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు.అనంతరం ఆయిల్ పామ్‌తో పాటు పంటల వైవిధ్యీకరణ ద్వారా ఆదర్శంగా నిలిచి ఇతర రైతులకు స్ఫూర్తిగా నిలుస్తున్న ప్రగతిశీల రైతులను,రైతులకు నాణ్యమైన సేవలు అందిస్తూ వ్యవసాయాభివృద్ధికి విశేష కృషి చేసిన వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గద్వాల్ తహసీల్దార్ హరికృష్ణ,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రాజ్ కుమార్, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, చెనుగొనిపల్లి సర్పంచ్ పద్మ, ప్రజా ప్రతినిధులు, అధికారులు రైతులు పాల్గొన్నారు.

# మహిళలు వృత్తి విద్యా కోర్స్ లను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలి

**జిఎం(పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్**





**సింగరేణి జూలై 28( స్మై న్యూస్):** కార్పొరేట్ ఏరియాలోని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 3 నెలల పాటు బాబుక్యాంప్ పోస్ట్ ఆఫీస్ మహిళలకు ఉచిత టైలరింగ్, ఎంసి క్వార్టర్స్ సుజాత నగర్ మహిళలకు ఉచిత మగ్గం వర్క్స్, ఎన్‌కే నగర్ మహిళలకు ఉచిత బ్యూటీషియన్ శిక్షణ తరగతులను 28. జూలై 2026, మంగళవారం నాడు జిఎం(పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిఎం(పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ సింగరేణి సేవా సమితి ముఖ్య ఉద్దేశం ఉద్యోగుల కుటుంబ మహిళలు, ప్రాజెక్టు ప్రభావిత పరిసర ప్రాంత మహిళలు ఆర్థికముగా ఎదిగి ఉపాధి పొందాలని, కావున సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సులను నిర్వహిస్తున్నామని దీనిని సక్రమంగా ఉపయోగించుకొని, క్రమం తప్పకుండా హాజరై, కోర్సు పూర్తి చేసి మంచి శిక్షణ పొంది వృద్ధిలోకి రావాలని కోరారు. ఇందులో భాగంగా బాబుక్యాంప్, పోస్ట్ ఆఫీస్ మహిళలకు ఉచిత టైలరింగ్, ఎంసి క్వార్టర్స్, సుజాత నగర్ మహిళలకు ఉచిత మగ్గం వర్క్స్, ఎన్‌కే నగర్ మహిళలకు ఉచిత బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ప్రారంభించుకుంటున్నామని, 3 నెలల పాటు నిర్వహించే ఈ ఉచిత వృత్తి శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ముఖ్యంగా ఈ యొక్క వృత్తి విద్యా కోర్సులు శ్రద్ధగా నేర్చుకోవాలని కోరారు.ఈ వృత్తి శిక్షణ అనంతరం నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయ-హైదరాబాద్ వారిచే సర్టిఫికెట్లు కూడా అందచేయబడునని, ఈ వృత్తి శిక్షణ కోర్సులు నేర్చుకున్న మహిళలు తాము నేర్చుకున్న వృత్తి శిక్షణ ద్వారా యూనిట్లను నెలకొల్పుకొని తమతో పాటు మరికొందరికి జీవనోపాధి కల్పించాలని, అదే విధముగా తాము తయారు చేసిన వాటిని హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ నందు స్టాల్స్ ఏర్పాటుచేసుకొని విక్రయించేందుకు కూడా సింగరేణి సంస్థ సహాయం చేస్తుంది అని తెలిపారు. అనంతరం 2024–25 సంవత్సరం లో వృత్తి శిక్షణ కోర్సులు నేర్చుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిఎం(పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ తో పాటు డిజిఎం(పర్సనల్) లు కే.సా నారాయణ రావు, బి.శివ కేశవ రావు, డివై.పిఎం కె.శివ కుమార్, వెల్ఫేర్ పిఏ కే.వరప్రసాద రావు, సేవా కో ఆర్డినేటర్ జకాజ్ షరీఫ్, సేవాసెక్రెటరీ మాధవి స్వర్ణ లత, సేవా కో-ఆర్డినేటర్లు మునీలా, పుష్ప, రమాదేవి, అరుణ, పద్మావతి, దీప శిక్షకులు ఇతర సేవా సభ్యులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

# పాలు పాలు పదార్థాల వినియోదారులకు శుభవార్త

**దక్షిణ భారతదేశంలో అగ్రగామిగా డైరీలలో ఒకటైన సంఘం డైరీ**

**గత 48 సంవత్సరాల నుండి నాణ్యత స్వచ్ఛతలో రాజీ పడకుండా వినియోదారులకు నాణ్యమైన పాలు పాల పదార్థాలు అందిస్తున్న ఏకైక డైరీ సంఘం డైరీ**



**ఆత్మకూరు జూలై 28 (స్మై న్యూస్)** "సంగం డైరీ"ప్రపంచం మేల్కొక ముందే పాల ప్రపంచం పరుగులు పెడుతుంది తొలి పొద్దు పొడవకముందే ప్రతి గడప పాలతో పులకిస్తుంది ప్రతి ఉదయం శ్రేష్టమైన పాలను ముడిపాలుగా అందిస్తూ ప్రతి హృదయాన్ని ప్రేమగా పలకరిస్తూ సంఘం డైరీ గుంటూరు దగ్గరలో ఉన్న వడ్లమూడి లో ఈ సంస్థ నిర్మాణం జరిగింది 1977 ఆగస్టు 30 అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రారంభించిన సంఘం డైరీ సహకార చట్టం ద్వారా రిజిస్టర్ అయిన తొలి డైరీ గా దినదిన ప్రవర్ధమానంగా ఎదుగుతూ వచ్చింది రైతులందరికీ సమన్వయం చేసి జిల్లావ్యాప్తంగా సంఘాలు ఏర్పాటుచేసి పాలు సేకరించే సంఘం డైరీకి పట్టుదల పారదర్శకత నమ్మకం సానుకూల దృక్పథం ముందుచూపే పంచప్రాణాలు గ్రామాల నుంచి జిల్లా స్థాయి సహకార సమితుల ద్వారా సంఘం డైరీలో పాల సేకరణ మొదలు పాల ఉత్పత్తులు తయారీ వరకు అంతా శాస్త్రీయ పద్ధతిలో జరుగుతుంది పాల కేంద్రాల్లో రైతులు పోసేపాలను అన్ని రకాలుగా పరిశీలిస్తారు దూర ప్రాంతాల వారి కోసం చిల్లింగ్ సెంటర్ లనుపాలు రైతులకు అందుబాటులో ఉంచింది సంఘం డైరీ చిల్లింగ్ సెంటర్ లను గ్రామ సమితులు నుండి వచ్చిన పాలను సంఘం డైరీలో అనుభవ జ్ఞానులైన ఉద్యోగస్తుల తోవివిధ రకాలల్యాబ్ పంపించి పరిశీలిస్తారు మిల్క్ ను ల్యాబ్ కు పంపించి వెన్న శాతాన్ని లెక్కిస్తారు ఆ తర్వాత పాలను ప్రాసెసింగ్ జరుగుతుంది కావాల్సిన టెంపరేచర్ హీట్ ను చేసి వెంటనే సీతలీకరణం చేసి భారీ సైజులో ఉండే సైనస్ లోకి పాలను నింపుతారు ఇక్కడ నుండి పాల ప్యాకెట్లు మరియు వివిధ ఉత్పత్తులు కు కావలసిన పాలను సరపరవుతాయి డైరీలో సిద్ధం చేసిన పాలను ఎప్పటికప్పుడు వాహనాల ద్వారా తరపరచేస్తుంది పాల ఉత్పత్తులను ఏ పూటకా పూట ప్రజలకు అందుబాటులో తెస్తుంది సంఘం డైరీ ఇంతటి మహోన్నతుని స్థానం సంపాదించి అంటే అందుకు కారణం సంస్థల నిర్దేశించుకున్న లక్ష్యాలుపాటించే ప్రమాణాలే ఈరోజు సంఘం డైరీ నిలవడానికి కారణం అలాగే 1977 వరకు సంఘం డైరీ చైర్మన్ గా శ్రీ ఎడ్లపాటి వెంకట్రావు నియమితులై బాధ్యతలు నిర్వహించారు 1979లో "రైతుబిడ్డ అన్నదాత ఆత్మబంధువు "ప్రజల మనిషి శ్రీ ధూళిపాళ్ల వీరయ్య చౌదరిగా ఎన్నికై సంఘం డైరీ బాధ్యతలు చేపట్టారు ఆయన రాకతో నే సంఘం డైరీ కి మహర్దశ ప్రారంభమైంది అనుక్షణం రైతుల సంతోషాన్ని కోరుకున్న వ్యక్తి ఆయన వచ్చిన లాభాలను వారి సంక్షేమానికి కేటాయించారు పాల సేకరణ ధరను సంవత్సరానికి మూడుసార్లు పెంచి రైతులకు గిట్టుబాటు ధరను కల్పించారు మూతపడిన పాల సొసైటీలను తెరిపించారు కొత్త సొసైటీలను ప్రోత్సహించారు తెలుగు ప్రజల ప్రాంత పథకం కింద సొసైటీలకు శాశ్వత భవనాలను ఏర్పరచడంతో అవి ప్రగతికి మూల స్తంభాలుగా మారాయి సంఘం డైరీని అభివృద్ధి పరచడంతో ఊరుకోలేదు వీరయ్య చౌదరి తనకున్న రాజకీయ అనుభవాన్ని జోడించి సంస్థకు విశేష ప్రాచుర్యం కల్పించారు 1994 జనవరి 24న గుంటూరు జిల్లా నారా కోడూర్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అనువులు బాశారు ఒక సమర్థుడైన నాయకుడిదే వీరయ్య చౌదరి అన్యంతగా సంఘం పేరుతో ఆయన అనుబంధం వేస్తుంది ఒక ప్రయోగంలో మొదలై ప్రవాహంలో మారి ప్రభంజనంలా సాగుతున్న సంఘం డైరీ వీరయ్య చౌదరి మరణంతో పెద్దదిక్కును కోల్పోయింది జోహార్ శివరూపుల సరస్వులు వీరయ్య చౌదరి గారు అలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రతి ఒక్కరి మధ్యలో మిగిలిన ఏకైక వ్యక్తి వీరయ్య చౌదరి పెట్టుదల కలిగి సమస్య ముందుకు నడిపించే సామర్థ్యం ఉన్న ఆయన వారసుడు దూలపాలి నరేందర్ తండ్రి వీరయ్య చౌదరి అడుగుజాడల్లో నడుస్తూ సంఘం డైరీ ఆయన ఆశయాలతో అనుగుణంగా తీర్చిదిద్దారు జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ ఎం డి బి సహకారంతో ప్రతి గ్రామంలో పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టారు కొత్త వ్యాపారం విస్తరణ అవకాశాలను వదులుకోకుండా సంఘం డైరీ సమర్థంగా ముందుకు నడిపిస్తూ పాల ఉత్పత్తి రంగంలో ఒక బ్రాండ్ గా నిలిచింది నాణ్యత విషయంలో రాజీపడని సంస్థగా మార్కెట్లో అగ్రస్థానాన్ని క్రమంగా చేసుకుంది సంఘం డైరీ ప్రజాశక్తి బద్ధంగా ఎదిగిన సంస్థగా సహకార సంఘాలకే దిస్ కూచి గా సంఘం డైరీ ప్రస్థానం నా బోతే నా భవిష్యత్ దేశం మొత్తం మీద 186 జిల్లాల్లో విస్తరించిన సహకార డైరీ లో దక్షిణ భారత దేశంలో మొదటి స్థానం సంగం డైరీ భారతదేశంలో రెండో స్థానంలో నిలిచింది సహకార సంస్థలో కలికి రాయిగా మారిన సంఘం డైరీ ఘనత ఇక్కడితో ఆయిపోలేదు సంఘం డైరీ పాల ఉత్పత్తిదారులు శ్రేయస్ కోసం ఏర్పాటుచేసిన వ్యవస్థ ఇది గ్రామీణ ప్రాంతాల్లో రైతన్న చైతన్యవంతం సంఘటిత పరిచి ఆరోజు ప్రతి గ్రామంలో కూడా పాల కేంద్రాలు ఏర్పాటు చేయటం గ్రామీణ ప్రాంత ప్రజల యొక్క జీవనస్థితిగతులను ఇంత మార్పును తీసుకు రావడం జరిగింది వారి యొక్క జీవన సౌలభ్యానికి సంఘం డైరీ ఒక అలంభాగనగా ఆనాటి నుండి ఈనాటి వరకు కూడా కొనసాగుతూ ఉండటమే వాస్తవమని చెప్పి తెలియజేశారు సహకార రంగంలో ఉన్న డైరీలకే ఆదర్శంగా ఇతర డైరీలతో పోటీపడుతూ అత్యున్నతమైన స్థాయికి దేశంలోనే సంఘం డైరీ చేపట్టడంతో మాకు ఉన్న ఆధునికమైన పరికరాలను ఏర్పాటు చేసుకోవడం యంత్ర సామాగ్రిని ఏర్పాటు చేసుకోవడం ప్రాసెసింగ్ సామర్థ్యాని పెంచుకోవడం ఆటోమేషన్ చేసుకోవడం మూలన ఇవాళ మార్కెట్లో వినియోగదారుల నుంచి అభిరుచులకు అనుగుణంగా వివిధ రకాలైన ఉత్పత్తులను మార్కెట్లోకి రావడమే కాదు అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలతో ఉత్పత్తులని మేము మార్కెట్లోకి ఇవ్వడం జరుగుతుంది ఇవాళ దాదాపు 1100 కోట్లు పైబడి టర్నోవర్ కూడా సాధించడం జరిగింది సంగం డైరీ ఈ కార్యక్రమంలో "జీపీ మేనేజర్ సుధీర్ మరియు సీనియర్ ఎగ్జిక్యూటివ్ శ్రీరామ్ మరియు వెంకట్ "తదితర వ్యక్తులు పాల్గొన్నారు కష్టమర్లకు ఇచ్చిన ఆఫర్లను విజయవంతం చేశారు

# నకిలీ విక్రయదారులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి...

## పర్యవేక్షణ లోపంతో ఇష్టారాజ్యంగా ప్రైవేటు పాఠశాలలు

**నాగర్ కర్నూల్/ బిజినేపల్లి జులై 28 (స్వైన్యూస్)** రైతులను మోసం చేసేందుకు నకిలీ డిఏపిని విక్రయించిన వ్యక్తులపై 2018 లో రూపొందించిన చట్టం ప్రకారం పిడి ఆక్ట్ నమోదు చేసి కఠినంగా శిక్షించాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పృథ్వీరాజ్ బిజినేపల్లి మండల అధ్యక్షులు పానుగంటి రామచందర్ డిమాండ్ చేశారు మంగళవారం మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ 2018 లో నూతనంగా చట్టాన్ని రూపొందించడం జరిగిందని దాని ప్రకారం పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారులైన సంతోష్ రెడ్డి జగదీష్ లను కస్టడీలోకి తీసుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దోషులను శిక్షిస్తేనే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని విక్రయదారులకు సొంత దుకాణాలు ఉన్నట్లయితే వాటిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల అనేక ప్రైవేటు పాఠశాలల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన





వ్యక్తం చేశారు గత కొన్ని రోజులుగా మండల కేంద్రంలోని ఆల్ సెయింట్ స్కూలు పై వస్తున్న వార్తలను దృష్టిలో ఉంచుకొని పాఠశాలకు వెళ్లి విచారణ చేయడం జరిగిందని అక్కడ క్వాలిఫైడ్ ఆధ్యాపకులచే బోధన చేయించడం లేదని ఆరోపించారు పాఠశాల ఆవరణలో విద్యుత్ తీగలు ఉన్నప్పటికీ వాటిని తొలగించలేదని విద్యార్థుల జీవితాలతో పాఠశాల యాజమాన్యం చెలగాటమాడుతుందని మండిపడ్డారు. వెంటనే మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాములు అసెంబ్లీ అధ్యక్షులు పరుశ రాము ప్రధాన కార్యదర్శి భాస్కర్ నాయకులు శ్రీహర్ష ముదిరాజ్ ఆంజనేయులు రాములు బిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మద్దెల బండ సాయిబాబా బిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంగరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారుఝ

# తాగునీటి శుద్ధికరణలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి...

### మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి



**నాగర్ కర్నూల్ జులై 28( స్వై న్యూస్):**ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వాటర్ ప్లాంట్ల యజమానులు తాగునీటి శుద్ధీకరణ ప్రక్రియలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పరిధిలో ఉన్న వాటర్ ప్లాంట్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వాటర్ ప్లాంట్ల యజమానులు తాగునీటి శుద్ధీకరణ ప్రక్రియలో అన్ని నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నీటి ఫిల్టరేషన్ యంత్రాలు సక్రమంగా పనిచేసేలా నిరంతరం నిర్వహణ చేపట్టడంతో పాటు, ఫిల్టర్లు నిర్ణీత వ్యవధిలో మార్చడం, నీటి నాణ్యత పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించడం మరియు పరిశుభ్రత ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేయాలని అన్నారు. ప్రజలకు నాణ్యత లేని లేదా కలుషితమైన తాగునీటి సరఫరా చేయడం ఏ పరిస్థితుల్లోనూ సహించబడదని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి నాణ్యత లేని నీటిని సరఫరా చేసినట్లు గుర్తించినట్లయితే, సంబంధిత వాటర్ ప్లాంట్ యజమానులపై చట్టప్రకారం తగిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.నెల రోజుల లోపల మరోసారి నీటి నాణ్యత పరీక్షలు జరిపి ప్రమాణాలు పాటించని చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

# ఇబ్బందులు తొలగించేందుకు సమస్యను పరిష్కరిస్తా...

### మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్

**నాగర్ కర్నూల్ జులై 28( స్వై న్యూస్)** మునిసిపాలిటీలో ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు ఆయా కాలనీలలో ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ అన్నారు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని 14 వ వార్డులో కౌన్సిలర్ నజీమా ఖాజా ఖాన్ తో కలిసి పర్యటించారు ఈ సందర్భంగా కాలనీలో నెలకొని ఉన్న అనేక సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు దీంతో ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ మరియు సిసి రోడ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభిస్తామని అన్నారు. నాణ్యతతో త్వరితగతి పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు



సూచించారు ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్ తో పాటు మున్సిపల్ అధికారులు ప్రజలు



పాల్గొన్నారు

# కోల్పూర్ - కూర్తికొండ బ్రిడ్జి కం బ్యారేజీపై కీలక చర్చ

**మక్తల్ జులై 28 ( స్వై న్యూస్)** నారాయణపేట జిల్లా మక్తల మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి మంగళవారం కర్ణాటకలోని రైచూర్ లో ఆ రాష్ట్ర మాజీ మంత్రి బోసురాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ కర్ణాటక సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి కీలకమైన కోల్పూర్ కుర్తికొండ బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణం పై ఇరువురు నేతలు చర్చించారు. కృష్ణానదిపై



ప్రతిపాదిత బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణం పూర్తయితే రెండు రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగు పడటంతో పాటు సాగునీటిని అవసరాలకు కూడా ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టులను పరస్పర సహకారంతో వీలైనంత త్వరగా ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఆనంద్ గౌడ్. రాజప్ప గౌడ్. విజయ్ గౌడ్. కృష్ణమూర్తి. తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు నిర్ధారణతో క్యాన్సర్ ను జయించవచ్చు...

### హైపర్ సైట్ తో దుష్ప్రభావాలను తగ్గించవచ్చు

### యశోద హాస్పిటల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ప్రవంతి



**నాగర్ కర్నూల్ జులై 28 (స్వై న్యూస్)** ముందస్తు నిర్ధారణతో క్యాన్సర్ ను జయించవచ్చని హైపర్ సైట్ తో 40 శాతం వరకు దుష్ప్రభావాలను తగ్గించవచ్చని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ప్రవంతి తెలిపారు మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్సలో హైపర్ సైట్ అత్యాధునిక విప్లవం అని వివరించారు. అడాప్టివ్ రేడియేషన్ థెరపీ ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ తగ్గించవచ్చని తెలిపారు క్యాన్సర్ కంట్రోల్ ఖచ్చితమైన చికిత్స అవసరమని వివరించారు. 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలని జీవనశైలి మార్పులతో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని తెలిపారు ధూమపానం వల్ల పురుషులలో ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రభలే అవకాశం ఎక్కువగా ఉందని వివరించారు మహిళలలో రొమ్ము క్యాన్సర్ కేసులు అధికంగా ఉన్నాయని 10 శాతం కేసులు జన్యుపరమైనవేనని స్థూల కాయం జీవనశైలి క్యాన్సర్ కు ప్రధాన కారణమని తెలిపారు

# ప్రతి అర్హుడి ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యం



### ఎస్ఐఆర్పై ఎంఆర్ఓతో జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్

సారంగాపూర్ మండల ఎమ్మార్వో మహమ్మద్ వహీముద్దీన్ గారిని బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మార్వో ఆఫీస్ లో మండలంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ గురించి తెలుసుకున్న జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత

**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...**

జగిత్యాల జిల్లా (జులై28) సారంగాపూర్ మండలంలో మొత్తం 98 శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిందని అన్నారు మిగతా 2% ఓటర్లు అడ్రస్ సరిగా లేనివారు మైగ్రేట్ లేబర్లు ఉన్నారని వారిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామని వీ-రా జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత తో అన్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ కొత్త ఓటర్ నమోదు పేరు మార్పులు చిరునామా మార్పులు తొలగింపులు తదితర అంశాలపై అధికారులు ఎమ్మార్వో వివరించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి అంటే ప్రతి ఓటు విలువైనదని ప్రతి అర్హుడు ఓటరు జాబితాలో తన పేరును నిర్ధారించుకోవడం ప్రతి పౌరుని యొక్క బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తేలు రాజు మాజీ పాక్స్ చైర్మన్ సాగి సత్యం రావు నాయకులు పాల్గొన్నారు

# రేగులగూడెం గ్రామంలో డి ఎం హెచ్ ఓ ఆకస్మిక తనిఖీ

### నిర్వహించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. తుకారామ్ రాథోడ్

### వ్యాధుల నివారణకు ప్రజల భాగస్వామ్యమే కీలకమని సూచన







**కొత్తగూడెం జులై 28( స్వై న్యూస్):** జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. తుకారామ్ రాథోడ్ పాల్వంచ మండలం, ఉల్వనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రేగులగూడెం గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించి గ్రామంలో అందుతున్న ఆరోగ్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి ఆరోగ్య సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. గ్రామస్తులు ఆరోగ్య శాఖ సిబ్బంది అందిస్తున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, రేగులగూడెం గ్రామంలో నూతన ఆరోగ్య ఉపకేంద్రం మంజూరు చేసి, శాశ్వత ఆరోగ్య సిబ్బందిని నియమించాలని, తద్వారా గ్రామంతో పాటు సమీపంలోని ఎనిమిది గ్రామాలకు నిరంతర ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం డా. తుకారామ్ రాథోడ్ గ్రామ ప్రజలకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు (డెంగ్యూ, మలేరియా తదితర వెక్టర్ బోర్న్ వ్యాధులు) మరియు సంక్రమణ వ్యాధుల నివారణపై విస్తృత అవగాహన కల్పించారు. ప్రతి వారం డ్రై డే కార్యక్రమాలు నిర్వహించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నిల్వ నీరు తొలగించడం, దోమల పెరుగుదలను అరికట్టడం, గ్రామ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం వంటి చర్యలను గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు, ఆరోగ్య సిబ్బంది సమిష్టిగా చేపట్టాలని సూచించారు.అనంతరం డీఎంహెచ్ఓ తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా హెపటైటిస్ వ్యాధి గురించి సవివరంగా వివరిస్తూ, వ్యాధి వ్యాప్తి మార్గాలు, లక్షణాలు, నివారణ చర్యలు, వ్యక్తిగత పరిశుభ్రత, సురక్షితమైన ఆహారం తాగునీటి వినియోగం, టీకాల ప్రాముఖ్యత, అలాగే అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.ప్రోగ్రాం ఆఫీసర్ డా. బి. ప్రతాప్ విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత, సరైన చేతుల శుభ్రపరిచే విధానం, రుతుక్రమ పరిశుభ్రత యుక్తవయస్సు ఆరోగ్యకర జీవనశైలి గురించి సమగ్ర అవగాహన కల్పించారు. పరిశుభ్రమైన అలవాట్లు పాటిస్తూ తమ కుటుంబ సభ్యులు సమాజంలో కూడా ఆరోగ్య అవగాహన కల్పించాలని విద్యార్థినులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. తుకారామ్ రాథోడ్, ప్రోగ్రాం ఆఫీసర్ డా. బి. ప్రతాప్, వైద్యాధికారి డా. దేవేందర్ రాజ్‌పుత్, ఉల్వనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య సిబ్బంది, తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, గ్రామ సర్పంచ్, గ్రామ ప్రజాప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# బకాయిలకై ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దగ్ధం

**బిజినేపల్లి జూలై 28 (స్వై న్యూస్)** విద్యార్థులకు చెల్లించవలసిన విద్యారంగ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పాలెం అంబేద్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు ఈ సందర్భంగా పోలీసులకు విద్యార్థి సంఘ నాయకుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు సందర్భంగా జిల్లా కన్వీనర్ శాంతన్ మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది పేద విద్యార్థులు ప్రభుత్వం చెల్లించవలసిన బకాయిలను చెల్లించకపోవడం వల్ల విద్యకు దూరమవుతున్నారని పెండింగ్ బిల్లుల కోసం నెలల తరబడి ఎదురు చూస్తున్న ప్రభుత్వం చెల్లించకపోవడం దారుణమని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఏ ఈ డిగ్రీ యూనివర్సిటీ గురుకుల



విద్యార్థుల ఆర్థిక సమస్యలను ఎందుకు పట్టించుకోవడంలేదని నిలదీశారు ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉద్యోగాలను భర్తీ చేయాలని జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఈ



కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు మండల కన్వీనర్ జీవన్ పట్టణ కార్యదర్శి విష్ణు నాగర్ కర్నూల్ నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్ నగర సంయుక్త కార్యదర్శి శివ నాయకులు భరత్ సందీప్ మార్కండేయ మురళి రహమాన్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

# రైతు నేస్తం కార్యక్రమాన్ని వీక్షించిన జిల్లా కలెక్టర్....




నారాయణపేట జూలై 28: (స్కైన్యూస్)రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని 'రైతు నేస్తం' కార్యక్రమం చేర వేస్తోందని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. మంగళ వారం నారాయణ పేట మండలంలోని జాజాపూర్ రైతు వేదికలో రైతు నేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసా య శాఖ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ వీక్షించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూశాస్త్రీయ వ్యవసాయమే ప్రభుత్వ లక్ష్యం అని, రైతులకు వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరవేయడం, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై అవగాహన కల్పించడం, వ్యవసాయంలో శాస్త్రీయ విధానాలను ప్రోత్సహించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'రైతు నేస్తం' కార్యక్రమం విజయవంతంగా 100వ ఎపిసోడ్‌ను పూర్తి చేసుకుందన్నారు. రైతులకు సరైన సమయంలో సరైన సాంకేతిక సలహాలు అందించడం ద్వారా వ్యవసాయ రంగంలో గణనీయమైన మార్పులు తీసుకురావచ్చని ఆమె తెలిపారు. రైతులు సంప్రదాయ సాగు విధానాలతో పాటు శాస్త్రీయ పద్ధతులను అవలంబిస్తే ఉత్పాదకత పెరగడంతో పాటు సాగు వ్యయాన్ని కూడా తగ్గించుకోవచ్చన్నారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు పలు వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రతి మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమం ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు, వ్యవసాయ అధికారులు నేరుగా రైతులతో మాట్లాడి పంటల సాగు, తెగుళ్ల నివారణ, వాతావరణ మార్పులు, నీటి యాజమాన్యం, వ్యవసాయ యాంత్రీకరణ, ఉద్యాన పంటలు, పశుసంవర్ధక రంగం, మత్స్యశాఖ, ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ సాగు, విలువ ఆధారిత వ్యవసాయం వంటి అనేక అంశాలపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నారని ఆమె చెప్పారు. అనంతరం జిల్లాలో ముగ్గురు ఆదర్శ రైతులు, ఇద్దరు వ్యవసాయ విస్తీర్ణ అధికారులను మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ తో కలిసి కలెక్టర్ సన్మానించారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళా ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కాంత్ కుమార్ వ్యవసాయ శాఖ ఏవో, తదితరులు పాల్గొన్నారు.

# E20 పెట్రోల్‌పై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దు

**దేశ ఆర్థిక స్వావలంబన, రైతుల ఆదాయ పెంపే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం**

**మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. బూర నర్సయ్య గౌడ్**



**హైద్రాబాద్జులై 28 :** ఈ20 పెట్రోల్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ౹ావీ విశ్వకర్మ యోజన తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డా. బూర నర్సయ్య గౌడ్ కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ ఆర్థిక ప్రయోజనాలు, రైతుల సంక్షేమం, విదేశీ చమురు దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడమే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ20 ఎథనాల్ బ్లెండింగ్ విధానం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.భారతదేశం ప్రతి సంవత్సరం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతుల కోసం సుమారు ?10 లక్షల కోట్ల నుంచి ?15 లక్షల కోట్ల వరకు విదేశీ మారకద్రవ్యాన్ని ఖర్చు చేస్తోందని పేర్కొన్నారు. దేశంలో ఏటా సుమారు 5,600 కోట్ల లీటర్ల పెట్రోల్ వినియోగం జరుగుతోందని తెలిపారు.ఈ20 విధానం ద్వారా పెట్రోల్‌లో 20 శాతం ఎథనాల్ వినియోగించడం వల్ల సుమారు 1,100 కోట్ల లీటర్ల ఎథనాల్ అవసరం ఏర్పడుతుందని, దీని ద్వారా ప్రతి సంవత్సరం దాదాపు ?50 వేల కోట్ల మేర విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందని వివరించారు.అదే సమయంలో ఎథనాల్ ఉత్పత్తికి అవసరమైన చెరకు, మొక్కజొన్న తదితర వ్యవసాయ పంటలకు భారీ డిమాండ్ ఏర్పడి రైతులకు సుమారు ?50 వేల కోట్ల అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందని తెలిపారు. మొత్తంగా దేశానికి ఏడాదికి సుమారు ?1 లక్ష కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.ఈ20 పెట్రోల్ వల్ల వాహనాల ఇంజిన్లు దెబ్బతింటాయనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని డా. బూర నర్సయ్య గౌడ్ స్పష్టం చేశారు. 2023 ఏప్రిల్ తర్వాత తయారైన ఈ20-కంప్లైంట్ కార్లు, ద్విచక్ర వాహనాలు ఈ20 పెట్రోల్ వినియోగానికి అనుకూలంగా రూపొందించబడ్డాయని తెలిపారు.2023కు ముందు తయారైన కొన్ని వాహనాల్లో మైలేజ్‌లో 3 నుంచి 5 శాతం వరకు స్వల్ప తగ్గుదల ఉండే అవకాశం ఉందని, అయితే అది కూడా వాహనం, ఇంజిన్ నమూనాను బట్టి మారుతుందని చెప్పారు. ఈ కారణంగా దేశవ్యాప్తంగా ఏడాదికి సుమారు ?2,000 కోట్ల నుంచి ?3,000 కోట్ల వరకు మాత్రమే అదనపు ఇంధన వ్యయం ఉండొచ్చని, కానీ దేశానికి మాత్రం సుమారు ?1 లక్ష కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని వివరించారు.దేశ ఆర్థిక స్వావలంబన, రైతుల సంక్షేమం, ఇంధన భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ విధానాన్ని ప్రజలు( +వఅ-ూ -శీ ్ర) సరైన కోణంలో అర్థం చేసుకోవాలని డా. బూర నర్సయ్య గౌడ్ కోరారు.అలాగే, ఈ20 విధానంపై కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా శ్రీ రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని ఆయన ఆరోపించారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన కీలక విధానాలపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయడం సమంజసం కాదని అన్నారు. భారతదేశ భవిష్యత్తు, రైతుల సంక్షేమం, విదేశీ చమురు దిగుమతుల తగ్గింపు వంటి జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు వాస్తవాలను తెలుసుకుని నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నేటి మెగా రక్తదాన శిబిరానికి ఏర్పాట్లు పూర్తి

డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి



**నారాయణపేటజూలై28(స్కైన్యూస్)** :నారాయణపేట జిల్లా కేంద్రంలో వ్యాస పౌర్ణమిని పురస్కరించుకుని స్నేహ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఈ నెల 29 న నిర్వహించే మెగా రక్తదాన శిబిరానికి ఏర్పాట్లు పూర్తి చేశామని ని స్నేహా మిత్రమండలి అద్యక్షుడు డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఏర్పాట్లను మిత్రమండలి సభ్యులుపర్యవేక్షించారు.రక్తదాన శిబిరాన్ని జిల్లా కలె క్టర్ ప్రియాంక,ఎస్పీ వినీత్ ప్రారంభిస్తారని తెలిపా రు.ప్రతి ఏటా స్నేహ మిత్ర మండలి ఆధ్వ ర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తూ రక్తదానం చేస్తున్నా మని ఈ సారి సైతం రక్త దాన శిబిరం నిర్వ హిస్తున్న ట్లు తెలిపారు. రక్తదాన శిబిరం సాయి విజయ కాల ని లోని సాయి హనుమాన్ మందిరం వద్ద ఉదయం 9 గంటల నుంచి ప్రారంభిస్తు న్నట్లు తెలిపారు.రక్తదాన శిబిరం లో యువకులు అధిక సంఖ్య లో పాల్గొని రక్తదానం చేసి ప్రాణదా తలు కావాలని కోరారు.

## దిగుడుమెట్ల పక్కన మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పరిశీలన ఈవో, చైర్మన్



**చిన్న చింతకుంట జులై 28 (స్కై న్యూస్);** శ్రీ కురుమూర్తి స్వామి వారి దేవస్థానంలో కొత్తగా నిర్మించిన దిగుడుమెట్ల పక్కన మరుగుదొడ్లు నిర్మించడానికి భూమి చూడడం జరిగింది. దీంట్లో పాల్గొన్నవారు కార్యనిర్వాహణ అధికారి మదినెశ్వర్ రెడ్డి, మాట్లాడుతూ చైర్మన్ బత్తుల బాలరాజు గ్రామ పంచాయతీసెక్రెటరీ విష్ణు అమ్మపురం గ్రామ సర్పంచ్ రంజిత్, ఉప సర్పంచ్ బుచ్చన్న తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితునికి వెస్సోస్ సాయం...



**హైద్రాబాద్ జులై 28:**విజయవాడ రూరల్ నివాసి తాడేపల్లికి చెందిన వృత్తి రీత్యా వడ్రంగి గా పని చేస్తూన్న అద్దంకివెంకటాచారి(64) విధి నిర్వహణ లో భాగంగా కంపెనీ పని పై బైక్ పై వెళ్తుండగా రాజ్ కుమార్ ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు.దురదృష్టవశాత్తు, మొదటి నెల జీతం కూడా అందుకోక ముందే..తలకు తీవ్ర గాయాలై, 2026 మే 4 నుండి ఇప్పటివరకు 9 శస్త్ర చికిత్సలు చేయించు కున్నాడు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ ఇంకా చికిత్స కొనసాగించ వలసిన అవసరం ఉంది! ఇప్పటి వరకు సుమారు 21 లక్షల వైద్య ఖర్చులు అయ్యాయరు. ప్రస్తుతం కుటుంబం పూర్తిగా ఆర్థికంగా చితికిపోయి, తదుపరి చికిత్సకు ఎలాంటి మార్గం లేక తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఎన్టీఆర్ జిల్లా నాయకులు పెంట సాయి కిరణ్ ద్వారా రాజ్ కుమార్ తల్లిదండ్రులు వెస్సోస్ ట్రస్ట్ ను సంప్రదించి, తమ కుమారుని చికిత్స కొనసాగించేందుకు ఆర్థిక సహాయం అందించ వలసినదిగా అభ్యర్థించారు. స్పందించిన వెస్సోస్ ట్రస్టీలు గౌరవ దాతల సహకారంతో వెంకటాచారికి 61,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా వెస్సోస్ ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ కుమారుని చికిత్స కొరకు ఉన్నదంతయు అమ్ముకొని, ఎటువంటి ఆధారం లేని పరిస్థితిలో తండ్రి వెంకటాచారికి సమయానికి సహాయపడి ఆదుకున్న గౌరవ దాతలకు హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలను రక్షించాలి...




**నాగర్ కర్నూల్ జులై 28 (స్కై న్యూస్)** మండల పరిధిలోని బొందలపల్లి గ్రామంలో గత 35 సంవత్సరాల క్రితం నిర్మించిన ప్రభుత్వ పాఠశాలను కాపాడాలని సిపిఎం జిల్లా నాయకులు పొదిల రామయ్య డిమాండ్ చేశారు మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ చెన్నయ్యకు వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎస్సీ, బీసీ తరగతులకు చెందిన అనేకమంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని అదే గ్రామానికి చెందిన సర్పంచ్ సుధాకర్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలకు దానపూర్వకంగా తన భూమిని ఇవ్వడం జరిగిందని ఆయన హయాంలోనే పాఠశాల నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు సోమవారం పాఠశాల ప్రారంభ సమయంలో స్కూలు వద్దకు వచ్చిన ఆయన విద్యార్థులను బయటకు పంపించి ఆస్తి పై తనకు హక్కులు ఉన్నాయని నోటీసులు రాయడం పూర్తి హక్కులు తనకు ఉన్నాయని పేర్కొనడం దారుణమని మండిపడ్డారు. రాజకీయ జోక్యం నివారించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సురేష్ నాగపూర్ మధు సుల్తాన్ కాశన్న తదితరులు పాల్గొన్నారు

## ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం



**జోగులాంబ గద్వాల, జూలై28 (స్కై న్యూస్):** గద్వాల డిపోలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పరమేశ్వరయ్య గారి అధ్యక్షతన గేట్ మీటింగ్ మరియు సభను నిర్వహించడం జరిగినది. ముఖ్యంగా ఆర్టీసీ కార్మికులు గత కొన్ని రోజుల క్రితం చేసినటువంటి సమ్మె ఫలితంగా ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ కార్మికులు పెట్టినటువంటి డిమాండ్లను ఒప్పుకోవడంతో ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికలు వచ్చే నెల ఆగస్టులో జరుగుతున్నాయి దీని ఫలితంగా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గము ప్రతి డిపోను సందర్శించి కార్మికులను యూనియన్ ఎలక్షన్లకు సిద్ధపరుస్తున్నది 2019 సంవత్సరంలో గత కేసీఆర్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులు చేసిన 55 రోజుల సమ్మెను నిర్వీర్యం చేసి ఆర్టీసీలో ఉండేటువంటి రాజ్యాంగబద్ధంగా కల్పించినటువంటి యూనియన్లను రద్దుచేసి కార్మికుల పాలిట శాపంగా పరిణమించాడు కానీ గత ఏడు సంవత్సరాలుగా యూనియన్ లేకపోవడం వల్ల కార్మికులు తమ సమస్యలను ఎవరికి చెప్పాలో అర్థం కాక ఆ సమస్యలను పరిష్కరించుకోలేక పెరిగిన కిలోమీటర్ల భారంతో యాజమాన్య ఒత్తిళ్లకు లోనవుతూ అధికారుల వేధింపులకు నరకయాతాలను అనుభవించారు కానీ ఎంప్లాయిస్ యూనియన్ గత ఏడు సంవత్సరాలుగా ఆర్టీసీలో యూనియన్లు రద్దు అయిన తమ వంతు కృషిగా ఏనాడు విశ్రమించకుండా కార్మికుల సమస్యల మీద ఎన్నో పోరాటాలు చేస్తూ యాజమాన్యానికి ప్రభుత్వానికి ఎన్నో లేఖలను రాస్తూ అనేక కార్మిక సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి సమ్మె నోటీసు ఇచ్చి గత నెల ఏప్రిల్ లో జరిగిన మూడు రోజుల సమ్మెలో ఉధృతంగా పాల్గొని ప్రభుత్వ యాజమాన్యాలతో చర్చలు జరిపి ఆర్టీసీలో యూనియన్ల పునరుద్ధరణ రిటైర్ కార్మికుల అలవెన్సు ప్రస్తుతం కార్మికులు అనుభవిస్తున్నటువంటి సమస్యల మీద వారి యొక్క డిమాండ్లు పెడుతూ 2021 పిఆర్సిని ఇప్పిస్తూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి అనే ప్రధానమైన డిమాండ్తో ప్రభుత్వాన్ని ఒప్పించి సమ్మె డిమాండ్లలో భాగంగా ఆర్టీసీలో యూనియన్ ఎలక్షన్లకు గాను ప్రభుత్వ ఉత్తర్వులను ఇచ్చే విధంగా కృషి చేసినది. దీనిలో భాగంగా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ గద్వాల డిపోకు విచ్చేసి కార్మికులు పడుతున్నటువంటి కష్టాలను వివరిస్తూ వారు సాధించుకున్న సమ్మె డిమాండ్లను కూడా ప్రస్తావిస్తూ సభను ఏర్పాటు చేయడం జరిగినది. ఆ సభలో ముఖ్యంగా రాష్ట్ర నాయకులు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న మరియు డిప్యూటీ జనరల్ సెక్రెటరీ అప్పారావు మరియు వైస్ ప్రెసిడెంట్ గోపాల్ , హైదరాబాద్ జోనల్ ప్రెసిడెంట్ వెంకటేష్ పాల్గొనడం జరిగినది. గద్వాల ఏఐటియుసి సిపిఐ పార్టీ అధ్యక్షులు గద్వాల డిపో ఎంప్లాయిస్ యూనియన్ చైర్మన్ఆంజనేయులు గారు ఎంప్లాయిస్ యూనియన్ గద్వాల డిపో గౌరవ అధ్యక్షులు గడ్డం కృష్ణారెడ్డి గారు రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి బసన్న గారు మరియు డిపో అధ్యక్ష కార్యదర్శులు గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు సిసిఎస్ అధ్యక్ష కార్యదర్శులు మహిళా కార్మికులు మొదలగు వారందరూ పాల్గొని సభను విజయవంతం చేయడం జరిగినది.

## చిన్నచింతకుంట రైతు వేదికలో విత్తన మేళా



**చిన్న చింతకుంట జులై 28 (స్కై న్యూస్);** ఎల్-నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేరకు, చిన్నచింతకుంట రైతు వేదికలో సోమవారం నుండి బుధవారం వరకు విత్తన మేళానిర్వహించబడుతుంది.మండలంలోని రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన కందులు, మినుములు, ఆముదం, కూరగాయలు, మిరప తదితర నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగింది అన్నారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ, ఎల్-నినో పరిస్థితుల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ కాలంలో, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా రైతులు నష్టాలను తగ్గించుకోవచ్చని సూచించారు. రైతులు ప్రభుత్వ గుర్తింపు పొందిన కేంద్రాల్లో మాత్రమే నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని తెలిపారు.ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందుబాటులో ఉన్న విత్తనాలను సద్వినియోగం చేసుకుని ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు ముందుకు రావాలని అన్నారు.

## ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ పి వి వ్యాక్సిన్ కార్యక్రమం




**జోగులాంబ గద్వాల, జూలై28 (స్కై న్యూస్):**డిఎంహెచ్వోలి డాక్టర్ సంద్యా కిరణ్ మై ఆదేశాల మేరకు... ఇమ్మైజేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లిమహమ్మద్ అజ్గర్ అలీ ఆధ్వర్యంలోమంగళవారం స్థానిక పాత బస్టాండ్ లిప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నందు వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 14 -15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నివారణకు సంబంధించిన వ్యాక్సిన్ వేశారు. పాఠశాలలో మొత్తం 289 మంది బాలికలు ఉండగా, వారిలో 158 మంది బాలికలకు వ్యాక్సిన్ విజయవంతంగా వేయించారు. మిగతా బాలికల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి త్వరలోనే వ్యాక్సిన్ వేయించేందుకు చర్యలు తీసుకుంటామని పాఠశాల అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో డా. శరణ్య, హెల్త్ సూపర్వైజర్ సుబ్బలక్ష్మి, ఏ ఎం ఎమ్ లు గ్రేస్, అజుబా, ఆశా కార్యకర్తలులి వ్యాక్సినేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు.పాఠశాల హెడ్మాస్టర్ జహరుద్దీన్, టీచర్ విజయలక్ష్మి ఇతర ఉపాధ్యాయులు సహకరించారు. వ్యాక్సిన్ వేసుకున్న బాలికలను 30 నిమిషాల పాటు పరిశీలించిన అనంతరం ఇంటికి పంపించారు

## పాస్టర్ హనుమంతు అనారోగ్యంతో మృతి

**కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్ శివకుమార్**



**చిన్న చింతకుంట జులై 28 (స్కై న్యూస్);** చిన్న చింత కుంట మండలం ఫర్దిపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాస్టర్ హన్మంత్ నిన్న రాత్రి అనారోగ్యంతో మృతి చెందడంతో, మంగళవారం ఆయన భౌతిక దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన గ్రామ సర్పంచ్ తెలుగు శివకుమార్, యాదగిరి,గ్రామ కాంగ్రెస్ నాయకులు అన్నగాని శ్రీను,ఆనంద్ తో పాటు వివిధ గ్రామాల దళితసంఘాల పాస్టర్లు, సంఘాల నాయకులు భూస్థాపన కొరకు ఆర్థిక సహాయం చేశారు.

వార్తాతరంగాలు
బుధవారం 29 జూలై 2026

# కొత్తగూడెంలో 'దా న్యూస్' మ్యాగజైన్ ఆవిష్కరణ



ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా ఆవిష్కరణ

జిల్లా వ్యాప్తంగా పలువురు జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు

**కొత్తగూడెం జూలై 28( స్కై న్యూస్):**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొతతగూడెం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా 'దా న్యూస్' మ్యాగజైన్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా థా మ్యాగజైన్ జిల్లా కరస్పాండెంట్ నక్క శ్రీనివాస్ కి ఎమ్మెల్యే అభినందనలు తెలియజేస్తూ, ప్రజలకు నిజాయితీతో కూడిన వార్తలను అందిస్తూ సమాజ అభివృద్ధికి మీడియా కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దా న్యూస్ మ్యాగజైన్ కరస్పాండెంట్ నక్క వాసు, నిజం న్యూస్ జిల్లా బ్యూరో సత్యనారాయణ, వార్త తరంగాలు జిల్లా బ్యూరో రత్నకుమార్, తెలంగాణ చౌరస్తా జిల్లా బ్యూరో రిషి, మీడియా టుడే రిపోర్టర్ వినోద్ అక్షిత రిపోర్టర్, సతీష్ తో పాటు పలువురు పాత్రికేయులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాల్గొన్న జర్నలిస్టులు మ్యాగజైన్ మరింత ప్రజాదరణ పొందాలని ఆకాంక్షిస్తూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే వార్తలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు.ఖ

# పేపర్ లీక్ ఆందోళనలో విద్యార్థులకు గుడ్‌న్యూస్..

## కేసులు ఎత్తివేసి, విడుదల చేయాలన్న సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జూలై 28:**నీట్ పేపర్ లీక్ ఆందోళన విషయంలో విద్యార్థులకు భారీ ఊరట లభించింది. నేర చరిత్ర లేని 18 ఏళ్ల విద్యార్థులను తక్షణం విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. విద్యార్థులను తక్షణం విడుదల చేయాలని కేంద్రాన్ని కోర్టు ఆదేశించింది. విద్యార్థులపై నమోదు చేసిన కేసులను తక్షణం ఉపసంహరించుకోవాలని కేంద్రంతో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ఘటనలపై సీసీటీవీ ఫుటేజీ వీడియోలను సమర్పించాలని కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు విద్యార్థులకు ఊరట కలిగిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.ఆందోళనల్లో పాల్గొన్న 3000 మంది విద్యార్థులలో 101 మందికి నేర చరిత్ర ఉంది, వారిలో 62 మందిపై హత్యాయత్నం కేసులు ఉన్నాయనని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. విద్యార్థులు, సీజేపీ ఆందోళనలో దాదాపు 200 మంది పోలీసులు గాయపడ్డారని, ఇది సాధారణ విషయం కాదని ప్రభుత్వం తరపున వాదనలు వినిపించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో పోలీసులు లాఠీచార్జ్ చేయడం, గుంపును అదుపు చేసేందుకు టియర్ గ్యాస్ షెల్స్ సైతం ఉపయోగించిన వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. మంగళవారం (జులై 28) ఈ కేసుపై సుప్రీంకోర్టులో విచారణ జరగగా.. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరగాలని, బాధ్యులను కూడా తేల్చాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.విచారణ సందర్భంగా సీజేఐ సూర్యకాంత్ మాట్లాడుతూ.. 'ప్రారంభంలో ఉద్యమం



ప్రశాంతంగా సాగుతుండగా, ఒక్కసారిగా హింస చెలరేగింది. దీనికి రెండు కారణాలు ఉండవచ్చు. మొదటిది పోలీసులు అతిగా కఠినంగా వ్యవహరించడం, రెండోది హింసను ప్రేరేపించాలనుకునే వ్యక్తులు నిరసనకారులలోకి ప్రవేశించడం' అని అన్నారు. ఒకసారి ప్రొటోకాల్ తయారైతే, బాధ్యతను ఖరారు చేయడం సులభమవుతుందని ఆయన చెప్పారు.నిరసనలు జరిగిన అన్ని రాష్ట్రాలను నిరసనలకు సంబంధించిన సిసిటివి ఫుటేజ్, డ్రోన్ రికార్డింగ్‌లు, బాడీ-కెమెరా ఫుటేజ్, వైర్‌లెస్ కమ్యూనికేషన్ రికార్డులు, పిసిఆర్ లాగ్‌లు, ఇతర డిజిటల్ ఆధారాలను భద్రపరచాలని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. నిరసనకారులపై సేకరించిన ఎలాంటి డిజిటల్ డేటానైనా భద్రపరచాలని, అయితే దానిని బయటపెట్టకూడదని కూడా ఆదేశించిందినేర చరిత్ర ఉన్న వ్యక్తులకు ఈ రక్షణ వర్తించదని పేర్కొంటూనే, ఆందోళన బాట పట్టిన విద్యార్థులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని అధికారులను ధర్మాసనం నిరోధించింది. నమోదైన ఎఫ్ఐఆర్‌లపై విచారణను కొనసాగించడానికి ఢిల్లీ ప్రభుత్వానికి అనుమతినిచ్చిన సుప్రీంకోర్టు, ఈ విచారణ ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నంత వరకు అర్హులైన నిరసనకార విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదని తెలిపింది.పిటిషన్లలో లేవనెత్తిన ఆరోపణలపై ఢిల్లీ, మహారాష్ట్ర, బీహార్, కేరళ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ చీఫ్ సెక్రటరీల నుండి కూడా ధర్మాసనం సమాధానాలను కోరింది. ఈ ఆరోపణలు ప్రాథమికంగా నిష్పాక్షికమైన విచారణ అవసరమని సీజేఐ అన్నారు. ఆందోళనలో గాయపడిన 200 మందికి పైగా పోలీసుల కుటుంబాల ఆందోళనలను కూడా ఈ విచారణ పరిష్కరించాలని అన్నారు.నిరసనల సమయంలో జరిగిన అన్ని హింసాత్మక ఘటనలపై సమగ్రమైన విచారణ చేయడానికి స్వతంత్ర కమిటీ లేదా ప్రత్యేక విచారణ బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయడాన్ని పరిశీలించడానికి ముందు, కేంద్రం, సంబంధిత రాష్ట్రాలు తమ అభిప్రాయాలను, నివేదికల్ని సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. పోలీసులు అతిగా ప్రవర్తించారన్న ఆరోపణలపై స్వతంత్ర విచారణ ఎందుకు జరగకూడదని కోర్టు ప్రశ్నించింది. ఎవరైతే ఉద్దేశపూర్వకంగా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారో వారిపై చర్యలు తీసుకోవాలని సీజేఐ స్పష్టం చేశారు.

# డ్రగ్స్ కేసులో హైదరాబాద్, బెంగళూరులో ఈడీ ఆకస్మిక దాడులు..

## మత్తు లింకులపై ఫోకస్!

**హైదరాబాద్, జూలై 28:**హైదరాబాద్‌లో ఇటీవల దొరికిన డ్రగ్స్ కేసుకు సంబంధించి నగరంతో పాటు ఇతర రాష్ట్రాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. చీణూా కేసులో హైదరాబాద్, బెంగళూరులో ఈడీ ఆకస్మిక దాడులు చేపట్టింది. ఎన్‌డిపిఎస్ చట్టం కింద నమోదైన కేసు ఆధారంగా బెంగళూరులోని రెండు చోట్లతో పాటు, హైదరాబాద్‌లోని ఏడు ప్రాంతాల్లో ఈ సోదాలు కొనసాగుతున్నాయి. కోట్ల రూపాయల విలువైన మత్తు పదార్థాలు హైదరాబాద్‌కు రావడం, వాటి సరఫరా వ్యవహారానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కొన్ని బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు.ఈ భారీ డ్రగ్స్ నెట్‌వర్క్‌కు సంబంధించి ముందస్తుగా హైదరాబాద్ పోలీసులు పలువురు నిందితులను అరెస్టు చేశారు. ఆ కేసు దర్యాప్తులో వెలుగుచూసిన అక్రమ ఆర్థిక లావాదేవీలు, మనీ లాండరింగ్ కోణంలోనే ఈడీ అధికారులు ఇప్పుడు బెంగళూరులోని కీలక ప్రాంతాలపై దాడులు నిర్వహించి తనిఖీలు చేస్తున్నారు.హైదరాబాద్‌లోని అబిడ్స్‌లో డ్రగ్స్ చేతులు మారుతున్నాయన్న సమాచారంతో హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూ) పోలీసులు రంగంలోకి దిగారు. ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ నేతృత్వంలోని బృందం పాయల్ ఫుట్‌వేర్ వద్ద నిఘా ఉంచగా, కారులో ఉన్న మహ్మద్ సైఫ్‌కు ఓ వ్యక్తి డ్రగ్స్ ప్యాకెట్ అందించి వెళ్లడాన్ని గమనించారు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకునేందుకు యత్నించగా, సైఫ్ తన కారును వేగంగా రివర్స్ చేసి పోలీసును తొక్కించి, తప్పించుకునే ప్రయత్నం చేశాడు. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ మహేందర్‌యాదవ్ కాలుకు తీవ్రగాయమవగా, ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, కానిస్టేబుల్ వంశీధర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి.గాయపడినప్పటికీ వెనకడగు వేయని పోలీసులు నిందితుడిని సినీఫక్కీలో 2.5 కిలోమీటర్ల దూరం వెంబడించి అఫ్జల్‌గంజ్ సమీపంలో పట్టుకున్నారు. పోలీసులపై దాడికి పాల్పడిన సైఫ్‌పై అబిడ్స్, అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్లలో హత్యాయత్నం కేసులు నమోదు చేసి ఎక్కడి నుంచి డ్రగ్స్ తెచ్చారని లింకులపై ఆరా తీస్తున్నారు.

# ఇక ఫ్యామిలీ రిజిస్టర్ విధానం

**వరంగల్ జూలై 28:**తెలంగాణ ప్రభుత్వం త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఫ్యామిలీ రిజిస్టర్ విధానాన్ని అమలు చేయనుంది. రేషన్ కార్డు డేటా ఆధారంగా ప్రతి కుటుంబానికి ఒకే అధికారిక కుటుంబ రికార్డు రూపొందించనున్నారు. మీసేవా కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా.. 2 రోజుల్లో దినాల్లో సర్టిఫికెట్ జారీ చేసేలా సర్కార్ చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల కోసం ఒకే కుటుంబ రికార్డును వినియోగించేలా ఈ కొత్త విధానం ఉపయోగపడనుంది.తెలంగాణలో ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడంతో పాటు కుటుంబ వివరాల ధ్రువీకరణను ఒకే వేదికపైకి తీసుకురావడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో 'ఫ్యామిలీ రిజిస్టర్' విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఈ విధానం అమల్లోకి వస్తే ప్రతి కుటుంబానికి ఒకే ప్రామాణిక కుటుంబ రికార్డు అందుబాటులోకి రానుంది. రేషన్ కార్డు డేటాను ప్రాతిపదికగా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ సభ్యుల వివరాలను ఒకే రిజిస్టర్‌లో నమోదు చేయనుంది.ఆ తర్వాత మీసేవా కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్, మొబైల్ యాప్ ద్వారా ప్రజలు ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. దరఖాస్తు చేసిన తర్వాత కేవలం రెండు పని దినాల్లోనే సర్టిఫికెట్ జారీ చేసే విధానాన్ని తీసుకురావాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ కొత్త విధానం ద్వారా ప్రభుత్వ పథకాలు, ధ్రువీకరణ పత్రాలు, ఇతర పౌర సేవల కోసం పదే పదే కుటుంబ వివరాలు సమర్పించాల్సిన అవసరం తగ్గనుంది.ఒకే కుటుంబ రికార్డుతో వివిధ ప్రభుత్వ సేవలను పొందే అవకాశం కల్పించడం ద్వారా ప్రజలకు సమయం, శ్రమ ఆదా చేయడంతో పాటు సేవల్లో పారదర్శకత పెంచడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ప్రస్తుతం వేర్వేరు ప్రభుత్వ సేవల కోసం వేర్వేరు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి వస్తుండగా.. ఫ్యామిలీ రిజిస్టర్ అమల్లోకి వచ్చిన తర్వాత ఒకే అధికారిక కుటుంబ రికార్డు ఆధారంగా అనేక సేవలు పొందే వీలు కలగనుంది. త్వరలోనే ఈ సేవలను రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా ప్రారంభించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.ఈ కొత్త విధానం అమలై ఫ్యామిలీ రిజిస్టర్ అందుబాటులోకి వస్తే ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్లు, ఇతర సేవల కోసం పదే పదే కుటుంబ వివరాలు సమర్పించాల్సిన అవసరం ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఫ్యామిలీ రిజిస్టర్‌లో కుటుంబ పెద్ద పేరుతోపాటు.. అందరు కుటుంబ సభ్యుల వివరాలు, కుటుంబ పెద్దతో వారి సంబంధం, వయసు, పుట్టిన తేదీ, కుటుంబం పూర్తి నివాస చిరునామా కూడా ఉండనున్నాయి.ఇది ఆస్తిపై ఎలాంటి చట్టపరమైన హక్కును, యాజమాన్యాన్ని కల్పించదని.. చట్టబద్ధమైన వారసత్వానికి రుజువుగా కూడా పరిగణించలేమని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా ఈ ఫ్యామిలీ రిజిస్టర్ ఎవరినీ సంక్షేమ పథకాలకు అర్హులుగా చేయదని స్పష్టం చేస్తున్నారు. స్థానిక తహసీల్దార్ డిజిటల్ సంతకం చేసిన ఫార్మాట్‌లో ఈ ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్‌ను ప్రభుత్వం జారీ చేయనుంది.

# నచ్చకపోతే పట్టించుకోవద్దు....

## ఫ్యాన్స్‌కు అల్లు అర్జున్ ఇచ్చిన సలహా వెనుక అసలు కారణం ఇదే !

**హైదరాబాద్, జూలై 28:**నీకు ఎవరైనా నచ్చకపోతే వదిలేయండి, అంతేకానీ వాళ్లను హేట్ చేయడం లేదా ట్రోల్ చేయడం సరికాదు. మనకు నచ్చని వారి కోసం మన డబ్బును, ఎనర్జీని ఎందుకు ఖర్చు పెట్టాలి?" అంటూ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫ్యాన్స్ మీట్‌లో సందేశం ఇచ్చారు. గత కొంతకాలంగా అల్లు అర్జున్ చుట్టూ తిరుగుతున్న రాజకీయ వివాదాలు, ఆయనను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం కారణంగా . ఈ వ్యాఖ్యలు కేవలం సామాన్య నెటిజన్లకు మాత్రమే కాకుండా, తెరవెనుక నడుస్తున్న డిజిటల్ రాజకీయంపై వేసిన నేరుగా చేసిన కామెంట్స్ గానే చూడవచ్చు. సోషల్ మీడియాలో జరుగుతున్న సైబర్ దాడి లేదా ట్రోలింగ్ అనేది కేవలం వ్యక్తిగత ద్వేషంతో అప్పటికప్పుడు పుట్టుకొచ్చేది కాదు. రాజకీయ పార్టీలు, హీరోలు, వాటి అనుబంధ డిజిటల్ పిఆర్ ఏజెన్సీలు కోట్ల రూపాయలు ఖర్చు చేసి నడిపిస్తున్న ఒక పెద్ద వ్యూహాత్మక నెట్‌వర్క్ అన్న విమర్శలు ఉన్నాయి. గత ఎన్నికల సమయం నుండి ఆంధ్రప్రదేశ్‌లో వ్యతిరేకులను మానసికంగా దెబ్బతీయడానికి ట్రోల్ సైన్యాలను రంగంలోకి దించారు. మనకు నచ్చని వారి కోసం డబ్బు, ఎనర్జీ ఎందుకు ఖర్చు పెట్టడం అని బన్నీ అనడం వెనుక.. రాజకీయ ప్రయోజనాల కోసం తనను టార్గెట్ చేస్తూ పెయిడ్ క్యాంపెయిన్లు నడుపుతున్న ఏజెన్సీలను, వాటికి నిధులు సమకూరుస్తున్న రాజకీయ శక్తులను ఎండగట్టే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోందని అనుకోవచ్చు. అల్లు అర్జున్ తన వ్యక్తిగత నిర్ణయాల్లో సాంప్రదాయ మెగా చట్రాన్ని దాటి సొంత గుర్తింపును చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఆయన వ్యక్తిగత స్నేహాలకు విలువ ఇస్తారు. గతంలో వైసీపీ నేత నంద్యాల నుంచి పోటీ చేస్తుంటే ఆయన తన మిత్రుడుకాబట్టి ఆయన ఇంటికి వెళ్లారు. అది వివాదాస్పదం అయిది. త ఎన్నికల సమయంలో నంద్యాలలో తన స్నేహితుడికి మద్దతుగా వెళ్లిన ఉదంతం నుండి, తదనంతర పరిణామాల వరకు.. ఆయనను పొలిటికల్ రీజన్స్‌తో దెబ్బతీయడానికి సోషల్మీడియాలో ప్రయత్నాలు జరిగాయి. సినిమా రంగాన్ని, రాజకీయ ప్రయోజనాలను ముడిపెట్టి, డిజిటల్ వేదికలపై అల్లు అర్జున్ వ్యక్తిత్వ హననం చేయడానికి ప్రయత్నించిన రాజకీయ వర్గాలకు తన సైలెంట్ కౌంటర్ ద్వారా అల్లు అర్జున్ గట్టి సందేశాన్ని పంపారని అంటున్నారు.సాధారణంగా ఫ్యాన్ వార్స్ లేదా పొలిటికల్ క్యాంపెయిన్లలో నష్టపోయేది నిరుద్యోగులైన యువత , అభిమానులే. పొలిటికల్ పార్టీలు తమ ప్రయోజనాల కోసం యువతలోని ఆవేశాన్ని వాడుకుంటూ, వారి సమయాన్ని, శక్తిని ద్వేషాన్ని పెంచడానికి ఉపయోగిస్తున్నాయి. మనకున్న 100 శాతం ఛార్జింగ్‌ను మన ఎదుగుదల కోసం వాడుకుందాం అని తన అభిమానులకు అర్జున్ చెప్పిన మాటలు.. ప్రచారాల వలలో చిక్కుకుని విలువైన సమయాన్ని పాడుచేసుకుంటున్న యువతకు ఒక హెచ్చరిక లాంటివి. రాజకీయ నాయకుల లేదా పార్టీల ప్రాపగండాకు బలై, సోషల్ మీడియాలో ద్వేషాన్ని వ్యాప్తి చేయవద్దని ఆయన చేసిన విజ్ఞప్తి ఒక అవసరాన్ని ఎత్తిచూపుతోంది.మొత్తంగా చూస్తే, అల్లు అర్జున్ చేసిన ఈ వ్యాఖ్యలు కేవలం ఫ్యాన్స్ మీట్ లో చెప్పిన పంచ్ డైలాగ్ మాత్రమే కాదు; అది నేటి సోషల్ మీడియా పొలిటికల్ కల్చర్ పై చేసిన తీవ్రమైన వ్యాఖ్య. డిజిటల్ మీడియాను వేదికగా చేసుకుని వ్యక్తిత్వ హననానికి పాల్పడే పొలిటికల్ ప్లాట్‌ఫామ్‌లకు, పిఆర్ నెట్‌వర్క్‌లకు ప్రజాదరణ పొందిన ఒక స్టార్ ఇచ్చిన బలమైన పరోక్ష సమాధానం ఇది. అనుకోవచ్చు.

# రేవంత్ 'యూత్' మంత్రం.. బీజేపీకి రేవంత్‌రెడ్డి మాస్టర్ స్ట్రోక్?

**'జై జవాన్ - జై కిసాన్'కు 'జై యువ'ను జోడించిన రేవంత్‌రెడ్డి**

**దేశ నిర్మాణంలో యువతను భాగస్వాములుగా గుర్తించే యత్నం**

**యువత ఆగ్రహాన్ని, కాంగ్రెస్ వైపు సానుకూలతగా మార్చే వ్యూహాత్మక ఎత్తుగడ**

**జాతీయ స్థాయిలో చర్చకు తెరలేపిన తెలంగాణ ముఖ్యమంత్రి**



"సమస్య వచ్చినప్పుడు స్పందించడం వేరు, ఆ సమస్యనే అవకాశంగా మార్చుకుని రాజకీయ ప్రత్యర్థులను ఇరుకున పెట్టడం వేరు" ఈ సూత్రాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కాగా అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా నీట్ కుంభకోణంపై యువత, విద్యార్థి లోకం అట్టుడుకుతున్న వేళ, ఆయన వేసిన '21 ఏళ్లకే పోటీ' అనే ఎత్తుగడ, సాధారణ రాజకీయ ప్రకటనల కంటే చాలా లోతైనది, వ్యూహాత్మకమైనదిగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**ఆగ్రహాన్ని ఆయుధంగా...**

దేశంలో దాదాపు 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిన నీట్ వ్యవహారం.. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతను పెంచింది. ఈ ఆగ్రహాన్ని కేవలం నిరసనలకే పరిమితం చేయకుండా, దానికి ఒక రాజకీయ రూపాన్ని ఇవ్వడంలో రేవంత్ ముందడుగు వేశారు. "మీరు కేవలం బాధితులు కాదు, రేపటి శాసనకర్తలు కావాలి. మీ సమస్యలను మీరే చట్టసభల్లోకి వచ్చి పరిష్కరించుకోవాలి" అని పరోక్షంగా పిలుపునివ్వడమే ఈ ప్రతిపాదనలోని అసలు మర్మం. ఇది యువతలోని నిస్సహాయతను పారదోలి, వారిలో ఆశను, అధికారంపై ఆకాంక్షను రేకెత్తించే ప్రయత్నం.

**'జై యువ'.. పాత నినాదానికి కొత్త పదును**

లాల్ బహదూర్ శాస్త్రి ఇచ్చిన 'జై జవాన్ - జై కిసాన్' నినాదం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. దానికి 'జై యువ'ను జోడించడం ద్వారా రేవంత్ మూడు కీలక సంకేతాలు పంపారు.

**గుర్తింపు**: సైనికులు, రైతులంత ప్రాధాన్యం యువతకు ఇస్తున్నామని చెప్పడం.

**ఆధునికీకరణ:** కాంగ్రెస్ పార్టీ పాత చింతకాయ పచ్చడి కాదని, ఆధునిక తరమైన 'జెన్-జీ' ఆకాంక్షలను అర్థం చేసుకోగలదని చాటడం.

**ప్రత్యామ్నాయం**: బీజేపీ తరచూ వాడే 'యువశక్తి' అనే నినాదానికి పోటీగా, మరింత ఆచరణాత్మకమైన, అధికార భాగస్వామ్యాన్ని వాగ్దానం చేసే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం.

**జాతీయ వేదికపై రేవంత్**

ఈ డిమాండ్ కేవలం తెలంగాణకు పరిమితమైనది కాదు. దీనికోసం రాజ్యాంగ సవరణ చేయాలి, ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశం. ఆగస్టులో అసెంబ్లీలో తీర్మానం చేసి ప్రధానికి పంపుతామనడం ద్వారా రేవంత్ తన పోరాటాన్ని ఢిల్లీకి మారుస్తున్నారు. తద్వారా, రాహుల్ గాంధీ తర్వాత, బీజేపీకి వ్యతిరేకంగా యువత తరపున బలంగా గళం విప్పుతున్న జాతీయ స్థాయి కాంగ్రెస్ నేతగా తనను తాను ప్రొజెక్ట్ చేసుకుంటున్నారు. ఇది ఆయన వ్యక్తిగత ఇమేజ్‌ను, రాజకీయ బరువును పెంచే ఒక మాస్టర్ స్ట్రోక్.

**దీర్ఘకాలిక వ్యూహం**

21 ఏళ్లకే ఓటు హక్కు ఉన్నప్పుడు, అదే వయసుకు పోటీ చేసే అర్హత ఎందుకు ఉండకూడదనేది తార్కికంగా బలమైన వాదన. ఈ డిమాండ్ నెరవేరినా, నెరవేరకపోయినా కాంగ్రెస్‌కు రాజకీయంగా లాభమే. కేంద్రం ఒప్పుకుంటే, అది కాంగ్రెస్ సాధించిన నైతిక విజయంగా, యువతకు తామిచ్చిన కానుకగా చెప్పుకోవచ్చు. ఒప్పుకోకపోతే, బీజేపీని 'యువత వ్యతిరేకి'గా చిత్రించి, రాబోయే ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా వాడుకోవచ్చు. అంతిమంగా, ఈ చర్చ ద్వారా దేశంలోని కోట్లాది మంది యువ ఓటర్లతో ఒక బలమైన బంధాన్ని ఏర్పరచుకోవడం, వారిని కాంగ్రెస్ వైపు ఆకర్షించడం ఈ వ్యూహంలో కీలక భాగం. మొత్తం మీద, రేవంత్ రెడ్డి ప్రకటనను కేవలం నీట్ బాధితులపై జాలిగా చూడలేం. ఇది ఒకే దెబ్బకు అనేక పిట్టలను కొట్టే రాజకీయ చతురత. యువత ఆగ్రహాన్ని చల్లార్చడం, వారిని ఆకర్షించడం, బీజేపీని ఇరుకున పెట్టడం, తన జాతీయ స్థాయి ఇమేజ్‌ను పెంచుకోవడం వంటి బహుళ ప్రయోజనాలతో కూడిన ఒక పక్కా రాజకీయ ఎత్తుగడ ఇది. ఈ 'జెన్-జీ' అస్త్రం ఎంతవరకు పనిచేస్తుందో, కేంద్రం దీనిపై ఎలా స్పందిస్తుందో కాలమే నిర్ణయించాలి .

## బిజినెస్

### ఐస్‌మేక్‌లో జపాన్ సంస్థ180 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ : పారిశ్రామిక, వాణిజ్య రిఫ్రిజరేషన్ పరిష్కారాల్లో అగ్రగామి సంస్థల్లో ఒకటైన ఐస్‌మేక్ రిఫ్రిజరేషన్ లిమిటెడ్..జపాన్‌కు చెందిన గెలిటీ హోల్డింగ్స్ కో.లిమిటెడ్ రూ.180 కోట్ల పెట్టుబడులు పెట్టింది. ఈ నిధులను ఉత్పత్తి సామర్థ్య విస్తరణకు, కార్యకలాపాల ఆధునీకరణకు వినియోగించనున్నట్టు ప్రకటించింది.

**12 వేల కోట్ల నిధుల సేకరణలో ఎన్‌టీపీసీ**

న్యూఢిల్లీ, జూలై 25: దేశీయ విద్యుత్ ఉత్పత్తిలో అగ్రగామి ప్రభుత్వరంగ సంస్థయైన ఎన్‌టీపీసీ భారీ స్థాయిలో నిధులను సేకరించడానికి సిద్ధమైంది. నాన్-కన్వర్టబుల్ డిబెంచర్లను జారీ చేయడం ద్వారా గరిష్ఠంగా రూ.12 వేల కోట్ల వరకు నిధులను సమీకరణకు కంపెనీ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

### బీఎస్ఎన్ఎల్ నయా బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్లు..
### కస్టమర్ల కోసం ప్రత్యేక ప్లాన్

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్.. బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్ల కోసం ప్రత్యేక ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 25 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 700 జీబీ డాటా ప్లాన్‌ను ఆరు నెలల కాలపరిమితితో రూ.1,449కే అందిస్తున్నది. ఈ డాటా ప్లాన్ ముగిసిన తర్వాత డాటా వేగం 2 ఎంబీపీఎస్‌కు పడిపోనున్నది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారిని దృష్టిలో పెట్టుకొని బీఎస్ఎన్ఎల్ ఈ ప్లాన్‌ను ఆవిష్కరించింది. నెలవారి ప్లాన్ కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. నెలకు రూ.259 చొప్పున వసూలు చేస్తున్నది. అలాగే ఆరు నెలలు తీసుకున్నవారికి నెలకు రూ.241 పడనున్నది. దీంతోపాటు అన్‌లిమిటెడ్ వాయిస్ కాలింగ్, ల్యాండ్‌లైన్ ఫోన్‌ను కొనుగోలు చేయాల్సివుంటుందని తెలిపింది. ప్రస్తుతం మార్కెట్లో మిగతా సంస్థలు నెలకు రూ.1,000 కంటే అధికంగా వసూలు చేస్తున్నారు.

### హోండా నుంచి సరికొత్త కారు.. దేశీయ మార్కెట్‌లో మరో మాడల్




న్యూఢిల్లీ : హోండా కార్స్..దేశీయ మార్కెట్‌కు మరో మాడల్‌ను తీసుకొచ్చింది. ప్రీమియం హైబ్రిడ్ ఎస్‌యూవీ జెడ్ఆర్-వీ ఈ మాడల్‌ను పరిచయం చేసింది. జపాన్ నుంచి దిగుమతి చేసుకొని దేశీయంగా విక్రయించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.47.99 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధరలు నూఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. కేవలం 7.9 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్న ఈ కారు లీటర్ పెట్రోల్‌కు 22.80 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. వైర్‌లెస్ యాపిల్ కార్‌ప్లేతో అనుసంధానమైన 9 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, పూర్తిస్థాయిలో డ్రైవర్ సైడ్ 10.2 ఇంచుల టచ్‌స్క్రీన్, 12 స్పీకర్లు, వైర్‌లెస్ స్మార్ట్‌ఫోన్ చార్జింగ్, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, ఎనిమిది ఎయిర్‌బ్యాగ్‌లు, వెనుక రియర్ పార్కింగ్ సెన్సార్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది

# ఆగస్టులో ఐపీఓల జాతర

**రూ. 25,000 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యం**

**డజనుకు పైగా కంపెనీలు పబ్లిక్ ఆఫర్‌కు సిద్ధం**




ముంబై: దేశీయ ప్రాథమిక మార్కెట్ ఆగస్టులో భారీ ఐపీఓల రాకతో కళకళలాడనుంది. ఇన్వెస్టర్ల నుంచి లభిస్తున్న సానుకూల స్పందన, స్థిరపడుతున్న మార్కెట్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని 12కు పైగా కంపెనీలు తమ తొలి పబ్లిక్ ఆఫర్‌కు సిద్ధమయ్యాయి. రాబోయే నెలలో మార్కెట్లోకి రానున్న ఈ ఐపీఓల ద్వారా కంపెనీలు రూ.25,000 కోట్లకు పైగా నిధులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి.

వీటిలో కొత్త షేర్ల జారీ తో పాటు ప్రమోటర్లు, ఇన్వెస్టర్లు వాటాలు విక్రయించే ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) లు కూడా ఉన్నాయి. 'స్టాక్ మార్కెట్ స్థిరీకరణ సాధించడం, ఇన్వెస్టర్లలో నమ్మకం పెరగడంతో ఇన్నాళ్లూ వేచి చూసిన కంపెనీలు ఇప్పుడు ఐపీఓలకు సన్నద్ధమయ్యాయి. 2026లో ఐపీఓల ద్వారా సుమారు 20 బిలియన్ డాలర్ల (రూ. 1.66 లక్షల కోట్లకు పైగా) నిధులు సమీకరించే అవకాశం ఉంది' అని ఈక్విరస్ క్యాపిటల్ ఎండీ భవేశ్ షా తెలిపారు.

జెప్టో: క్విక్ కామర్స్ దిగ్గజం జెప్టో అత్యంత భారీ ఆఫర్‌తో మార్కెట్లోకి వస్తోంది. కంపెనీ కొత్త షేర్ల జారీ ద్వారా రూ. 8,010 కోట్లు సేకరించడమే కాకుండా, ఓఎఫ్ఎస్ రూపంలో 11.34 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది.

ట్రూహోమ్: ఈ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ రూ. 3,000 కోట్ల ఐపీఓను ప్రతిపాదించింది. ఇందులో రూ.1,500 కోట్ల విలువైన తాజా షేర్లు, రూ.1,500 కోట్ల ఓఎఫ్ఎస్ ద్వారా విక్రయించనుంది.

ఎలివేట్ క్యాంపసెస్: ఈ కంపెనీ పూర్తిగా తాజా ఇష్యూ ద్వారానే రూ. 2,550 కోట్లను సమీకరించాలని నిర్ణయించింది.

షిప్‌రాకెట్: లాజిస్టిక్స్ ప్లాట్‌ఫారమ్ షిప్‌రాకెట్ మొత్తం రూ. 2,342.35 కోట్ల నిధుల సమీకరణలో భాగంగా రూ. 1,100 కోట్ల తాజా షేర్లను, ప్రమోటర్ల ద్వారా రూ. 1,242.35 కోట్ల షేర్లను జారీ చేయనుంది.

**ఈ వారంలో మూడు పబ్లిక్ ఇష్యూలు**

ఈ వారంలో ప్రధానంగా మూడు పబ్లిక్ ఇష్యూలు సబ్?రస్క్రిప్షన్ కోసం రానున్నాయి. వీటన్నింటిలో మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్ ఐపీఓ అతి పెద్ద ఆఫర్. రూ. 9,275 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో వస్తున్న ఈ పబ్లిక్ ఇష్యూ జూలై 29న (బుధవారం) ప్రారంభమై జూలై 31న ముగియనుంది. ధర శ్రేణిని రూ. 560 -- రూ. 590గా నిర్ణయించారు.

ఈ ఐపీఓలో రూ. 8,000 కోట్ల విలువైన తాజా షేర్ల జారీతో పాటు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ప్రమోటర్లు రూ. 1,275.22 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించనున్నారు. అలాగే క్లీన్ ఎనర్జీ రంగానికి చెందిన జునిపర్ గ్రీన్ ఎనర్జీ ఐపీఓ జూలై 30న (గురువారం) ప్రారంభమై ఆగస్టు 3న ముగియనుంది. ఈ కంపెనీ ఎలాంటి ఓఎఫ్ఎస్ లేకుండా, పూర్తిగా కొత్త షేర్ల జారీ ద్వారానే రూ. 1,800 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మూడో ఇష్యూ అయిన ఎంవీ ఎలక్ట్రోసిస్టమ్స్ కూడా జూలై 30 నుంచి ఆగస్టు 3 వరకు అందుబాటులో ఉండనుంది. పూర్తిగా తాజా షేర్ల జారీ రూపంలో రానున్న ఈ ఐపీఓ ద్వారా కంపెనీ రూ. 290 కోట్ల నిధులను సేకరించనుంది.

# దలాల్ స్ట్రీట్‌లో బిగ్ ఫైట్

ముంబై: పశ్చిమాసియా ఉద్రిక్తతలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు, కార్పొరేట్ క్యూ1 ఆర్థిక ఫలితాలు ఈ వారంల దలాల్ స్ట్రీట్‌కు దిశానిర్ధేశం చేయనున్నాయి. ఇరాన్‌పై సైనిక చర్యను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాత్కాలికంగా నిలిపివేయడంతో ముడిచమురు ధరలు 100 డాలర్ల స్థాయి నుంచి కొంత తగ్గినప్పటికీ, భౌగోళిక రాజకీయ అనిశ్చితి మార్కెట్లను వెంటాడుతూనే ఉంది. దీనికి తోడు జులై 28--29 తేదీల్లో జరగనున్న ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల ప్రకటన, జూలై 28న (మంగళవారం) వెలువడే దేశీయ ఐఐపీ గణాంకాలు కీలక పాత్ర పోషించనున్నాయి. మరోవైపు, కార్పొరేట్ రంగానికి వస్తే ఎల్అండ్‌టీ, మారుతీ, హెచ్‌యూఎల్, ఐటీసీ వంటి నిఫ్టీ దిగ్గజాల క్యూ1 ఫలితాలు స్టాక్--ఆధారిత ట్రేడింగ్‌ను నడిపిస్తాయి. వీటికి తోడు ఒకే రోజున నిఫ్టీ వీక్లీ, నిఫ్టీ మంత్లీ, బ్యాంక్ నిఫ్టీ మంత్లీ కాంట్రాక్టుల 'సూపర్ ఎక్స్‌పైరీ' రాబోతుండటంతో దలాల్ స్ట్రీట్‌లో రోలోవర్లు, షార్ట్ కవరింగ్ వల్ల అస్థిరత తీవ్రంగా ఉండే అవకాశం ఉంది.

**కార్పొరేట్ ఫలితాల ప్రకటనలపై కన్ను**

నేడు ట్రేడింగ్ ప్రారంభంలో మార్కెట్ ప్రధానంగా ఐడీఎఫ్‌సీ బ్యాంకు, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ వంటి దిగ్గజాల జూన్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలకు స్పందించాల్సి ఉంటుంది. ఇక ఈ వారంలో లార్సన్ అండ్ టూబ్రో (ఎల్అండ్‌టీ), ఏషియన్ పేయింట్స్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం), మారుతీ సుజుకీ, సన్ ఫార్మా, హిందుస్థాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్), భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్), అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఐఆర్ఎఫ్‌సీ, ఐటీసీ తదితర కంపెనీలు క్యూ1 ఆర్థిక ఫలితాలను ప్రకటించనున్నాయి. ఫలితాలతో పాటు కంపెనీల డిమాండ్ పరిస్థితులు, మార్జిన్లు, మూలధన వ్యయం (క్యాపెక్స్)పై యాజమాన్యాల వ్యాఖ్యలను విశ్లేషకులు నిశితంగా పరిశీలించనున్నారు.

అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమావేశాలు జూలై 28--29 తేదీల్లో జరగనున్నాయి. బుధవారం వెలువడే ప్రకటనలో ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచుతుందని అంచనాలున్నాయి. అయితే పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, బ్యారెల్ క్రూడాయిల్ ధరలు 100 డాలర్లకు చేరుకోవడంతో ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు ఫెడ్ వడ్డీరేట్లను 0.25 శాతం పెంచే అవకాశం ఉందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. వడ్డీ రేట్ల నిర్ణయం కంటే కూడా ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధి, భవిష్యత్ ద్రవ్య విధానంపై ఫెడ్ ఇచ్చే సంకేతాలే మార్కెట్ దిశను నిర్దేశిస్తాయని చెబుతున్నారు. పశ్చిమాసియాలో శరవేగంగా మారుతున్న పరిణామాలు అంతర్జాతీయ మార్కెట్లలో ఆందోళన కలిగిస్తూనే ఉన్నాయి. వైమానిక క్షిపణి నిల్వలు తగ్గడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ఇరాన్‌పై భారీ సైనిక చర్య ప్రణాళికలను డోనాల్డ్ ట్రంప్ నిలిపివేసినట్లు వెలువడిన నివేదికలు మార్కెట్లకు కొంత ఊరటనిచ్చాయి. అయితే మిడిల్ ఈస్ట్‌లో ఏ చిన్న ఉద్రిక్తత తలెత్తినా గ్లోబల్ మార్కెట్లలో అస్థిరత తక్షణం పెరిగే ప్రమాదం ఉంది. మరోవైపు, అమెరికా--ఇరాన్ మధ్య నిలిచిపోయిన శాంతి చర్చలను పునరుద్ధరించడానికి చైనా తీవ్ర ప్రయత్నాలు చేస్తోందన్న వార్తలతో గురువారం (జూలై 23న) 100 డాలర్లకు చేరిన ముడి చమురు ధరలు, శుక్రవారం ఒక్కరోజే 4% కంటే ఎక్కువ పడిపోయాయి. ముడిచమురు ధరల్లో తీవ్ర ఊగిసలాట, ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధిపై ఆందోళనలను పెంచడంతో ఇన్వెస్టర్లు ప్రస్తుతం అప్రమత్తత వైఖరి ప్రదర్శిస్తున్నారు.

# వైభవ్, మయాంక్ ధాటికి చేతులెత్తేసిన
# జింబాబ్వే.. 3-0తో సిరీస్ టీమిండియా కైవసం..!

వరసగా రెండు సిరీస్‌లలో క్లీన్‌స్వీప్‌కు గురైన భారత జట్టు పంజా విసిరింది. ఛాంపియన్ ఆటతో దుమ్మురేపి జింబాబ్వేను వైట్‌వాష్ చేసి తామేంటో నిరూపించింది. నామమాత్రమైన మూడో టీ20లో వైభవ్ సూర్యవంశీ(81) పిడుగల్లే విరుచుకుపడగా.. బంతితో మయాంక్ యాదవ్(3-29) ఆతిథ్య జట్టును దెబ్బకొట్టాడు. టాపార్డర్ వైఫల్యంతో ఏదిశలోనూ లక్ష్యం దిశగా సాగని జింబాబ్వే రియాన్ బర్ల్(54 నాటౌట్)అర్ధశతకంతో రాణించగా ఆలౌట్ ప్రమాదం తప్పించుకున్నా హ్యాట్రిక్ ఓటమితో సిరీస్ సమర్పించుకుంది. టీ20 ఫార్మాట్లో మళ్లీ జోరందుకున్న భారత జట్టు 3-0తో జింబాబ్వేపై సిరీస్ గెలుపొందింది. వరసగా రెండు మ్యాచుల్లో విజయంతో క్లీన్‌స్వీప్‌పై కన్నేసిన టీమిండియా టాప్ గేర్‌లో ఆడి ఆతిథ్య జట్టును చిత్తు చేసింది. హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో తొలుత వైభవ్ సూర్యవంశీ(81) తుఫాన్ ఇన్నింగ్స్‌తో భయపెట్టగా.. అనంతరం బంతితో మయాంక్ యాదవ్(3-29) వణికించాడు. టాపార్డర్ కుప్పకూలడంతో పవర్ ప్లేలోనే ఓటమి అంచున నిలిచిన జింబాబ్వే 157కే పరిమితమైంది. దాంతో, ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో ఓటములతో విమర్శలపాలైన శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్‌గా మొట్టమొదటి సిరీస్ గెలిచి నవ్వు ముఖం పెట్టాడు.

భారీ ఛేదనలో మయాంక్ యాదవ్(3-29) తొలి బంతికే ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(0)ను వెనక్కి పంపాడు. ఆచితూచి ఆడుతున్న డియాన్ మెయర్స్(19), సికిందర్ రజా(0) లను యశ్ ఠాకూర్ ఒకే ఓవర్లో ఔట్ చేశాడు. ఈ ఇద్దరిని వరస బంతుల్లో పెవిలియన్ చేర్చిన యశ్ హ్యాట్రిక్‌పై నిలిచాడు. కానీ, రియాన్ బర్ల్(54 నాటౌట్) వస్తూనే బౌండరీ సాధించాడు. బర్ల్‌తో వికెట్ కాచుకున్న బెన్ కరాన్(20)ను బిష్ణోయ్ బోల్తా కొట్టించగా ఆతిథ్య జట్టు పీకల్లోతు కష్టాల్లో పడింది. ఓవైపు వికెట్లు పడుతున్నా మద్వేరా(28)తో కలిసి ఒంటరిపోరాటం చేసిన బర్ల్ అర్ధశతకంతో అజేయంగా నిలిచాడు. జింబాబ్వే 157కే పరిమితవ్వడంతో 35 పరుగుల తేడాతో టీమిండియా విక్టరీ కొట్టింది.

**వైభవ్ మళ్లీ దంచేయగా**

టాస్ గెలిచిన బ్యాటింగ్ తీసుకున్న భారత జట్టుకు శు భారంభ దక్కలేదు. ఓపెనర్ అభిషేక్ శర్మ(2) మరోసారి ముజరబని ఓవర్లో వెనుదిరగగా.. వైభవ్ సూర్యవంశీ(81), ఇషాన్ కిషన్(29) కీలక భాగస్వామ్యం నిర్మించారు. పవర్ ప్లేలో వికెట్ నష్టానికి 64 రన్స్ చేసింది. జింబాబ్వే బౌలర్లపై అటాకింగ్ గేమ్‌తో విరుచుకుపడిన ఆడిన ఈ ద్వయం హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పింది. ఈ క్రమంలోనే వైభవ్ అంతర్జాతీయ టీ20ల్లో రెండో అర్ధ శతకం సాధించాడు. సికిందర్ రజా ఓవర్లో ఇషాన్ బౌల్డయ్యాక.. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(27)తో కలిసి చెలరేగాడు వైభవ్. సిక్సర్లతో చెలరేగుతూ శతకానికి చేరువైన అతడిని మధ్వీరె పెవిలియన్ చేర్చగా జింబాబ్వే బౌలర్లు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం తిలక్ వర్మ(11 నాటౌట్) జతగా గేర్ మార్చాలనుకున్న అయ్యర్‌నుఎవాన్స్ బోల్తా కొట్టించాడు. రింకూ సింగ్(25) రెడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో మెరవగా టీమిండియా నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది.






## స్పోర్ట్స్

### మూడు రోజులుగా ఏమీ తినలే..
### ఈ మెడల్‌ను నా కుటుంబానికి అంకితమిస్తున్నా..!




కామన్వెల్త్ క్రీడల్లో వరసగా మూడోసారి స్వర్ణంతో చరిత్ర సృష్టించిన మీరాబాయి చాను యావత్ దేశాన్ని సంబురాల్లో ముంచెత్తింది. 48 కిలోల విభాగంలో సత్తా చాటిన మీరాబాయి.. గ్లాస్గోలో భారత్‌కు తొలి స్వర్ణాన్ని అందించింది. పోడియం మీద పతకం అందుకుంటున్న సమయంలో జాతీయ గీతం వింటున్నప్పుడు కలిగే అనుభూతికి మరోది సాటిరాదంటోంది వెయిట్‌లిఫ్టర్. హ్యాట్రిక్ గోల్డ్‌మెడల్స్‌తో తనకు తానే సాటి అని నిరూపించుకున్న మీరాబాయి ఈసారి గెలిచిన పతకాన్ని కుటుంబానికి అంకితమిచ్చింది. గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో దేశానికి తొలి గోల్డ్‌మెడల్ అందించింది మీరాబాయి చాను. 48 కిలోల విభాగంలో ప్రత్యర్థులను తోసిరాజని అగ్రస్థానం నిలబెట్టుకున్న చాను.. బరువును అదుపులో ఉంచుకునేందుకు కడుపు మాడ్చుకుందట. ఈ విషయాన్ని గోల్డ్ ఖరారయ్యాక వెల్లడించిందామె. 'మూడు రోజులుగా ఏమీ తినలేదు. ఎందుకంటే నా బరువును అదుపులో ఉంచుకోవడం చాలా కష్టం. అందుకే అలా ఖాళీ కడుపుతోనే ఉన్నా. ఈ స్వర్ణాన్ని నా కుటుంబానికి అంకితమిస్తున్నా. వరసగా మూడోసారి కామన్వెల్త్ పసిడి గెలిచినందుకు చాలా సంతోషంగా ఉంది. నేను ఎంత ఆనందంగా ఉన్నానో మాటల్లో చెప్పలేను. భారత దేశం కోసం, భారత వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య కోసం గోల్డ్ మెడల్ సాధించినందుకు నాకు చాలా గర్వంగా ఉంది. నాకిది చాలా పెద్ద విషయం' అని చాను భావోద్వేగంతో చెప్పింది.

**తొలి ప్రయత్నంలో విఫలమైనా**

కామన్‌వెల్త్ క్రీడల్లో వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. 2018, 2022లో పసిడి పతకం కొల్లగొట్టిన మీరాబాయి గ్లాస్గోలోనూ పట్టువదల్లేదు. ఈ ఎడిషన్‌లోనూ దేశానికి తొలి స్వర్ణం అందించింది. 82 కిలోలతో కామన్వెల్త్‌లో రికార్డు నెలకొల్పిన మీరాబాయి..క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో తొలి ప్రయత్నంలో విఫలమైంది. రెండోసారి తడబడకుండా 82 కిలోలు, మూడో ప్రయత్నంలో 85 కిలోలు ఎత్తి సరికొత్త రికార్డు సాధించింది. అనంతరం 105 కిలోలను సైతం అవలీలగా ఎత్తిన మీరాబాయి పసిడి పతకంతో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించింది. తద్వారా భారత్ పతకాల సంఖ్య మూడుకు చేరింది. మీరా కంటే ముందు వెయిట్‌లిఫ్టింగ్‌లోనే చనంబమ్ రిషికాంత సింగ్ రజతంతో మెరిశాడు. పురుషుల 60 కిలోల విభాగంలో సత్తా చాటిన అతడు రెండోస్థానంతో సరిపెట్టుకున్నాడు.



# ఎప్పటికైనా రాజమౌళి, సుకుమార్ దర్శకత్వంలో నటిస్తే చాలు

మాస్‌రాజా రవితేజ హీరోగా నటించిన మిస్టర్ బచ్చన్ చిత్రంతో తెలుగు సినీ పరిశ్రమలోకి హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే అడుగుపెట్టింది. మొదటి సినిమా ఫ్లాప్ అయినా తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. తాజాగా భాగ్యశ్రీ, అఖిల్‌తో కలిసి నటించిన లెనిన్ సినిమా ఆమె కెరీర్‌కు మలుపు తిప్పింది. తాజాగా ఈ బ్యూటీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన కెరీర్‌పై ప్రత్యేకమైన కలలు ఏమీ పెట్టుకోలేదని స్పష్టం చేసింది. నాకు ఎలాంటి డ్రీమ్ రోల్స్ లేవు.. ఫ్లోలో వెళ్లిపోవడమే. టార్గెట్లు లాంటివి పెట్టుకుంటే టెన్షన్ వస్తుంది. చిన్న చిన్న టైమ్ లైన్స్ పెట్టుకొని ముందుకు సాగితే మనసుకు చాలా హాయిగా ఉంటుందని ఆమె చెప్పింది.తెలుగు ఇండస్ట్రీలోనే సెటిల్ అవ్వాలని నిర్ణయించుకున్న భాగ్యశ్రీ, తన చివరి చిత్రం కూడా తెలుగులోనే చేస్తానని ఇప్పటికే తెలిపింది. అలా ఈ గ్యాప్‌లో రాజమౌళి, సుకుమార్ దర్శకత్వంలో నటిస్తేచాలని ఆమె ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రస్తుతం భాగ్యశ్రీ తెలుగు నేర్చుకుంటోంది. అంతేకాదు తెలుగు సంస్కృతికి కూడా అలవాటు పడుతోంది. ఉదయం అల్పాహారం నుంచి డిన్నర్ వరకు అన్నింటిలో తెలుగు వంటకాలను ఇష్టపడుతోంది. బ్రేక్‌ఫాస్ట్‌లో ఇడ్లీ, దోశ, ఊతప్పం, ఉప్మా వంటి వంటకాలు తన ఫేవరెట్ లిస్ట్‌లో ఉన్నాయని వెల్లడించింది.

ఇక తనకు ప్రత్యేకంగా ఏ నగరంలో సెటిల్ అవ్వాలని లేదని, కానీ హిల్ స్టేషన్లు అంటే చాలా ఇష్టమని తెలిపింది. బీచ్‌ల కంటే కొండ ప్రాంతంలో ఉండడమే తనకు హాయిగా అనిపిస్తుందని చెప్పింది. ఇటీవల తన సంపాదనతో తల్లికి మొబైల్ ఫోన్ కొనిచ్చిందని తెలిపింది. తనది మధ్యతరగతి కుటుంబమని.. కానీ తల్లిదండ్రుల కోసం ఎంత ఖర్చు పెట్టినా తప్పులేదని ఆమె భావోద్వేగంగా చెప్పింది.




# ఎన్టీఆర్ డ్రాగన్.. మరో స్టార్ నటుడి ఎంట్రీ..!

జూనియర్ ఎన్టీఆర్- ప్రశాంత్ నీల్ కాంబోలో ఓ పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ రాబోతోంది. ఈ మూవీకి డ్రాగన్ అనే టైటిల్ పెట్టనున్నారని ప్రచారం జరుగుతోంది. కేజీఎఫ్ తర్వాత నీల్ తెరకెక్కిస్తోన్న మూవీ కావడంతో టాలీవుడ్ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే డ్రాగన్‌కు సంబంధించిన ఓ క్రేజీ టాక్ వైరలవుతోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటుడు మనోజ్ భాజ్‌పేయి నటించనున్నారని లేటెస్ట్ బజ్ వినిపిస్తోంది. ఇప్పటికే అతన్ని మేకర్స్ సంప్రదించారని టాక్. ఓ కీలక పాత్ర కోసం మనోజ్‌ను చిత్ర యూనిట్ అడిగినట్లు తెలుస్తోంది. ఓకే అయితే వచ్చే షూటింగ్ షెడ్యూల్‌లోనే మనోజ్ ఎంట్రీ ఇస్తాడని సమాచారం. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రంలో కాంతార బ్యూటీ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా కనిపించనుంది. కాగా.. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ మూవీకి నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ యేర్నేని, వై. రవిశంకర్, కొసరాజు హరికృష్ణ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది థియేటర్లలో సందడి చేయనుంది.

# అగధ ప్రచార జాతర

దర్శక,నిర్మాత ఎంఎస్ రాజు రూపొందించిన డివైన్ మిస్టిక్ థ్రిల్లర్ 'అగధ'. కాశీ విశాలాక్షి బలుసు నిర్మించారు. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్‌రెడ్డి ప్రధానపాత్రధారులు. ఆగస్ట్ 14న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా తెలంగాణలోని చారిత్రక, ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం బల్కంపేట ఎల్లమ్మ-పోచమ్మ దేవాలయంలో అమ్మవార్ల దివ్య ఆశీస్సులతో ఈ చిత్ర ప్రచారానికి శ్రీకారం చుట్టారు. 'కొంతమేర అమ్మవారిపై ఆధారపడ్డ కథ ఇది. అనుకోకుండా బల్కంపేట అమ్మవార్ల ఆశీస్సులతో ప్రచారం మొదలవ్వడం ఆనందంగా ఉంది. భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మించాం. గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం. త్వరలోనే ట్రైలర్ రానుంది' అని ఎంఎస్‌రాజు తెలిపారు. ఈ మధ్యకాలంలో ఇలాంటి సినిమా రాలేదు. ఈ తరహా కథలకు ఇదో ట్రెండ్ సెట్టర్ అవుతుంది. ఎంఎస్‌రాజు నిర్మించిన 'దేవి' సంచలన విజయం సాధించింది. 'అగధ' విషయంలో మళ్లీ ఆ చరిత్ర రిపీట్ కానుంది' అని నిర్మాత కాశీ విశాలాక్షి బలుసు నమ్మకం వెలిబుచ్చారు. కథానాయిక కామాక్షి భాస్కర్ల ప్రత్యేకంగా అలంకరించుకొని భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. చిత్ర సమర్పకులు అజయ్ కేఆర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎన్వీఎన్‌లతోపాటు నటులు సుబ్బరాజు, హీరో శ్రవణ్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.





# పారితోషికంగా 20కోట్లు?

ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలోని టాప్ 5 హీరోయిన్లలో సాయిపల్లవి కచ్చితంగా ఉంటారు. ఇప్పటివరకూ సాయిపల్లవి రిజక్ట్ చేసిన సినిమాలు ఉన్నాయి గానీ, సాయిపల్లవిని రిజక్ట్ చేసిన సినిమాలు లేవు. దటీజ్ సాయిపల్లవి. ఆమెను మెప్పించాలంటే ముందు మంచి కథతో వెళ్లాలనేది దేశవ్యాప్తంగా ఉన్న దర్శకనిర్మాతల మాట. కథకు, పాత్రకూ తొలిప్రాధాన్యతనిచ్చే సాయిపల్లవి.. అసలు పారితోషికం ఎంత తీసుకుంటుంది? అనేది మాత్రం చాలామందికి తెలీదు. కానీ ప్రస్తుతం బీటౌన్ సమాచారం ప్రకారం నితేష్ తివారీ దర్శకత్వంలో ఆమె నటిస్తున్న 'రామాయణ' చిత్రానికి రెండు భాగాలకు గాను రూ.20 కోట్లను ఆమె రెమ్యునరేషన్‌గా అందుకుంటున్నదని తెలిసింది. అంటే సినిమా పదికోట్లన్నమాట. ఈ స్థాయి పారితోషికం అందుకునే తారలు ఇండియాలో అరుదు.



# యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై మంగళవారమే చర్చ



పబ్లిక్ పరీక్షల్లో అక్రమాల నిరోధానికి రూపొందించిన చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై జరిగిన ఆందోళనల్లో విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసినందుకు హోంమంత్రి అమిత్ షా క్షమాపణలు చెప్పాలంటూ విపక్షాలు నినాదాల మధ్య బిల్లును సభ ముందుకు తీసుకొచ్చింది. అయితే విపక్షాల నిరసనలతో ఎలాంటి చర్చ జరగనుండానే ఉభయ సభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధికార, విపక్ష సభ్యులతో చర్చించి సయోధ్య కుదిర్చారు. దీనితో మంగళవారం లోక్‌సభలో ఈ బిల్లుపై చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది.

పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలను లీక్ చేసే వారిని కఠినంగా శిక్షించడమే లక్ష్యంగా కేంద్రం పరీక్షల్లో అక్రమాల నిరోధక చట్ట సవరణ బిల్లును లోక్ సభలో ప్రవేశపెట్టింది. విపక్ష సభ్యుల ఆందోళన మధ్య కేంద్రమంత్రి జితేంద్రసింగ్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. పేపర్ లీకేజీలు, పరీక్షల అక్రమాలపై ఉక్కుపాదం మోపేలా చట్టంలో కీలక సవరణలు ప్రతిపాదించినట్లు తెలిపారు. అయితే విపక్షాలు నిరసన కొనసాగించడం వల్ల చర్చ సాధ్యపడలేదు. ఈ క్రమంలో సభ మొదట 12 గంటలకు తర్వాత 2గంటలకు వాయిదా పడింది. తిరిగి సమావేశమైన తర్వాత కూడా విపక్షాలు ఆందోళన కొనసాగించగా స్పీకర్ అధికార, విపక్ష సభ్యులకు 3 గంటలు సమయం ఇచ్చారు. విభేదాలు పరిష్కరించుకోవాలని కోరుతూ సభను సాయంత్రం ఐదు గంటలకు వాయిదా వేశారు. అయితే తిరిగి సమావేశమైనా పరిస్థితిలో మార్పు లేకపోవడం వల్ల సభ మంగళవారానికి వాయిదా పడింది.

రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై ఆందోళన చేసిన విద్యార్థులపై లాఠీఛార్జ్ పై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టాయి. వారి నిరసనల మధ్య సభ మూడు సార్లు వాయిదా పడింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో బిల్లును సభలో ప్రవేశపెట్టి చర్చించేందుకు సభ్యులు సహకరించాలని రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ సింగ్ కోరినప్పటికీ విపక్ష సభ్యులు ఆందోళన కొనసాగించారు. ఈ క్రమంలో సభ సాయంత్రం 5గంటల 15 నిమిషాలకు వాయిదా పడింది. తిరిగి సమావేశమైన తర్వాత చర్చకు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విపక్షాలను మరోసారి కోరారు.

"పబ్లిక్ ఎగ్జామినేషన్స్‌లో అక్రమాల నిరోధానికి అత్యంత కీలకమైన బిల్లును తీసుకొచ్చాం. ఈ బిల్లుపై చర్చ కోసం నిన్న కోరాను. ఇవాళ ఉదయం నుంచి అభ్యర్థిస్తూనే ఉన్నాను. కానీ మీరు (విపక్షాలు)వ్యతిరేకిస్తున్నారు. మళ్లీ కాంగ్రెస్ వాళ్లు బయటకు వెళ్లి సభలో మమ్మల్ని మాట్లాడనియ్యడం లేదని చెబుతున్నారు. నేను చేతులు జోడించి కోరుతున్నా, మీరు సభలో మాట్లాడండి. కానీ మీరేమో మాట్లడడం లేదు. ఇదేం పద్ధతి?" అని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. అయితే విద్యార్థులపై లాఠీఛార్జ్ విషయంలో హోంమంత్రి ప్రకటన చేయాలని విపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే డిమాండ్ చేశారు. "చర్చకు మేమేమీ భయపడడం లేదు. చర్చకు సిద్ధంగా ఉన్నాం. కానీ హోంమంత్రి సభకు వచ్చి ప్రకటన చేయాలి. లాఠీఛార్జ్ చేసి విద్యార్థులను చావగొట్టారు. దీనిపై సమాధానం చెప్పాలి" అని మల్లికార్జున ఖర్గే అని అన్నారు. దీని తర్వాత ఉపాధ్యక్షుడు హరివంశ్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

అయితే లోక్‌సభలోని అన్నిపక్షాలతో సమావేశమైన స్పీకర్ ఓంబిర్లా అత్యంత కీలకమైన బిల్లుపై చర్చకు సహకరించాలని కోరారు. యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంగళవారం చర్చ చేపట్టేందుకు అన్నిపక్షాలు అంగీకరించినట్లు పార్లమెంటు వర్గాలు తెలిపాయి.

**ఈ బిల్లులో ఏముంది?**

ఈ ప్రతిపాదిత బిల్లు ప్రకారం, పరీక్షల్లో అక్రమ పద్ధతులను అవలంబిస్తే కనీసం 5 ఏళ్ల నుంచి గరిష్ఠంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించేలా చట్టంలో మార్పులు ప్రతిపాదించారు. జరిమానాను రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచేందుకు ప్రతిపాదన చేశారు. సర్వీస్ ప్రొవైడర్స్‌కి విధించే జరిమానాను రూ.1కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచుతూ నిబంధన చేర్చారు. పరీక్షల నుంచి సర్వీస్ ప్రొవైడర్స్‌ని నిషేధించే కాలాన్ని 4 ఏళ్ల నుంచి 8 ఏళ్లకు పొడిగిస్తూ ప్రతిపాదనలు చేశారు. ఒక వేళ నేరం రుజువైతే, కంపెనీ డైరెక్టర్లు లేదా ఉన్నతాధికారులకు కనీసం 5 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 కోట్ల వరకు జరిమానా విధించనున్నారని తెలుస్తోంది.

# అలా జరగకపోతే దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళనలు చేపడతాం



నీట్ ఆందోళనల సందర్భంగా కేంద్ర ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాన్ని ఉల్లంఘించారని ఆరోపిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (జబీూ) కేంద్ర ప్రభుత్వానికి మరోసారి వార్నింగ్ ఇచ్చింది. విద్యార్థులపై నమోదైన కేసుల్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేసింది. లేనిపక్షంలో మళ్లీ దేశవ్యాప్తంగా నిరసనలకు దిగుతామని హెచ్చరించింది. సోమవారం రోజు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పార్టీ ప్రతినిధి ఆశుతోష్ రాంకా- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌లను ఉద్దేశించి పోస్ట్ చేశారు. నిరసనకారులపై ఎలాంటి పోలీసు చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీని పాటించడం లేదని ఆరోపించారు.

బిహార్, బెంగాల్‌లో వందల మంది విద్యార్థుల్ని అరెస్ట్ చేశారని, దిల్లీ సహా ఇతర రాష్ట్రాల్లో ఆందోళనకు మద్దతు ఇచ్చిన వాలంటీర్లను పోలీసులు వేధిస్తున్నారని రాంకా ట్వీట్ చేశారు. నిరసనకారులపై రిజిస్టర్ అయిన అన్ని ఎఫ్‌ఐఆర్‌లను వెంటనే రద్దు చేయాలని, ఇప్పటికే అదుపులోకి తీసుకున్న విద్యార్థుల్ని విడుదల చేయాలని అన్నారు. ఇంకా భవిష్యత్తులో కూడా కొత్త కేసులు నమోదు చేయబోమని లిఖిత పూర్వక హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అనంతరం మీడియాతో మాట్లాడిన రాంకా- జులై 25న మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌తో జరిగిన మూడో విడత చర్చల్లో కీలక ఒప్పందం కుదిరిందని వెల్లడించారు. జంతర్ మంతర్ నిరసనలు, జులై 20న జరిగిన ఆందోళనతో పాటు దేశవ్యాప్తంగా జరిగిన నిరసనలకు సంబంధించి నిరసనకారులు, నిర్వాహకులపై నమోదైన అన్ని ఎఫ్‌ఐఆర్‌లను ఉపసంహరించుకోవాలన్న ప్రతిపాదనకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. భవిష్యత్తులో కూడా కొత్త కేసులు నమోదు చేయబోమని హామీ ఇచ్చిందన్నారు.

ఈ ఒప్పందానికి సంబంధించిన డ్రాఫ్ట్ పేపర్లను తాము ఇప్పటికే జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌కు అందజేశామని, మంగళవారం నాటికి ప్రభుత్వం కూడా లిఖితపూర్వక ఒప్పందం ప్రతిని అందిస్తామని చెప్పిందని ఆశుతోష్ రాంకా అన్నారు. ఇరు పక్షాల న్యాయవాదులు పరిశీలించిన తర్వాత తుది ఒప్పందం ఖరారవుతుందని చెప్పారు. మంగళవారం లోపు ప్రభుత్వం లిఖితపూర్వక ఒప్పందాన్ని అందించకపోతే, వివిధ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకున్న విద్యార్థులు, యువతను విడుదల చేయకుంటే కాక్రోచ్ జనతా పార్టీ మళ్లీ దేశవ్యాప్తంగా ఆందోళనలు ప్రారంభించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇదిలా ఉండగా పార్లమెంటులో కూడా ఈ అంశం ప్రతిధ్వనించింది. బిహార్‌లో విద్యార్థులపై పోలీసుల చర్యలు, కాల్పుల ఆరోపణలపై సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ సభ్యులు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దీనికి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**న్యాయసహాయం కోసం ఆన్‌లైన్ ఎయిడ్ ఫండ్!**

నీట్ పేపర్ లీక్ అంశంపై ఆందోళన ముగిసిన తర్వాత కూడా విద్యార్థులపై కేసులు నమోదు చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసిన సీజేపీ కీలక నిర్ణయం తీసుకుంది. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులకు న్యాయ సహాయం అందించేందుకు ప్రజల విరాళాలతో ఆన్‌లైన్ లీగల్ ఎయిడ్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. గతంలో జరిగిన పలు ఉద్యమాల్లో నిరసనలు ముగిసిన తర్వాత పలువురిని లక్ష్యంగా చేసుకొని, తప్పుడు కేసులు పెట్టిన ఘటనలు జరిగాయని సీజేపీ ప్రధాన ప్రతినిధి సౌరవ్ దాస్ అన్నారు. అదే పరిస్థితి మళ్లీ తలెత్తే అవకాశం ఉందనే అనుమానంతో ఉద్యమాన్ని విరమించే ముందు, తర్వాత కూడా సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సలహాలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారికి న్యాయ సహాయం అందించేందుకు తాను రూ. 1 కోటి విరాళం ఇస్తున్నట్లు ప్రకటించారు కపిల్ సిబల్. దేశవ్యాప్తంగా న్యాయవాదులు కూడా ముందుకొచ్చి విద్యార్థులకు న్యాయ సహాయం అందించాలని పిలుపునిచ్చారు.

**ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో తొలి విచారణ వాయిదా**

నీట్- యూజీ 2026 పేపర్ లీక్ కేసు విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో తొలి విచారణ సోమవారం వాయిదా పడింది. ఈ కేసులో సీబీఐ తరఫున న్యాయవాది ఎవరూ హాజరుకాకపోవడంతో న్యాయస్థానం విచారణను ఆగస్ట్ 3 కు వాయిదా వేస్తూ, తదుపరి విచారణకు తప్పనిసరిగా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించాలని ఆదేశించింది. ఈ పరిణామంపై కాంగ్రెస్, కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ- 'పేపర్ లీక్ కేసుల్ని వేగంగా విచారించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశామని కేంద్రం చెబుతుంటే, తొలి విచారణకే సీబీఐ న్యాయవాది హాజరుకాకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం.' అని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం పేపర్ లీక్‌లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఎలా చెప్పగలదని ప్రశ్నించారు.

**జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల సందడి!**

మరోవైపు జంతర్ మంతర్ దగ్గర 36 రోజుల పాటు సాగిన సీజేపీ విద్యార్థుల నిరసనల తర్వాత అక్కడ పరిస్థితులు క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటున్నాయి. నిరసన శిబిరాలు తొలగించినప్పటికీ, ఆందోళనలు జరిగిన ప్రదేశాన్ని చూసేందుకు దిల్లీతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులు, యువత అక్కడికి వస్తున్నారు. కొందరు సెల్ఫీలు తీసుకుంటుండగా, మరికొందరు సోషల్ మీడియాలో చూసిన ప్రదేశాన్ని ప్రత్యక్షంగా చూడాలని వచ్చినట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో జంతర్ మంతర్ వద్ద కొత్త నిరసనలు కూడా ప్రారంభమయ్యాయి. గోర్ఖాలాండ్ రాష్ట్ర ఏర్పాటు కోసం గోర్ఖాలాండ్ రాష్ట్రీయ మంచ్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. మరోవైపు మహిళలకు పార్లమెంటులో 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని మరో మహిళా సంఘం కూడా నిరసనలు కొనసాగిస్తోంది.

## ఆకివీడు రామాలయానికి సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్



పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో ప్రతిపాదిత రామాలయ నిర్మాణానికి న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. ఆలయ నిర్మాణాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో నిర్మాణానికి మార్గం సుగమమైంది. జిల్లా కలెక్టర్ జారీ చేసిన నిరభ్యంతర పత్రం చట్టబద్ధమేనని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రభుత్వ స్థలంలో నిబంధనల మేరకు ఆలయ నిర్మాణం చేపట్టడంలో ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొంది. ఆలయ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌లో బలం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ప్రభుత్వ భూమిలో నిబంధనలకు అనుగుణంగా ఆలయం నిర్మించేందుకు అనుమతి ఇవ్వడంలో తప్పేమీ లేదని వెల్లడించింది. సుప్రీంకోర్టు తీర్పును స్థానికులు, భక్తులు స్వాగతించారు. ఆలయ నిర్మాణ పనులు ఇక వేగం పుంజుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ తీర్పు రామభక్తులకు ఆనందాన్ని కలిగించిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు హర్షం వ్యక్తం చేశారు. "ఆకివీడులో రామాలయ నిర్మాణానికి సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆలయ నిర్మాణానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. సత్యం గెలిచింది. ధర్మం గెలిచింది. శ్రీరాముడు గెలిచాడు. జై శ్రీరామ్" అంటూ 'ఎక్స్' వేదికగా స్పందించారు

## యుద్ధ విరామంతో దిగొచ్చిన చమురు ధరలు



అమెరికా-ఇరాన్ మధ్య వారాంతంలో సైనిక దాడులు నిలిచిపోవడంతో అంతర్జాతీయ ముడి చమురు ధరలు సోమవారం భారీగా తగ్గాయి. బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర ఏకంగా ఏడు శాతం మేర పడిపోగా, అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) చమురు కూడా ఏడు శాతం వరకు తగ్గింది. దీంతో గత మూడు వారాలుగా కొనసాగిన భారీ ర్యాలీకి తాత్కాలిక బ్రేక్ పడింది. ఇరాన్ ఇకపై అమెరికా దాడులు జరగనంత వరకు తాము కూడా దాడులకు దిగబోమని సంకేతాలు ఇవ్వడంతో ఉద్రిక్తతలు తగ్గుతాయన్న అంచనాలు మార్కెట్‌లో పెరిగాయి. దీంతో బ్రెంట్ చమురు ధర బ్యారెల్‌కు సుమారు 91 డాలర్ల వద్దకు, డబ్ల్యూటీఐ ధర 85 డాలర్ల దిగువకు చేరింది. గత వారంలో హర్మూజ్, బాబ్ ఎల్ మండెబ్ జలసంధుల్లో సరఫరాలకు అంతరాయం ఏర్పడుతుందనే భయంతో బ్రెంట్ ధర 100 డాలర్ల మార్కును దాటిన విషయం తెలిసిందే. అయితే ప్రమాదం పూర్తిగా తొలగిపోలేదని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎర్ర సముద్రంలోని సౌదీ అరామ్‌కో చమురు కేంద్రాలపై హౌతీ తిరుగుబాటుదారుల దాడులు భౌగోళిక ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతున్నట్లు సూచిస్తున్నాయని పేర్కొంటున్నారు.

## భారత కరెన్సీపై పదేళ్ల ఆంక్షలకు తెర



భారత కరెన్సీ వినియోగంపై నేపాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు పదేళ్లుగా కొనసాగుతున్న ఆంక్షలను సడలిస్తూ, రూ. 200, రూ. 500 విలువైన భారత కరెన్సీ నోట్లను దేశంలోకి తీసుకురావడానికి, తీసుకెళ్లడానికి అనుమతించింది. భారతీయులు, నేపాలీ పౌరులు ఇరు దేశాల మధ్య ప్రయాణించేటప్పుడు రూ. 25,000 పరిమితికి లోబడి ఈ నోట్లను తమ వెంట ఉంచుకోవచ్చని స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో 2016లో భారత్ చేపట్టిన నోట్ల రద్దు అనంతరం విధించిన నిబంధనలకు తెరపడినట్లయింది. నేపాల్ రాష్ట్ర బ్యాంక్ (ఎన్ఆర్‌బీ) ఈ మేరకు ఒక అధికారిక ప్రకటనను తిరిగి జారీ చేసింది. 2016 నవంబర్ 9 తర్వాత ముద్రించిన కొత్త రూ. 200, రూ. 500 నోట్లకు మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది. నోట్ల రద్దుకు ముందు చెలామణిలో ఉన్న పాత రూ. 500, రూ. 1,000 నోట్లపై నిషేధం యథావిధిగా కొనసాగుతుందని పేర్కొంది. వాస్తవానికి ఈ నిబంధనలు ఫిబ్రవరి 11నే నేపాల్ గెజిట్‌లో ప్రచురితమైనప్పటికీ, అమలులో స్పష్టత కోసం కేంద్ర బ్యాంక్ మరోసారి ఈ ప్రకటన విడుదల చేసింది. ఈ మార్పులపై ఎన్ఆర్‌బీ ప్రతినిధి గురు ప్రసాద్ పౌడెల్ మాట్లాడుతూ.. నేపాల్ పౌరులు భారత్ నుంచి మాత్రమే ఈ కరెన్సీని దేశంలోకి తీసుకురావాలని, అలాగే నేపాల్ నుంచి భారత్‌కు తప్ప మరే ఇతర దేశానికీ తీసుకెళ్లరాదని స్పష్టం చేశారు. ఈ తాజా నిర్ణయంతో ఇరు దేశాల మధ్య వాణిజ్యం, వ్యాపారం, పర్యాటకం మరింత సులభతరం కానుంది. ముఖ్యంగా నేపాలీ వ్యాపారులు, భారత పర్యాటకులకు ఇది ఎంతో ప్రయోజనం చేకూర్చనుంది. భారత్, నేపాల్ మధ్య స్వేచ్ఛాయుత సరిహద్దు ఉండటంతో పాటు ప్రజల మధ్య, వాణిజ్యపరంగా బలమైన సంబంధాలు ఉన్నాయి. భారత్, నేపాల్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. నోట్ల రద్దు తర్వాత కేవలం రూ. 100, అంతకంటే తక్కువ విలువైన నోట్లను మాత్రమే అనుమతించడంతో ప్రయాణికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు మొత్తం నగదు పరిమితి రూ. 25,000గా ఉన్నప్పటికీ, అధిక విలువ కలిగిన నోట్లను అనుమతించడం వల్ల సరిహద్దుల్లో నగదు లావాదేవీలు సులభతరం కానున్నాయి. ఇతర విదేశీ కరెన్సీల విషయంలో ఎటువంటి డిక్లరేషన్ లేకుండా 5,000 డాలర్ల వరకు దేశంలోకి తీసుకువచ్చే నిబంధన యథాతథంగా కొనసాగుతుంది.

# రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలి



అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ ఆరోపణలపై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ ఘటనపై రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఆదేశించింది. ఐజీ ఎస్.కిరణ్? నేతృత్వంలో నలుగురు సభ్యుల బృందం విరాళాల దుర్వినియోగంపై దర్యాప్తు చేస్తోందని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, సిట్‌లో ఐదో సభ్యుడిగా ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా చేర్చాలని ఆదేశించారు. విరాళాల నిధుల మళ్లింపు, రికార్డుల తనిఖీకి ఫోరెన్సిక్ నిపుణుడి అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై దర్యాప్తును వేగవంతం చేయాలని సిట్‌ను ఆదేశించిన ధర్మాసనం, రెండు వారాల్లో దర్యాప్తు పురోగతిపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది. అయితే విరాళాల వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టాలన్న పిటిషనర్ విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. సిట్ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విచారణ సందర్భంగా సుప్రీంకోర్టుకు కీలక విషయాలు వెల్లడించారు. "మేము ఇన్?స్పెక్టర్? జనరల్ ఆఫ్? పోలీస్? కిరణ్? ఎస్? నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేశాం. ఇందులో ఒక డిప్యూటీ ఇన్?స్పెక్టర్? జనరల్ (డీఐజీ), ఒక సీనియర్? సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్? (ఎస్?ఎస్?పీ), ఒక అడిషనల్ సూపరింటెండెంట్? ఆఫ్ పోలీస్? (ఏఎస్?పీ) ఉన్నారు. ఈ బృందంలో ఫోరెన్సిక్? ఆడిటర్?ను కూడా భాగం చేస్తాం. జులై 25న ఏర్పాటైన ఈ సిట్ ప్రస్తుతం ఈ? కేసును దర్యాప్తు చేస్తోంది " అని చెప్పారు. ఇక పిటిషనర్లలో ఒకరి తరఫున హాజరైన సీనియర్ అడ్వకేట్? దేవదత్? కామత్ తన వాదనలు వినిపిస్తూ, "ప్రజలు రూ.500, రూ.1000 నోట్లను విరాళాలుగా ఇచ్చారు. కానీ ఆ డబ్బు ట్రస్ట్?కు చేరలేదు. ట్రస్ట్?కు లభించిన మొత్తాన్ని వెబ్?సైట్?లో ఉంచితే, తమ డబ్బు ఎక్కడకు చేరిందో ప్రజలు తెలుసుకుంటారు. ఇదేమీ లిటిగేషన్? వ్యాజ్యం కాదు" అని అన్నారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం సిట్?కు అన్ని వివరాలు పరిశీలించే అవకాశం ఉంటుందని, పైగా ప్రస్తుతానికి ఈ కేసును క్లోజ్ చేయడం లేదని పేర్కొంది. "ప్రస్తుతానికి మీరంతా సమస్యలను నోట్ చేసుకోండి. ఇప్పుడు మా పూర్తి దృష్టి దర్యాప్తుపైనే ఉంది. మనకు వేగవంతమైన, నాణ్యమైన దర్యాప్తు అవసరం. మూకు నివేదిక సమర్పించమని వారిని అడుగుతున్నాం. మిగిలిన విషయాలను మేము తర్వాతి దశలో నిర్ణయిస్తాం" అని బెంచ్? స్పష్టం చేసింది.

**రాజకీయం చేయొద్దు**

ఇంతకు ముందు అయోధ్య రామమందిర విరాళాల కేసుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసును రాజకీయం చేయవద్దని, కోర్టులు రాజకీయాలకు వేదిక కాదని స్పష్టం చేసింది. ఇది ఒక సాధారణ నేరమని, తాము సరైన మార్గంలో దర్యాప్తు జరిగేలా చూస్తామని తెలిపింది. కాగా, ఈ కేసు దర్యాప్తునకు యూపీ గవర్నమెంట్ ఓ సిట్?ను ఏర్పాటు చేసిందని, ప్రస్తుతం ఆ రాష్ట్ర పోలీసులు దానిపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నారని సుప్రీంకోర్టుకు సొలిసిటర్ జనరల్ వెల్లడించారు. దీనితో సుప్రీంకోర్టు తదుపరి విచారణను జులై 27కు వాయిదా వేసింది.

సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్? వి.మోహనాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసుపై విచారణ చేసింది. ఈ సందర్భంగా అయోధ్య రామమందిర విరాళాల అక్రమాలపై విచారణ సిట్? చేయవచ్చా? అని ఉత్తరప్రదేశ్? ప్రభుత్వాన్ని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. అంతకుముందు సొలిసిటర్ జనరల్ మెహతా మాట్లాడుతూ, కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఉత్తరప్రదేశ్? రాష్ట్ర ప్రభుత్వం స్టేటస్? రిపోర్టు దాఖలు చేసిందని తెలిపారు. "దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటి వరకు 8 మందిని అరెస్టు చేశారు. నేను అంత కంటే ఎక్కువ వివరాలు వెల్లడించలేను" అని అన్నారు. దీనితో కేసును సిట్? దర్యాప్తు చేస్తోందా? అని కోర్టు ప్రశ్నించగా, "నిజానిజాలను తెలుసుకోవడానికి మాత్రమే సిట్? ఏర్పాటు చేశారు. ఇప్పుడు దీనిని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో ఒక నేరం జరిగిందని మాత్రమే సిట్? కనిపెట్టింది" అని తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137